ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం 18.11.2025 | సంపుటి :12 సంచిక : 118 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

# మక్కాలో మహావిషాదం



## సౌదీలో డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొన్న టూరిస్టు బస్సు

## 45 మంది హైదరాబాదీల మృతి



### ఒకే కుటుంబానికి చెందిన 18 మంది సజీవదహనం

- ప్రమాదం నుంచి బతికి బయటపడ్డ ఒకే ఒక్కడు
- మృతి చెందిన వారిలో 17 మంది పురుషులు, 18 మంది మహిళలు, 10 మంది చిన్నారులు
- మృతలంతా హైదరాబాద్ పాతబస్తీ వాసులు
- మక్కాకు వెళుతుండగా ప్రమాదం
- ప్రమాదంపై సీఎం రేవంత్ తీవ్ర దిగ్భ్రాంతి
- ప్రధాని మోడీ, తదితరుల సంతాపం

రియాద్(జనంసాక్షి): సౌదీ అరేబియాలో ఘోర విషాద ఘటన చోటు చేసుకుంది. మదీనాకు సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 45 మంది హైద రాబాదీలు మృతిచెందారు. యాత్రికులతో వెళ్తోన్న బస్సు.. డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొనడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. సౌదీ అరేబియాలో సోమవారం తెల్లవారుజామున ఈ ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మదీనాకు సమీపంగా భారీ రోడ్డు ప్రమాదం సంభవించింది. మక్కా నుంచి మదీనా వెళుతున్న యాత్రికుల బస్సు డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొట్టడంతో మంటలు చెలరేగి పెద్ద దుర్ఘటన చోటుచేసుకుంది. ఈమంటల్లో హైదరాబాద్‌కు చెందిన 45 మంది యాత్రికులు ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తెలిపిన వివరాల ప్రకారం 54 మంది యాత్రికుల బృందం నవంబర్ 9 న హైదరా బాద్ నుంచి జెద్దాకు బయలు దేరింది. నవం బర్ 23 వరకు టూర్‌ను ప్లాన్ చేశారు. వారిలో నలుగురు ముందుగానే కారులో

మిగతా 2లో..



## ప్రజాపాలన వారోత్సవాల తర్వాతే

# 'స్థానిక'పోరు



## డిసెంబరు రెండో వారంలో షెడ్యూల్

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ సమావేశంలో కీలక నిర్ణయం

సౌదీ ప్రమాద మృతుల కుటుంబాలకు

## రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా

- మంత్రి అజారుద్దీన్ నేతృత్వంలో సౌదీ అరేబియాకు ప్రభుత్వ బృందం
- అక్కడే అంత్యక్రియలకు ఏర్పాట్లు
- తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయం

హైదరాబాద్(జనంసాక్షి):సౌదీ అరేబియా బస్సు ప్రమాదంలో మరణించిన కుటుంబాలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. మృతుల కుటుంబాలకు రూ.5లక్షలు చొప్పున పరిహారం ఇవ్వాలని నిర్ణయించింది. సోమవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశమైంది.

మిగతా 2లో..

### ప్రజాపాలన వారోత్సవాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గ్రామాల్లో పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని నిర్ణయం

హైదరాబాద్(జనంసాక్షి): స్థానిక సంస్థల ఎన్నికలపై తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజాపాలన వారోత్స వాల తర్వాత ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. డిసెంబర్ 1 నుంచి 9 వరకు ప్రజాపాలన వారోత్సవాలు నిర్వహించనున్నారు. ఆ తర్వాత ఎప్పుడైనా ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. బిసి రిజర్వేషన్ల వ్యవహారంతో ఆగిపోయిన స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. డిసెంబర్ రెండో వారంలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ఉంటుందని పేర్కొంది. ప్రజాపాలన వారోత్స వాల తర్వాతే లోకల్ బాడీ ఎలక్షన్స్ ఉంటాయని మంత్రివర్గ భేటీ స్పష్టం చేసింది. డిసెంబర్ 1 నుంచి 9 వరకు తెలంగాణ ప్రజాపాలన వారోత్సవాలు జరగనున్నాయి. వారోత్సవాల సమయంలో ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేబినెట్ నిర్ణయించింది. స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా సర్పంచ్ సహా జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అయితే ముందుగా సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలని కేబినెట్ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. సర్పంచ్ ఎన్నికల తరవాతే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించాలని మంత్రివర్గ భేటీలో చర్చించినట్లు సమాచారం. జూబ్లీహిల్స్ ఎన్నికల ఫలితంనే లోకల్ బాడీ ఎలక్షన్‌లలో పునరావృతం చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తోంది. ఇక తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల పదవీకాలం ముగిసి 20 నెలలు పూర్తయ్యాయి. ఇటీవల బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశం తీవ్ర వివాదాస్పదమైంది. దీనిపై హైకోర్టు, సుప్రీం కోర్టు వ్యతిరేకంగా తీర్పు నిచ్చాయి. రిజర్వేషన్లు 50 శాతం దాటరాదన్న నిబంధనలను పాటించాలని సూచించాయి. మొత్తానికి డిసెంబర్‌లో ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల కానుంది. సిఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సోమవారం నాడు రాష్ట్ర సచివాలయంలో

మిగతా 2లో..



### బిహార్ ముఖ్యమంత్రి నీతీశే..

వెల్లడించిన భాజపా రాష్ట్ర అధ్యక్షుడు

పాట్నా(జనంసాక్షి): బిహార్ ముఖ్యమంత్రిగా మరో సారి నీతీశ్ కుమార్ బాధ్యతలు తీసుకోనున్నారు. ఆయనే సీఎంగా కొనసాగుతారని సోమవారం భాజపా రాష్ట్ర అధ్యక్షుడు దిలీప్ జైశ్వాల్ వెల్లడించారు. దీనిపై ఎన్డీయే భాగస్వామ్యపక్షాల నుంచి అధికారిక స్పందన రావడమే మిగిలిఉందన్నారు. మరోవైపు నీతీశ్ తన రాజీనామాను గవర్నర్‌కు అందించారు.మంగళవారం ఉదయం రాష్ట్ర

మిగతా 2లో..

# పైరసీని ప్రోత్సహించొద్దు

- 'ఐ బొమ్మ' రవితో సినీ పరిశ్రమకు తీరని నష్టం
- అతడి హార్డ్ డిస్క్‌లో 21 వేలకు పైగా సినిమాలు
- బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసేలా పైరసీ
- తద్వారా రూ.20కోట్ల అక్రమ సంపాదన
- రూ.3 కోట్లు అకౌంట్‌లో ఫ్రీజ్ చేశాం: సీపీ సజ్జనార్
- కార్మికుల కష్టాన్ని దోచుకుంటున్న పైరసీకారులు
- ఐబొమ్మ రవి అరెస్ట్‌తో అప్రమత్తం కావాలి
- పైరసీ ద్వారా వ్యక్తిగత సమాచారం కూడా చోరీ
- సజ్జనార్‌ను కలిసి అభినందించిన సినీ పెద్దలు

### క్షమించండి..మీ దేశంలో మా సేవలు శాశ్వతంగా నిలిపివేశాం : ఐ బొమ్మ

2లో..

హైదరాబాద్(జనంసాక్షి): పైరసీతో సినీ పరిశ్రమకు భారీ నష్టం కలిగిందని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జన్నార్ అన్నారు. పైరసీని అరికట్టే క్రమంలో ఐ బొమ్మ రవిని అరెస్ట్ చేశామన్నారు. ఐ బొమ్మ రవిపై మూడు పైరసీ కేసులున్నాయని తెలిపారు. రవి.. వెబ్ సైట్ డిజైన్, డెవలపింగ్‌లో ఆరితేరాడని, సీక్రెట్ కెమెరాలతో కొత్త సినిమాలను పైరసీ చేస్తాడని తెలిపారు. దమ్ముంటే పట్టుకోండి అంటూ పోలీసులకు ఛాలెంజ్ చేసిన ఐ బొమ్మ రవి ప్రస్తుతం జైల్లో ఊచలు లెక్కపెడుతున్నాడు. రవి అరెస్ట్‌పై సీపీ సజ్జనార్ సినీ ప్రముఖులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పైరసీపై సంచలన విషయాలు బయటపెట్టారు. ఐ బొమ్మ రవి హార్డ్ డిస్క్ లలో దాదాపు 21 వేలకు పైగా సినిమాలు ఉన్నాయని తెలిపారు. పైరసీ ద్వారా రవి రూ. 20 కోట్లు సంపాదించాడని, అందులో రూ. 3 కోట్లు ఫ్రీజ్ చేశామని చెప్పారు. రవికి ఇంటర్నేషనల్ లింక్స్ ఉన్నాయని, ఈ కేసు ఛేధించేందుకు జాతీయ స్థాయి సంస్థల సహకారం తీసుకుంటామని స్పష్టం

మిగతా 2లో..



# షేక్‌హసీనాకు ఉరిశిక్ష

- ఢాకా ట్రైబ్యునల్ కోర్టు సంచలన తీర్పు
- అల్లర్లలో కాల్పులకు ఆదేశించారన్న అభియోగంలో దోషిగా నిర్ధారణ

ఢాకా(జనంసాక్షి):ఢాకా అల్లర్లకు కారణమంటూ బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు అక్కడి కోరటు ఉరిశిక్ష విధించింది. దశాబ్దాల పాటు ఆ దేశ రాజకీయ చరిత్రను తానై నడిపించిన ఆమెను 'ఉక్కు మహిళ'గా వ్యవహరిస్తుంటారు. కానీ, తన హయాంలో ఏర్పడ్డ ట్రైబ్యునలే.. ఇప్పుడు ఆమెకు మరణశిక్ష విధించింది. ఇటీవలి అల్లర్ల తరవాత ఆమె భారత్‌లో ఆశ్రయం పొంది ప్రవాస జీవితం గడుపుతున్నారు. ఆమె ప్రభుత్వం అసమ్మతిని అణచివేసిందని, మీడియాపై ఆంక్షలు విధించిందని, ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేసిందని, భద్రతా శక్తుల అధికారాలను పెంచిందనే ఆరోపణలు వచ్చాయి. 2024లో స్వాతంత్య పోరాట వీరుల పిల్లలకు ప్రభుత్వ ఉద్యోగాల్లో కోటాకు వ్యతిరేకంగా మొదలైన విద్యార్థి నిరసనలు చివరికి దేశవ్యాప్త తిరుగుబాటుగా

మిగతా 2లో..



### తీర్పు మోసపూరితం

ప్రజాస్వామ్య విరుద్ధంగా ఏర్పడిన ప్రభుత్వం కుట్ర చేసి శిక్ష పడేలా చేసింది

నాకు నేను నిరూపించుకోవడానికి కోర్టు న్యాయమైన అవకాశం ఇవ్వలేదు : హసీనా

2లో..

### ఇప్పటికైనా హసీనాను మాకు అప్పగించండి

- కోర్టు తీర్పు నేపథ్యంలో భారత్‌కు బంగ్లా లేఖ..
- బంగ్లాదేశ్ ప్రజల ప్రయోజనాలకు కట్టుబడి ఉన్నాం
- ఆ దేశంలో అన్ని పక్షాలతో నిర్మాణాత్మకంగా వ్యవహరిస్తాం : భారత్

2లో..

### రష్యాతో వ్యాపారం చేస్తే భారీ వడ్డింపులు

- 500శాతం టారీఫ్‌లు విధిస్తాం: ట్రంప్
- జాబితాలో భారత్..!

వాషింగ్టన్(జనంసాక్షి):రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధం ఆపేందుకు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా అది సాధ్యం కాక పోవడంతో రష్యాతో వ్యాపారం చేసే దేశాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పెద్దమొత్తంలో సుంకాలు విధిస్తున్న విషయం తెలిసిందే. సుంకాల పెంపునకు సంబంధించిన బిల్లుకు తాను మద్దతిస్తున్నట్లు తాజాగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించారు. మాస్కోతో వాణిజ్యం చేసే దేశాలపై మరిన్ని కఠిన చర్యలకు సిద్ధమవుతున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా రష్యాతో వ్యాపారం చేసే దేశాలపై 500 శాతం టారిఫ్‌లు విధిస్తానన్నారు.

మిగతా 9లో..

### జూబ్లీహిల్స్ దెబ్బకు బీఆర్ఎస్, బీజేపీలు

# గల్లంతు

- మరో 15 ఏళ్లు కాంగ్రెస్‌దే అధికారం
- ఉపఎన్నిక ఫలితమే అందుకు నిదర్శనం
- ప్రజల ఆశీర్వాదంతో సంక్షేమం, అభివృద్ధికి బాటలు వేస్తాం
- ఓ పార్టీకి డిపాజిట్ గల్లంతైతే, మరో పార్టీ నాలుగు ముక్కలయ్యింది
- మిర్యాలగూడ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి



మిర్యాలగూడ(జనంసాక్షి):జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ విజయంతో బీఆర్ఎస్, బీజేపీలు గల్లంతైయ్యాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. మిర్యాలగూడ నియోజకవర్గ ప్రజల చెమట, రక్తం, త్యాగంతో కాంగ్రెస్ ను గెలిపించిన ప్రజల నమ్మకాన్ని మర్చిపోలేమని, వారు చేసిన మేలుకు రుణం తీర్చుకునేందుకు మిర్యాలగూడ నియోజకవర్గాన్ని తెలంగాణ రాష్ట్రంలోనే రోల్ మోడల్ గా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి, నీటి పారుదల శాఖ మంత్రి నలమాధ ఉత్తమ్ కుమార్ రెడ్డి, రోడ్లు భవనాల శాఖామంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిలు అన్నారు. సోమవారం నల్గొండ జిల్లా మిర్యాలగూడలోని కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రూ. 4 కోట్ల 41 లక్షల వ్యయంతో నిర్మించిన అదనపు భవనం, రూ.2 కోట్ల 25 లక్షల వ్యయంతో నిర్మించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవనం లను ప్రారంభించిన అనంతరం మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలో రూ.75 కోట్ల 25 లక్షలతో వ్యయంతో చేపట్టనున్న పనులతో పాటుగా, రూ. 74 కోట్ల వ్యయంతో వేములపల్లి మండలం శెట్టి పాలెం నుండి మిర్యాలగూడ మండలం అవంతిపురం వరకు నిర్మించనున్న రింగు రోడ్డు పనుల అభివృద్ధి పనులకు నల్గొండ ఎంపీ కుందూరు రఘువీరారెడ్డి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ లతో కలిసి వారు శంకుస్థాపనలు చేశారు. అనంతరం

మిగతా 2లో..

### ఎమ్మెల్యేల అనర్హతపై నెల రోజుల్లో నిర్ణయం తీసుకోండి

అసెంబ్లీ స్పీకర్‌కు సుప్రీం హుకుం

న్యూఢిల్లీ(జనంసాక్షి):తెలంగాణ స్పీకర్ తీరుపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎమ్మెల్యేల అనర్హతపై మీరు నిర్ణయం తీసుకుంటారా? మేము తీసుకోవాలా ? అని సుప్రీంకోర్టు తెలంగాణ స్పీకర్‌ను ప్రశ్నించింది. ఎమ్మెల్యేల ఫిరాయింపు వ్యవహారంలో కోర్టుధిక్కర పిటిషన్‌పై తెలంగాణ స్పీకర్‌కు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోక పోవడంపై కేటీఆర్ కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం విచారణ జరిగింది. కోర్టుధిక్కారంపై నాలుగు వారాల్లోగా జవాబు చెప్పాలని స్పీకర్‌కి దేశ

మిగతా 2లో..



# కొలువుల పండుగ

### ఆరోగ్యశాఖలో పూర్తయిన 1284 ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల భర్తీ

- సెలక్షన్ లిస్ట్ విడుదల చేసిన మంత్రి రాజనర్సింహ
- గడిచిన రెండేళ్లలో 9 వేలకుపైగా పోస్టుల భర్తీ
- త్వరలో మరో 7 వేలకుపైగా పోస్టులు



హైదరాబాద్(జనంసాక్షి):డాక్టర్లు, వైద్య సిబ్బందితో ప్రభుత్వ హాస్పిటళ్లు కలకలలాడుతున్నాయని.. పేషెంట్లకు మెరుగైన సేవలు అందుతున్నాయని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ల్యాబ్ టెక్నీషియన్ (గ్రేడ్-2) పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను సోమవారం ఆయన విడుదల చేశారు. ప్రభుత్వ హాస్పిటళ్లలోని 1284 ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల భర్తీకి గతేడాది చివరిలో మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్ విడుదల చేయగా, 24,045 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 23,323 మంది బోర్డు నిర్వహించిన పరీక్షకు (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) హాజరయ్యారు. వీరిలో పోస్టులకు ఎంపికైన వారి జాబితాను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు సిద్ధం చేయగా, సెక్రటేరియట్‌లో హెల్త్ సెక్రటరీ క్రిస్టినా, ఇతర అధికారులతో కలిసి మంత్రి దామోదర్ రాజనర్సింహ సోమవారం ఆ జాబితాను విడుదల చేశారు. అనంతరం, ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల వివరాలు, వారు సాధించిన మార్కుల వివరాలను బోర్డు వెబ్‌సైట్‌లో అధికారులు అప్‌లోడ్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఉద్యోగం సాధించిన అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ హాస్పిటళ్లలో మౌలిక వసతుల కల్పనకు అన్ని చర్యలూ తీసుకుంటున్నామన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడిన

మిగతా 2లో..

జనంసాక్షి www.janamsakshi.org
మంగళవారం 18.11.2025

# రష్యాతో వ్యాపారం చేస్తే దేశాలపై భారీ వడ్డింపులు

ఈ దేశాల జాబితాలో భారత్, చైనా ఉన్నట్లు తెలుస్తోంది. ఇరాన్‌ను కూడా ఇందులో చేర్చనున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తూ.. ఉక్రెయిన్‌కు సాయం చేయని దేశాల ఉత్పత్తులపై 500 శాతం సుంకం విధిస్తున్నామన్నారు. భారత్, చైనాలే ఆ దేశం నుంచి 70శాతం చమురును కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ బిల్లు అమల్లోకి వస్తే.. రష్యా నుంచి పెద్దమొత్తంలో ముడి చమురు కొనుగోలు చేస్తున్న భారత్, చైనాలపై తీవ్ర ప్రభావం పడుతుంది. మన ఔషధాలు, వస్త్రాలు వంటి ఎగుమతులపై ప్రభావం పడుతుంది. ఈ బిల్లును రిపబ్లికన్ సెనేటర్ లిండ్సే గ్రాహం ఇటీవల ప్రతిపాదించారు.రష్యాకు సహకరిస్తున్న దేశాలపై కఠిన చర్యలు తీసుకోవడం తప్ప ప్రస్తుతం తమ దేశానికి వేరే మార్గం లేదని ట్రంప్ పేర్కొన్నారు. ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని ముగించేలా రష్యా కాల్పుల విరమణ ఒప్పందానికి అంగీకరిస్తే మాస్కోతో వ్యాపారం చేస్తున్న దేశాలపై టారిఫ్‌ల తగ్గింపునకు చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు.

# జూబ్లీహిల్స్ దెబ్బకు బీఆర్ఎస్, బీజేపీలు గల్లంతు

హనుమాన్ పేట ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రతి పేదవాడు రెండు పూటలా కడుపునిండా అన్నం తినేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్నబియ్యంను రేషన్ ద్వారా అందించిన ఘనత కాంగ్రెస్కే దక్కిందన్నారు. ప్రజల ఆశీర్వాదంతో తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తామన్నారు. ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అద్భుత విజయాన్ని సాధించడంతో ప్రతిపక్షాలు జీర్ణించుకోలేక పోతున్నాయన్నారు. ఈ ఉపఎన్నిక విజయంతో ఓ పార్టీకి డిపాజిట్ గల్లంతు కాగా మరో పార్టీ నాలుగు ముక్కలైందన్నారు. ఓటమిని అంగీకరించాల్సిన బిఆర్ఎస్ పార్టీ అనవసర ఆరోపణలు చేస్తూ మరింతగా దిగజారి పోయిందన్నారు. ఓటమిపాలైనప్పటికీ కేటీఆర్ లో అహంకారం మాత్రం తగ్గలేదని ఎద్దేవా చేశారు. మిర్యాలగూడ నియోజకవర్గంలో సుమారు రూ. 238 కోట్ల నిధులతో ప్రతి రోడ్డును డబల్ రోడ్డుగా మారుస్తామని తెలిపారు. మిర్యాలగూడ లోని కేఎన్ఎం కళాశాలను ప్రభుత్వ కళాశాల గా మార్చేందుకు ఈ ప్రాంతం వారితో కలిసి ఆనాటి ముఖ్యమంత్రి దివంగత నేత వైయస్సార్ ను కలిసి కొట్లాడిన సంగతిని గుర్తు చేశారు. మళ్లీ అదే కెఎన్ఎం డిగ్రీ కళాశాలలో నూతన భవనాన్ని ప్రారంభించడానికి రావడం తనకు ఆనందంగా ఉందని తెలిపారు. మన ఎంపీ రఘువీర్ రెడ్డితో కలిసి కేంద్రం నుండి నిధులను తీసుకువచ్చి మిర్యాలగూడ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే బాధ్యత తమదేనన్నారు. మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా పాలన ప్రభుత్వంలో ప్రజలందరూ సంతోషంగా ఉండేందుకు 6 గ్యారెంటీల పథకంతో అన్ని రంగాల ప్రజలకు అభివృద్ధి ఫలాలను అందిస్తున్నామన్నారు. సుమారు రూ. 60 వేల కోట్లతో తెలంగాణ రాష్ట్రంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించి రాష్ట్ర అభివృద్ధికి కంకణ బద్దులుగా పని చేస్తున్నామన్నారు. ఎక్కడ ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే స్పందించి ఆ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని మిర్యాలగూడ నియోజకవర్గ ప్రజలకు హామీ ఇచ్చారు. మిర్యాలగూడలో రూ.74 కోట్ల వ్యయంతో 14.8 కిలోమీటర్ల పొడవున శెట్టిపాలెం నుండి కాల్వపల్లి మీదుగా అవంతిపురం వరకు నిర్మితమవుతున్న రింగురోడ్డు పనులను రెండు సంవత్సరాల వ్యవధిలోని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చే బాధ్యత తమదే అన్నారు. అదేవిధంగా రూ. 57 కోట్ల నిధులతో మేజర్ కాలువ లైనింగ్ పనులను చేపడుతున్నట్లు, రూ. 8 కోట్ల వ్యయంతో దుబ్బ తండా చెక్ డాం, రూ. 9 కోట్ల వ్యయంతో రావులపెంట చెక్ డాం, అదేవిధంగా రూ.7 కోట్ల 92 లక్షల వ్యయంతో ఆగమోత్కూర్ ఫీడర్ ఛానల్ తో పాటుగా నిర్మాణంలో ఉన్న 5 లిఫ్ట్ ప్రాజెక్టులను త్వరలోనే పూర్తి చేసి వచ్చే ఏడాది నాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. నల్గొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ నల్గొండ జిల్లాలో పెండింగ్ లో ఉన్న అన్ని రకాల పనులను పూర్తి చేయుటకు నిధులను మంజూరు చేయిస్తున్నానని తెలిపారు. అదేవిధంగా తన ఎంపీ నిధులతో మిర్యాలగూడలో బాలికల గురుకుల హాస్టల్ తో పాటు జూనియర్ కళాశాలలో మరో అదనపు భవన నిర్మాణానికి నిధులను అందిస్తానని తెలిపారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ సామాజిక సేవతోనే ప్రజల ఆశీర్వాద బలముతో తాను ఎమ్మెల్యేగా ఎన్నికయ్యానని ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా నియోజకవర్గంను తెలంగాణ రాష్ట్రంలోని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కంకణబద్ధుడిగా పనిచేస్తున్నట్లు తెలిపారు. గత పాలకులు కేవలం మాటలకే పరిమితం అయ్యారని తాను ఆచరణలో చూపిస్తున్నానని తెలిపారు. ఎన్నో ఏండ్లుగా ఎన్నో ప్రమాదాలకు నిలయంగా మారిన బైపాస్ రోడ్డులో ఫ్లైఓవర్ నిర్మాణాలను చేపట్టి మిర్యాలగూడను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నట్లుగా తెలిపారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ తో పాటు డి.ఎస్.పి రాజశేఖర్ రాజు పర్యవేక్షణలో అన్ని ఏర్పాట్లు చేయడంతో పాటు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నూకల వేణుగోపాల్ రెడ్డి, చిలుకూరు బాలు, గాయం ఉపేందర్ రెడ్డి, మహమ్మద్ జావేద్, దేశిడి శేఖర్ రెడ్డి, భీమేష్, బెజ్జం సాయి తదితరులున్నారు.

# మక్కాలో మహావిషాదం

మదీ నాకు వెళ్లగా, మరో నలుగురు మక్కాలోనే నిలిచిపోయారు. మిగిలిన 46 మంది బస్సులో ప్రయాణం కొనసాగించారు. మదీనా నుండి సుమారు 25 కిలోమీటర్ల దూరంలో బస్సు చమురు ట్యాంకర్‌ను ఢీకొట్టడంతో ఒక్కసారిగా అగ్నిప్రమాదం చెలరేగిందని తెలిపారు. డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొనగానే మంటలు చెలరేగి బస్సు మొత్తం వ్యాపించాయి. ప్రమాద సమయంలో యాత్రికులంతా నిద్రలో ఉండటంతో మృతుల సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ఘటనాస్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ప్రమాదంలో అబ్దుల్ షోయబ్ అనే యాత్రికుడు మాత్రమే ప్రాణాలతో బయటపడ్డాడు. అతను ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మరణించిన వారిలో మల్లేపల్లి, బజార్‌ఘాట్, ఆసిఫ్‌నగర్ ప్రాంతాల వారూ ఉన్నట్లు తెలుస్తోంది. భారత కాలమానం ప్రకారం సోమవారం ఉదయం 1.30 గంటల సమయంలో ఈ ఘోర ప్రమాదం జరిగింది. యాత్రికులంతా నిద్రలో ఉండడం వల్ల మరణాలు అధికంగా నమోద య్యాయని అధికారులు భావిస్తున్నారు. ప్రమాద స్థలంలో రక్షణ చర్యలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో సౌదీ అరేబియాలోని జెడ్డా భారత దౌత్య కార్యాలయం ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రకటించింది. 24 ఏళ్ల మొహమ్మద్ అబ్దుల్ షోయబ్ డ్రైవర్ పక్కన కూర్చోవడంతో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. షోయబ్ హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి. గాయాల పాలైన షోయబ్‌ను హాస్పిటల్‌లో చేర్చారు. అయితే అతడి ఆరోగ్య పరిస్థితిపై పూర్తి సమాచారం బయటకు రాలేదు . ప్రమాదంలో షోయబ్ కుటుంబ సభ్యులందరూ చనిపోయినట్టు తెలుస్తోంది.

**ఒకే కుటుంబంలో 18 మంది మృతి**

హైదరాబాద్: సౌదీ అరేబియాలో జరిగిన ఘోర



బస్సు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబం

రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్‌లోని విద్యానగర్‌కు చెందిన నజీరుద్దీన్ కుటుంబంలోని 18 మంది మృతి చెందారు. నసీరుద్దీన్ ఓ విశ్రాంత రైల్వే ఉద్యోగి. తన కుటుంబ సభ్యులతో కలిసి మక్కా యాత్రకు వెళ్లారు. అంతలోనే ఈ ఘోర ప్రమాదం వారి కుటుంబాన్ని కబళించింది. విషయం తెలుసుకున్న నసీరుద్దీన్ బంధువులు, స్నేహితులు అతడి నివాసం వద్దకు చేరుకున్నారు. ఆ ప్రాంతంలో విషాదఛాయలు అలముకున్నాయి.

**సీఎం రేవంత్ దిగ్భ్రాంతి**

సౌదీ అరేబియా సోమవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాద ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంపై సీఎం వెంటనే స్పందించారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలుసుకోవాలని రాష్ట్ర సీఎస్ రామకృష్ణారావు, డీజీపీ శివధర్‌రెడ్డిని ఆదేశించారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. మక్కా నుంచి మదీనా వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందని మీడియాలో వార్తలు వచ్చాయని.. ఈ ఘటనలో హైదరాబాద్ వాసులు కూడా ఉన్నారని తెలిసి తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నానని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఘటనలో తెలంగాణకు చెందిన వారు ఎంతమంది ఉన్నారో వెంటనే తెలుసుకోవాలని అధికారులను ఆదేశించారు సీఎం. కేంద్ర విదేశాంగ శాఖ, సౌదీ ఎంబస్సి అధికారులతో మాట్లాడాలని అధికారులకు సూచించారు. అవసరమైతే వెంటనే తగిన సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో సీఎస్ రామకృష్ణారావు ఢిల్లీలోని రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్‌ను అప్రమత్తం చేశారు. ఈ ప్రమాదంలో తెలంగాణకు చెందిన వారు ఎంతమంది ఉన్నారనే వివరాలు సేకరించి వెంటనే అందించాలని సీఎస్ రామకృష్ణారావు కోరారు. సౌదీలో జరిగిన బస్సు ప్రమాద బాధిత కుటుంబాలకు తగిన సమాచారాన్ని, సహాయ సహకారాలు అందించేందుకు సచివాలయంలో కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్లు ఏర్పాటు చేసినట్లు సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సౌదీ అరేబియా ఘటనకు సంబంధించి పూర్తి వివరాల కోసం 91 79979 59754, ?91 99129 19545 ఈ నెంబర్లలో సంప్రదించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.

**ప్రధాని మోడీ తీవ్ర దిగ్భ్రాంతి**

మక్కా యాత్రకు వెళ్లిన పలువురు భారతీయ యాత్రికులు మదీనాలో రోడ్డు ప్రమాదానికి గురై పెద్ద సంఖ్యలో యాత్రికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంపై భారత ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం తన ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. 'మదీనా రోడ్డు ప్రమాదంలో భారతీయులు మృత్యువాత పడటం బాధాకరం. ఈ ప్రమాదంలో తమ ప్రియమైన వారిని కోల్పోయిన కుటుంబసభ్యులకు నా ప్రగాఢసానుభూతి. గాయపడ్డ వారు అత్యంత త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను. రియాద్‌లో ఇండియన్ ఎంబసీ, జెడ్డాలోని కాన్సులేట్ సాయం అందిస్తున్నాయి. భారత అధికారులు సౌదీ అధికారులతో ఈ ప్రమాదం గురించి ఎప్పటికప్పుడు చర్చిస్తూ ఉన్నారు' అని అన్నారు. కాగా, సోమవారం తెల్లవారు జామున భారతీయ యాత్రికులు మక్కాలో ప్రార్థనలు ముగించుకుని బస్సులో మదీనా వెళుతూ ఉన్నారు. వారు ప్రయాణిస్తున్న బస్సు 1.30 గంటల ప్రాంతంలో డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొట్టింది. దీంతో బస్సులో మంటలు చెలరేగాయి. పెద్ద సంఖ్యలో యాత్రికులు సజీవ దహనం అయ్యారు. మరికొంత మంది తీవ్రంగా గాయపడ్డారు.

**కుటుంబీలకు కిషన్ రెడ్డి, పిసిసి చీఫ్‌ల పరామర్శ**

సౌదీ అరేబియాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్‌లోని విద్యానగర్‌కు చెందిన నజీరుద్దీన్ కుటుంబంలోని 18 మంది మృతి చెందారు. దీంతో ఈ ప్రాంతంలో తీవ్ర విషాదం అలముకుంది. నజీరుద్దీన్ మృతితో స్థానికులు కన్నీరు పెట్టారు. నసీరుద్దీన్ ఓ విశ్రాంత రైల్వే ఉద్యోగి. తన కుటుంబ సభ్యులతో కలిసి మక్కా యాత్రకు వెళ్లారు. అంతలోనే ఈ ఘోర ప్రమాదం వారి కుటుంబాన్ని కబళించింది. విషయం తెలుసుకున్న నసీరుద్దీన్ బంధువులు, స్నేహితులు అతడి నివాసం వద్దకు చేరుకున్నారు. ఆ ప్రాంతంలో విషాదఛాయలు అలముకున్నాయి. బాధిత కుటుంబ బంధువులను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పరామర్శించారు. కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ఎలాంటి అవసరం ఉన్నా తనను సంప్రదించాలని భరోసా ఇచ్చారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్.. నసీరుద్దీన్ ఇంటికి వెళ్లి ఆయన బంధువులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఇప్పటికే ఆ దిశగా చర్యలు మొదలు పెట్టినట్లు చెప్పారు. మరోవైపు నసీరుద్దీన్ ఇంటి వద్ద రోదనలు మిన్నంటాయి. ఒకే కుటుంబంలో 18 మంది ప్రాణాలు కోల్పోవడాన్ని నమ్మలేకపో తున్నామంటూ ఆయన బంధువులు, స్నేహితులు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు 18 మంది అంత్యక్రియలను సౌదీలోనే నిర్వహించనున్నట్లు నసీరుద్దీన్ బంధువులు పేర్కొన్నారు. మరోవైపు ఇదే ప్రమాదంలో.. హైదరాబాద్ పాతబస్తీ బహదూర్‌పురాకు చెందిన ఐదుగురు మృతి చెందారు. మృతుల కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్ పరామర్శించారు. సౌదీలో సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో 45 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. వీళ్లంతా హైదరాబాద్ వాసులేనని తెలంగాణ హజ్ కమిటీ ఓ ప్రకటన విడుదల చేసింది. మృతి చెందిన వారిలో 17 మంది పురుషులు, 18 మంది మహిళలు, 10 మంది చిన్నారులు ఉన్నట్లు పేర్కొంది. మొత్తం నాలుగు ట్రావెల్ ఏజెన్సీల ద్వారా ఈనెల 9న హైదరాబాద్ నుంచి వీరంతా ఉమ్రాకు బయల్దేరారు. విజయవంతంగా మక్కా యాత్ర పూర్తిచేసుకుని మదీనాకు వెళు _న్న సమయంలో రోడ్డు ప్రమాదం జరిగింది. మదీనాకు 25 కి.మీ దూరంలో బస్సు-డీజిల్ ట్యాంకర్ ఢీకొన్నాయి.

# కొలువుల పండుగ

తర్వాత 9 వేలకుపైగా పోస్టులను భర్తీ చేశామని, మరో 7 వేలకుపైగా పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతున్నదని తెలిపారు. డాక్టర్లు, నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మ సిస్ట్ వంటి ముఖ్యమైన పోస్టులతో పాటు, వైద్య సేవలు మెరుగుపర్చేందుకు అవసరమైన ఇతర అన్నిరకాల పోస్టులనూ భర్తీ చేస్తున్నామని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చే నాటికి డాక్టర్లు, సిబ్బంది లేక వెల వెలబోయిన హాస్పిటళ్లు, ఇప్పుడు కలకలలాడుతున్నాయని, పేషెంట్లకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయన్నారు. వీలైనంత త్వరలో మిగిలిన పోస్టుల భర్తీ ప్రక్రియను కూడా పూర్తి చేస్తామని తెలిపారు.

# నెల రోజుల్లో నిర్ణయం తీసుకోండి

అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్. గవాయి ధర్మాసనం విచారణ జరిపింది. మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోకపోవడం కోర్టు ధిక్కారమే.. రోజువారీగా విచారణ జరిపి నిర్ణయం తీసుకోవాలని జస్టిస్ బీఆర్ గవాయి స్పష్టం చేశారు. నాలుగు వారాల్లోగా విచారణ పూర్తి చేస్తామని స్పీకర్ తరఫున న్యాయవాదులు అభిషేక్ సింగ్, ముకుల్ రోహత్గి వెల్లడించారు. తెలంగాణలో ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై సుప్రీంకోర్టులో సోమవారం విచారణ జరిగింది. ఈ అంశంపై సర్వోన్నత న్యాయస్థానం స్పీకర్‌కు మరో 4 వారాల గడువు ఇచ్చింది. ఈలోపు నిర్ణయం తీసుకోవాలని సూచించింది. కేసు విచారణను కూడా 4 వారాలకు వాయిదా వేసింది. ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా భారత రాష్ట్ర సమితి దాఖలు చేసిన పిటిషన్లపై మూడునెలల్లోపు నిర్ణయం తీసుకోవాలని జులై 31న జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశించింది. అయితే విభిన్న కారణాలవల్ల ఆలోపు నిర్ణయం తీసుకోవడం సాధ్యం కానందున స్పీకర్‌కు మరో రెండు నెలలు గడువు ఇవ్వాలని కోరుతూ శాసనసభ కార్యదర్శి దాఖలు చేసిన మిసిలేనియస్ అప్లికేషన్ సీజేఐ ధర్మాసనం ముందు 14వ నంబరులో లిస్ట్ అయింది. ఈక్రమంలో ఆయా పిటిషన్లపై సోమవారం విచారణ చేపట్టిన న్యాయస్థానం స్పీకర్‌కు మరో 4 వారాల గడువు ఇచ్చింది.

# బిహార్ ముఖ్యమంత్రి నీతీశే..

కార్యాలయంలో భాజపా శాసనసభాపక్ష సమావేశం జరగనుందని జైస్వాల్ వెల్లడించారు. తర్వాత ఎన్డీయే శాసనసభాపక్షం సమావేశం అవుతుందని, అక్కడ నీతీశ్ ఎంపికకు సంబంధించిన లాంఛనాలు పూర్తి చేస్తామని వెల్లడించారు. గాంధీ మైదాన్‌లో ప్రమాణస్వీకార కార్యక్రమం కోసం ప్రణాళికలు వేస్తున్నట్లు వెల్లడించారు. దానికి ప్రధాని మోదీతో పాటు భాజపా పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరుకానున్నట్లు తెలుస్తోంది. 1985 బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ భారీ విజయం సాధించినా.. నీతీశ్ లోక్‌దళ్ పార్టీ తరఫున హర్నౌత్ నుంచి గెలుపొంది తొలిసారి అసెంబ్లీలోకి అడుగుపెట్టారు. ఐదేళ్ల తర్వాత ఎంపీగా ఎన్నికయ్యారు. బిహార్‌లో రిజర్వేషన్ల ఉద్యమం కొనసాగుతోన్న తరుణం లో జార్జ్ ఫెర్నాండెజ్‌తో కలిసి 1994లో సమతా పార్టీని ఏర్పాటుచేశారు. తొలిసారి ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన ఆయన కేవలం వారం రోజులే (2000 మార్చి 3- 10) కొనసాగారు. అనంతరం జనతాదళ్ (యునైటెడ్)ను ఏర్పాటుచేసి.. రాష్ట్రంలో మిత్రపక్షాలతో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేశారు. ఇప్పటివరకు తొమ్మిదిసార్లు సీఎంగా ప్రమాణస్వీకారం చేశారు.

# ప్రజాపాలన వారోత్సవాల తర్వాతే 'స్థానిక'పోరు

మంత్రివర్గం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అనేక అంశాలపై చర్చించారు. ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై చర్చించినట్లు సమాచారం .ఇప్పటికే ఎన్నికల నిర్వహణ ఆలస్యమైన నేపథ్యంలో ఇక ఆలస్యం చేయొద్దని.. వీలైనంత తర్వగా లోకల్ బాడీ ఎలక్షన్స్ నిర్వహించాలని నిర్ణయించింది మంత్రి వర్గం. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు అవుతున్న నేపథ్యంలో తమ ప్రభుత్వం ప్రజల కోసం ఏం చేసిందనే విషయాన్ని ప్రజాపాలన వారోత్సవాల్లో వివరించాలని మంత్రివర్గం తీర్మానించింది. గ్రామ స్థాయిలో ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రచారం చేసి.. లోక్‌బాడీ ఎన్నికల్లో జయకేతనం ఎగురవేయాలని నిర్ణయించింది. ప్రజాపాలన వారోత్సవాలతో గ్రామ స్థాయి కేడర్‌లో మరింత ఉత్సాహం నింపి స్థానిక ఎన్నికల్లో విజయ ఢంకా మోగించాలని భావిస్తున్నారు.

**సౌదీ ప్రమాద మృతుల కుటుంబాలకు రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా**

బాధితులకు అండగా నిలవాలని ఈ భేటీలో ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్, ఎంఐఎం ఎమ్మెల్యేతోపాటు మైనార్టీ విభాగానికి చెందిన ఉన్నతాధికారితో కూడిన ప్రభుత్వ ప్రతినిధి బృందాన్ని సౌదీకి పంపాలనీ కేబినెట్ నిర్ణయించింది. బస్సు ప్రమాదంలో మరణించిన వారి మృతదేహాలకు మత సంప్రదాయం ప్రకారం అక్కడే అంత్యక్రియలు నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. బాధిత కుటుంబసభ్యులకు చెందిన ఒక్కో కుటుంబం నుంచి ఇద్దరిని సౌదీ తీసుకెళ్లేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ నిర్ణయం తీసుకుంది. సౌదీలో సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో 45 మంది మరణించారు. వీరంతా హైదరాబాద్ వాసులని తెలంగాణ హజ్ కమిటీ ఒక ప్రకటన వెల్లడించింది. మృతుల్లో 17 మంది పురుషులు, 18 మంది మహిళలు, 10 మంది చిన్నారులు ఉన్నారని తెలిపింది. హైదరాబాద్‌లోని మొత్తం 4 ట్రావెల్ ఏజెన్సీల ద్వారా నవంబర్ 9వ తేదీన వీరంతా ఉమ్రాకు బయలుదేరి వెళ్లారు. క్కా యాత్ర పూర్తి చేసుకుని వారంతా మదీనాకి వెళ్తున్న సమయంలో ఈ రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్‌లోని విద్యానగర్‌కు చెందిన నజీరుద్దీన్ కుటుంబంలోని 18 మంది ఈ ప్రమాదంలో మరణించారు.

# పైరసీని ప్రోత్సహించవద్దు

చేశారు. ఐ బొమ్మ రవి దగ్గర 50 లక్షల మంది సమాచారం ఉందని వెల్లడించారు. డేటా కలెక్షన్ కోసం ఐ బొమ్మ రవి మాస్టర్ మైండ్ ఉపయోగించాడని సీపీ వివరించారు. ఒక సైట్‌ను బ్లాక్ చేస్తే.. మరో సైట్‌ను డెవలప్ చేస్తాడని వెల్లడించారు. రవి సైట్ ఓపెన్ చేయగానే బెట్టింగ్ యాప్స్ అట్రాక్ట్ చేస్తాయని, బెట్టింగ్ యాప్స్‌తో జనం వేల కోట్లు నష్టపోయారని వ్యాఖ్యానించారు. కస్టడీకి ఇస్తే ఐ బొమ్మ రవి నుంచి పూర్తి వివరాలు రాబడుతామని, ఆయన నెట్‌వర్క్‌లో ఉన్న మిగతా వారిని కూడా అరెస్ట్ చేస్తామని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.

**సినీ కార్మికుల కష్టాన్ని దోచుకుంటున్న పైరసీకారులు**

సినీ ఇండస్ట్రీ మీద చాలామంది ఆధారపడి ఉన్నారని వాళ్ల కష్టాన్ని దౌర్జన్యంగా దోచుకుంటుంటే బాధగా ఉంటుందని చిరంజీవి అన్నారు. ఐబొమ్మ నిర్వాహకుడి అరెస్ట్ నేపథ్యంలో తాజాగా సినీ ప్రముఖులు హైదరాబాద్ నగర సీపీ సజ్జనార్‌తో భేటీ అయ్యారు. ఈ మీటింగ్ అనంతరం చిరంజీవి మాట్లాడారు. అంతకుముందు సౌదీ ప్రమాదంలో మృతులకు సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఈ పైరసీ నుంచి ఎలా తప్పించుకోవాలని ఆలోచిస్తూనే ఉన్నాం. ఇండస్ట్రీ మీద పరోక్షంగా, ప్రత్యక్షంగా లక్షల మంది ఆధారపడి ఉన్నారు. లైట్‌బాయ్ దగ్గర నుంచి పెద్దపెద్ద డైరెక్టర్ల వరకూ ఇండస్ట్రీపై ఆధారపడి ఉన్నారు. ఇంతమంది కష్టాన్ని ఒకడు దౌర్జన్యంగా దోచుకోవడం.. తిరిగి పోలీసులకే సవాలు విసరడాన్ని తట్టుకోలేకపోయాం. ఇలాంటి సమయంలో గత సీపీ సీవీ ఆనంద్ అనంతరం సజ్జనార్ చాలా కృషి చేసి నిందితుడిని పట్టుకున్నారు. ఈ కేసులో పనిచేసిన ప్రతిఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు. ప్రజలు కూడా సినిమా తమదిగా భావించాలి, పైరసీ చూడొద్దు. ఈ ఏడాది కూడా చాలా సినిమాలు పైరసీ చేశారు. దీనివల్ల ఎంతో నష్టం జరిగింది. త్వరలో రాజమౌళి గొప్ప సినిమా తీయనున్నారు. అప్పుడు మన ఖ్యాతి ఖండాంతరాలు విస్తరిస్తుంది. ఆ సమయంలోను పైరసీ పెనుసవాలుగా ఉంటుంది. ఇండస్ట్రీ బాధను అర్థం చేసుకున్నందుకు పోలీసులను అభినందిస్తున్నట్లు చిరంజీవి అన్నారు. పోలీసులకు ధన్యవాదాలు. ఇది సినిమాలో సూపర్ హిట్ సన్నివేశంలా ఉంది. విలన్ ఛాలెంజ్ చేస్తే రెండు నెలల తర్వాత హీరో అతడిని కటకటాల వెనక వేసినట్లు ఉంది. భస్మాసురుడి హస్తంలా తన తలమీద తనే చేయిపెట్టుకున్నాడు. పోలీసులతో ఆటలొద్దు. ఈ సందర్భంగా ఒక్కటే చెప్పాలనుకుంటున్నా.. ఏదీ ఉచితంగా రాదు. ఒకవేళ అలా వస్తే దాని వెనక పెద్ద ప్రమాదం పొంచి ఉంటుంది. అది చావు వరకూ తీసుకెళ్తుంది. 'సినిమాలేగా ఏముంది ఫ్రీగా చూస్తున్నాం' అని అందరూ అనుకుంటున్నారు. పైరసీ చేసే వాళ్లేం సంఘసేవ చేయడం లేదు. పెద్దపెద్ద సర్వర్లు ఉపయోగించి పైరసీ చేస్తున్నారు. దానికి డబ్బు ఎక్కడ నుంచి వస్తుంది? మేము వాళ్లకు డబ్బులు ఇవ్వడం లేదు.. మా సినిమాలను పైరసీ చేసి సంపాదిస్తున్నారు. అంటే మీరు ఇస్తున్నారు. మీ వ్యక్తిగత డేటాను అమ్మడం వల్ల ఇస్తున్నారు. ఈ పర్సనల్ డేటా అంటే చాలా మందికి తెలియకపోవచ్చు. మీ పేరు, ఫోన్ నంబర్, ఆధార్ నంబర్, ఈ-మెయిల్ ఐడీ ఉంటే చాలు మీరు సైబర్ బారిన పడతారు. ఈ డేటాను క్రిమినల్స్‌కు అమ్ముతున్నారు. మీరు నంబరే కదా అని ఎంటర్ చేస్తున్నారు. దాని మూలంగా ఎన్నో అనర్థాలు జరుగుతున్నాయి. డబ్బులు పోవడమే కాదు.. ప్రాణాలు పోయే వరకూ వెళ్తోంది. ఈ పైరసీ వల్ల మాకంటే మీరే ఎక్కువ నష్టపోతున్నారు. అర్థం చేసుకోండి. ఇలాంటి పైరసీ వెబ్‌సైట్లలో ఉచితంగా సినిమాలు చూసి ఇబ్బందుల్లో పడకండని రాజమౌళి సినీ అభిమానులకు సూచించారు.

## క్షమించండి..మీ దేశంలో మా సేవలు శాశ్వతంగా నిలిపివేశాం

**హైదరాబాద్(జనంసాక్షి):** ఐబొమ్మ, బప్పం టీవీ వెబ్‌సైట్ల నిర్వాహకుడు ఇమ్మడి రవి అరెస్టయిన నేపథ్యంలో ఐ బొమ్మ ఓ ప్రకటన విడుదల చేసింది. తమ సేవలను శాశ్వతంగా నిలిపివేశామని వెబ్‌సైట్లో వెల్లడించింది. కొత్త సినిమాలు, ఓటీటీ వేదికల్లోని కంటెంట్‌ను పైరసీ చేస్తూ సినీ పరిశ్రమకు తీవ్ర నష్టం కలిగిస్తున్న ప్రధాన నిందితుడు రవిని శనివారం అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఐ బొమ్మ, దాని అనుబంధంగా ఉన్న 65 వెబ్‌సైట్లను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు బ్లాక్ చేశారు. "మీకు ఇటీవల మా గురించి తెలిసి ఉండొచ్చు. లేదంటే.. మొదటి నుంచి నమ్మకమైన అభిమానై ఉండొచ్చు. ఏదేమైనా.. మీ దేశంలో మా సేవ శాశ్వతంగా నిలిపివేశామని చెప్పేందుకు చింతిస్తున్నాం. అందుకు క్షమాపణలు కోరుతున్నాం" అని ఐ బొమ్మ ప్రకటనలో పేర్కొంది.గత ఏడెనిమిదేళ్లుగా పైరసీ సినిమాలు, వెబ్‌సిరీస్‌లకు ఐ బొమ్మను వేదికగా మార్చిన ఇమ్మడి రవి (40)ని శనివారం సైబర్ క్రైమ్ పోలీసులు కూకట్‌పల్లిలో అరెస్ట్ చేశారు. ఇతడు నివసిస్తున్న అపార్ట్‌మెంట్‌లో రూ.3 కోట్ల నగదు, వందల కొద్దీ హార్డ్ డిస్కులు, కంప్యూటర్లు, సెల్‌ఫోన్లను గుర్తించినట్టు సమాచారం.

# షేక్‌హసీనాకు ఉరిశిక్ష

మారాయి. ఈ నిరసనలే హసీనా పాలనను అంతం చేశాయి. ఆమె ప్రభుత్వం చేపట్టిన భద్రతా చర్యల వల్ల హింస పెరిగింది. ఇది జులై తిరుగుబాటుగా మారింది. ఈ అల్లర్లలో 1,400 మంది వరకు మరణించారని ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల కార్యాలయం నివేదించింది. ఆందోళనల కారణంగా హసీనా అధికారం నుంచి వైదొలగి భారత్‌లో ఆశ్రయం పొందాల్సి వచ్చింది. అనంతరం బంగ్లాలో మహ్మద్ యూనస్ నేతృత్వంలో ఏర్పడ్డ మధ్యంతర ప్రభుత్వం 'అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్ 'ను పునరుద్ధరించింది. యుద్ధ నేరాలకు పాల్పడిన వారిని విచారించేందుకు ఆమే ఒకప్పుడు దీన్ని ఏర్పాటు చేసింది. ఇప్పుడు అదే ట్రైబ్యునల్ 2024 నాటి అల్లర్ల విషయంలో హసీనాపై మానవత్వానికి వ్యతిరేకంగా చేసిన నేరాల ఆరోపణలు మోపింది. .

## తీర్పు మోసపూరితం..

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** బంగ్లాదేశ్ అల్లర్ల కేసులో ఢాకాలోని ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ తనకు మరణ శిక్ష విధించడాన్ని ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా ఖండించారు. ఈ తీర్పు మోసపూరితమైనదన్నారు. ప్రజాస్వామ్య విరుద్ధంగా ఏర్పడిన ప్రభుత్వం కుట్రపూరితంగా తనకు శిక్ష పడేలా చేసిందని ఆరోపించారు. తనను తాను నిరూపించుకోవడానికి కోర్టు న్యాయమైన అవకాశం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయమూర్తులు పక్షపాతంగా వ్యవహరిస్తున్నారన్నారు.మానవ హక్కుల ఉల్లంఘనకు సంబంధించి ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని హసీనా అన్నారు. దేశంలో పేదరిక నిర్మూలన, విద్య, ఉద్యోగాలు, అభివృద్ధివంటి విషయాల్లో తన హయాంలో ఎన్నో చర్యలు తీసుకున్నామన్నారు. 2010లో బంగ్లాదేశ్‌ను అంతర్జాతీయ క్రిమినల్ కోర్టులో చేరేలా తమ ప్రభుత్వం నడిపించిందని గుర్తు చేశారు. మయన్మార్‌లో హింస చెలరేగడంతో బంగ్లాకు పారిపోయి వచ్చిన లక్షలాది మంది రోహింగ్యాలకు ఆశ్రయం కల్పించామన్నారు. మానవ హక్కుల పట్ల శ్రద్ధ లేకపోతే ఇవన్నీ ఎందుకు చేస్తామని ప్రశ్నించారు. మరోవైపు హసీనాకు వ్యతిరేకంగా తీర్పు వెలువడడంతో బంగ్లాలోని అవామీ లీగ్ పార్టీ మంగళవారం దేశవ్యాప్తంగా సమ్మెకు పిలుపునిస్తూ.. బంద్ ప్రకటించింది.

# ఇప్పటికైనా హసీనాను మాకు అప్పగించండి

**ఢాకా(జనంసాక్షి):** మరణశిక్ష పడ్డ తమ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనాను ఇక అప్పగించాల్సిన తరుణం ఏర్పడిందని భారత్‌కు బంగ్లాదేశ్ విన్నవించింది. చట్ట వ్యతిరేక కార్యాకలాపాలకు పాల్పడ్డ వారికి ఆశ్రయం కల్పించడం వంటి చర్యలు దౌత్యపరంగా సరైనది కాదని బంగ్లా స్పష్టం చేసింది. ఈ మేరకు బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ,.. భారత్‌కు లేఖ రాసింది. మరణశిక్ష పడ్డ షేక్ హసీనా అప్పగించాలని విజ్ఞప్తి చేసింది. ఇది స్నేహ పూర్వక బాధ్యత అని కూడా బంగ్లాదేశ్ లేఖ ద్వారా స్పష్టం చేసింది. మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడిన ఈ వ్యక్తులకు మరే ఇతర దేశం ఆశ్రయం కల్పించడం వంటి చర్యలు న్యాయం పట్ల నిర్లక్ష్యమే అవుతుందని పేర్కొంది. కాగా ఢాకా అల్లర్ల కేసులో బంగ్లాదేశ్ ఇంటర్నేషన్ క్రైమ్స్ ట్రిబ్యునల్.. షేక్ హసీనాను దోషిగా తేల్చుతూ మరణశిక్ష విధించింది. అల్లర్ల కేసులో ఆందోళనకారుల్ని చంపాలని హసీనా ఆదేశించారని, అందుకు తగిన ఆధారాలు కూడా ఉన్నట్లు తెలపింది. హసీనా మానవత్వాన్ని మరిచిపోయి.. ఆందోళనకారుల్ని చంపాలని ఆదేశించారని, ఆమె చేతులో రక్తం నిండిపోయి ఉన్నాయని, అందుకు ఆమెకు మరణశిక్షే సరైనది అంటూ తీర్పు వెలువరించింది. అయితే హసీనా తొలిసారి స్పందించారు. ఇది రాజకీయ ప్రేరేపిత కేసుని పేర్కొన్నారు. తనపై కుట్రతో, రాజకీయ దురుద్దేశంతో చేసిన కుట్రగా ఆమె అభివర్ణించారు. ఇదిలా ఉంచితే, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మహమ్మద్ యూనస్ నాయకత్వంలో తాత్కాలిక ప్రభుత్వం వచ్చినప్పటినుంచీ మైనారిటీలకూ, హసీనా హయాంలో బాధ్యతలు నిర్వర్తించిన నేతలకూ, ఉన్నతాధికారులకూ గడ్డు పరిస్థితులు ఏర్పడ్డాయి. దాడులూ, దౌర్జన్యాలూ, నిర్బంధాలూ తప్పడం లేదు. ఈ క్రమంలోనే మన దేశానికి దౌత్య సమస్య మరొకటి చేరింది. ఇందులో హసీనా అప్పగింత వ్యవహారం.గత ఏడాది ఆగస్టు నుంచీ భారత్‌లో ఆశ్రయం పొందుతున్న తమ మాజీ ప్రధాని షేక్ హసీనాను అప్పగించాలని బంగ్లాదేశ్ ఇప్పటికే పలుమార్లు విజ్ఞప్తి చేయగా, ఆమె మరణశిక్ష పడిన నేపథ్యంలో మరోసారి 'అప్పగింత' వ్యవహారంపై బంగ్లాదేశ్ చకచకా పావులు కదుపుతోంది.

# బీహార్‌లో బీజేపీ ఓట్ చోరీ సుస్పష్టం

- ఓట్లు వచ్చినా సీట్లు తగ్గిన మహాకూటమి
- ఓట్లు తగ్గినా సీట్లు బిజెపికి పెరిగాయి
- మంత్రి పొన్నం, టీపీసీసీ చీఫ్ పిసిసి చీఫ్ మహేశ్

**హైదరాబాద్(జనంసాక్షి):** బీహార్‌లో దొడ్డి దారిన ఎన్డీయే కూటమి విజయం సాధించిందని టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ ఆరోపించారు.. ఓట్ చోరీ నీ నిరసిస్తూ గాంధీ భవన్ ముందు యూత్ కాంగ్రెస్ నేతల ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఎన్నికలు జరగాలన్నారు. యువజన కాంగ్రెస్ చేపట్టిన ఈ కార్యక్రమం ప్రజల్ని చైతన్య వంతం చేసే విధముగా ఉందని కొనియాడారు. ఓట్ చోరీపై ప్రజలను చైతన్యవంతం చేస్తూ రాహుల్ గాంధీ ఎనలేని పోరాటం చేస్తున్నారన్నారు. ఓటు విలువ తెలియక ఉండటం శోచనీయమన్నారు. బీహార్ ఎన్నికల్లో సామాన్యులకు తెలియని విషయాలు ఎన్నో ఉన్నాయన్నారు. ఓటు శాతం తక్కువగా వచ్చి ఎన్డీయే సీట్లు గెలవడం వెనక ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. బీహార్‌లో ఓట్ చోరీతో ఎన్డీయే కూటమికి సీట్లు వచ్చాయని ఆరోపించారు. ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా బీహార్ లో ఎన్డీయే కూటమికి సీట్లు గెలుచుకుందన్నారు. దేశ భవిష్యత్ కి విఘాతం కలిగించే విధంగా ఓట్ చోరీ ఉందన్నారు. ఓట్ శాతం మహాఘాట్ బంధన్ కి ఎక్కువ వస్తే.. ఎన్డీయే కూటమికి సీట్లు పెరిగాయని మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు.సెక్యులర్ ఓట్లను తొలగించారు.. ఓట్ చోరీ తో రాజ్యాంగానికి తూట్లు.. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా తీరు తెన్నులు శోచనీయం.. అధికార బిజెపికి అనుకూలంగా ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా పని చేస్తుంది. దేశం బాగుపడాలంటే ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాల్సిన అవశ్యకత ఉంది.. అధికారం పరమావధిగా మోడీ అమిత్ షా ఓట్ చోరీకి పాల్పడుతున్నారు.. బీహార్ ఎన్డీయే కూటమి గెలుపు అప్రజాస్వామికం.. ఓట్ చోరీ గురించి 8 ఏళ్ల క్రితమే పోరాడాం.. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా బీజేపీకి ఫ్రంట్ ఆర్గనైజర్ గా పనిచేస్తుంది.. రేపటి నుంచి తెలంగాణలో ఓట్ చోరీ సంతకాల సేకరణ ముమ్మరంగా జరుగుతుంది..

## ఎస్సై, కానిస్టేబుల్ అవినీతి, అక్రమాలపై ఎస్‌బి అధికారుల ఆరా!

**చెన్నారావుపేట, నవంబర్ 17 (జనం సాక్షి):** ఎస్సై, ఓ సీనియర్ కానిస్టేబుల్ అవినీతి, అక్రమాల పై ఎస్ బి అధికారులు ఆరా తీసినట్లు తెలిసింది. ఇటీవల జనం సాక్షి దినపత్రికలో కలకలం రేపుతున్న గొర్రెల బాగోతం...! పోలీస్ స్టేషన్ లో జరుగుతున్న, అవినీతి అక్రమాలు... అని వచ్చిన కథనం అందరికీ తెలిసిందే. ఈ మేరకు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఎస్ బి అధికారులను చెన్నారావుపేట పోలీస్ స్టేషన్ లో ఎస్సై, ఓ సీనియర్ కానిస్టేబుల్ చేస్తున్న అవినీతి, అక్రమాలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి నివేదిక అందించాలని ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. ఈ మేరకు సోమవారం వరంగల్ పోలీస్ కమిషనర్ కార్యాలయం నుండి ఎస్ బి ఉన్నతాధికారులు చెన్నారావుపేట పోలీస్ స్టేషన్ కు వచ్చి మండలంలో ఉన్న వైన్ షాపులు, బెల్ట్ షాపుల వివరాలు, మొరం దందా కొనసాగిస్తున్న వారి పేర్లు, వివరాలు, పలు కేసులలో డబ్బులు తీసుకున్నట్లుగా ఆరోపణలు రావడంతో కేసులకు సంబంధించిన ఫైళ్లను తీసుకు వెళ్లినట్లు సమాచారం. అంతేకాక కొంతమంది బాధితుల దగ్గర వివరాలను తీసుకెళ్లినట్లు తెలిసింది. ఏది ఏమైనా ఒకటి రెండు రోజుల్లో ఎస్సై, ఓ సీనియర్ కానిస్టేబుల్ పై వేటు పడే అవకాశాలు ఉన్నట్లు పోలీసు వర్గాల ద్వారా ప్రచారం జరుగుతుంది.

## సౌదీ అరేబియా ప్రమాదంపై సీపీఎం సతాపం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** సౌదీ అరేబియాలో బస్సు, ఆయిల్ ట్యాంకర్ ఢీకొన్న ఘటనలో 45 మంది హైదరాబాదుకు చెందినవారు సజీవ దహనం కావడం తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. ఈ దుర్ఘటనలో మరణించిన వారికి సిపిఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్ర సంతాపాన్ని ప్రకటించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నది. ఈ దుర్ఘటనలో మృతి చెందిన వారి మృతదేహాలను మన దేశానికి తీసుకొని రావడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో సంప్రదించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్య సౌకర్యం అందించాలని కోరారు.

### 'నాణ్యమైన ఉచిత విద్య- మెరుగైన ఉచిత వైద్యం'

# ఒక ఉద్యమంలా సాగాలి

- అన్ని రాజకీయ పార్టీల ఎన్నికల మ్యానిఫెస్టోలో అంశంలా చేర్చే వరకు పోరాడాలి
- తెలంగాణ యువజన సంఘం సెమినార్‌లో ప్రొఫెసర్ కాశీం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** 'నాణ్యమైన ఉచిత విద్య- మెరుగైన ఉచిత వైద్యం' ఒక ఉద్యమంలా సాగాలని ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాశీం అన్నారు. 'ప్రజల ప్రాథమిక హక్కు - ప్రభుత్వల కనీస బాధ్యత' అంశంపై ఉస్మానియా యూనివర్సిటీ న్యూ సెమినార్ హాల్ లో జరిగిన సెమినార్ సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాశీం మాట్లాడుతూ ఐదు దశబ్దలా క్రితం పెద్ద బాల శిక్ష చదివిన వాళ్లకి ఉన్నా విద్య లో నైపుణ్యం సాధించిన వాళ్ళ, ప్రస్తుత విద్య వ్యవస్థ లో నైపుణ్యం సాధించటం లేదన్నారు. డిగ్రీ పట్టాలు ఇస్తే సరిపోదని, విద్య లో నైపుణ్యం నేర్పించాలన్నారు. ఉన్నత విద్య అభ్యసించిన వాళ్ళు కూడా స్కిల్స్ లేక చిన్న, చిన్న ఉద్యోగాలకు పోటీ పడుతున్నారు. పీజీ లు చదువుతు కానిస్టేబుల్ ఉద్యోగలకోసం పోటీ పడుతున్నారన్నారు. కొత్త తరం విద్యార్థులతో పాటు కొత్త విషయాల పై ప్రొఫెసర్ లు కూడా అప్డేట్ కావాలన్నారు. నాణ్యమైన, నైపుణ్య విద్య ను ప్రభుత్వ విద్యాలయల లో, విశ్వ విద్యాలయలలో అందటం లేదన్నారు. ఉన్నత విద్యకి బడ్జెట్ కేటాయింపులు లలో కోతలు పెడుతున్నారన్నారు. ప్రయివేట్ విద్యా వ్యవస్థను నిషేదించక పోతే, ప్రభుత్వ విద్యా వ్యవస్థ నిలబడలేదన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ కి 1000కోట్ల బడ్జెట్ కేటాయించి, ఖాళీగా ఉన్నా 800 ఉద్యోగా లు భర్తీ చేస్తే మరోక 30ఏళ్ళు ఉస్మానియా యూనివర్సిటీ ఉన్నత, నైపుణ్య విద్యను అందిస్తుంది అన్నారు. రేవంత్ రెడ్డి ఉస్మానియా యూనివర్సిటీ కి ఇచ్చిన 1000కోట్ల హామీ నెరవేర్చాలని అన్నారు. ఎవీఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్ రెడ్డి మాట్లాడుతూ పేదల పిల్లలు తరగతి లో చేరిన వారు డిగ్రీ వచ్చే వరకు అనేక కారణలతో చదువుకి దూరం అవుతున్నారని, నాణ్యమైన విద్య అందడం లేదని అన్నారు. పాఠశాల లలో 60% విద్యార్థులు చదవడం లో, రాయడం లో సమస్య లు ఎదురకొంటున్నారని, విద్యా వ్యవస్థ నిర్లక్ష్యనికి గురి అవుతున్న సమయంలో తెలంగాణ యువజన సంఘము ఆధ్వర్యంలో నాణ్యమైన ఉచితవిద్య- మెరుగైన ఉచిత వైద్యం సెమినార్ నిర్వహించడం అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ యువజన సంఘము రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రము లో రోజు రోజుకి విద్య - వైద్య రంగాలు తీవ్ర సంక్షోభం లో కూరుకుపోతున్నాయని, తమకి వచ్చే ఆదాయం లో 80 నుండి 90 శాతం విద్యా- వైద్యం కోసం ఖర్చు పెడుతున్నట్లు ప్రపంచ బ్యాంక్ మరియు ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామికల్ కో ఆపరేషన్ అండ్ డెవలప్ మెంట్ సర్వే లెక్కలు తేల్చింది. అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చితే తల్లి దండ్రులు తమ సంపాదనలో ఎక్కువ భాగం విద్యా, వైద్యానికే ఖర్చు చేస్తున్నట్లు వెల్లడైందన్నారు. ప్రధానంగా దేశం లో, రాష్ట్రము లో నాణ్యమైన విద్య - మెరుగైన వైద్యం సంపన్నుల కు దక్కినంతగా సామాన్యుడు కి దక్కడం లేదన్నారు. విద్యా రంగంలో 'చదువు కొనే' వాళ్ళతో పోల్చితే, సామాన్యుడు పంపించే ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీ లలో అరకొర వసతులకు తోడు విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు కూడా లేకపోవడం తో తమ పిల్లల భవిష్యత్తు కోసం ప్రయివేట్ పాఠశాలలు, కళాశాలల్లో అధిక ఫీజు లు చెల్లించి మరీ చదివిస్తున్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల దుస్థితి ని, తమ పిల్లల భవిష్యత్తు పట్ల తల్లి దండ్రుల ఆకాంక్ష లను, ఆందోళనలను సొమ్ము చేసుకుంటూ అన్ని స్థాయి ల్లోని విద్యా వ్యాపార సంస్థ లు వివిధ పేర్ల తో అధిక ఫీజు లు వసులు చేస్తున్నాయని, ప్రభుత్వాలు లు అధిక ఫీజు లను నియంత్రించటం లో విఫలం అవుతున్నాయన్నారు. అభివృద్ధి చెందిన ఏ దేశాలలో ఈ పరిస్థితి లేదు. ఇది విద్యా హక్కు పై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని స్పష్టం చేస్తుందన్నారు. ప్రతి సంవత్సరం సుమారు ఒక లక్ష మంది ఇంజనీర్ పట్టా పొంది బయటకి వస్తే 10వేల మంది కి కూడా నైపుణ్యం ఉండటం లేదని, ప్రతి సంవత్సరం సుమారు 2లక్షల మంది డిగ్రీ పట్టా బద్రులు అవుతుంటే, నైపుణ్యం లేని వాళ్ళు 70% ఉంటున్నారని, ప్రపంచీకరణ నేపథ్యంలో నైపుణ్య విద్య అత్యవసరం. ఉపాధి అవకాశాలు చూపే నైపుణ్యం గల విద్య అమలు చేయక పోతే భవిష్యత్తు తరాలను మరింత అజ్ఞానము లోకి నెట్టబడి ఎందుకు పనికి రాని వారిగా తయారవుతారని, ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి, నాణ్యమైన, నైపుణ్యం గల ఉచిత విద్య ను అందించాలని, ప్రతి బడ్జెట్ లో విద్యా రంగానికి 20% నిధులు కేటాయించాలని తెలంగాణ యువజన సంఘం డిమాండ్ చేశారని తెలిపారు. మెరుగైన ఉచిత వైద్యం పై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ రాజీవ్ మాట్లాడుతూ ప్రభుత్వ హాస్పిటల్ లలో వసతులతో కూడిన నాణ్యమైన వైద్యం అందించటం లో సమస్య లు ఉండటంతో రోగులు తమ ప్రాణాలు దక్కించు కోవడానికి కార్పొరేట్, ప్రయివేట్ హాస్పిటల్స్ కి పోతే ధనార్జనే ధ్యేయం గా నడిచే ప్రయివేట్, కార్పొరేట్ హాస్పిటల్స్ రకరకాల టెస్ట్ ల పేరుతో, ట్రీట్మెంట్ ల పేరుతో వేలు, లక్షల రూపాయలు దోపిడీ చేస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో కాదు కదా కనీసం పట్టణ ప్రాంతాలలో ప్రభుత్వ హాస్పిటల్స్ లో కూడా సరైన సదుపాయాలు, సరిపడా మందులు అవసరమైన సరిపడా సిబ్బంది అందుబాటులో ఉండటం లేదన్నారు.

డాక్టర్ చెరుకు సుధాకర్ మాట్లాడుతూ ప్రజల నుండి గోళ్లుడ గొట్టి, ప్రతి వస్తువు పై అధిక పన్నులు వసూలు చేస్తూ ప్రతి ఏటా లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశ పెడుతున్న పాలక వర్గాలు ( కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు) ప్రజలకు ప్రాథమిక హక్కులు అయిన నాణ్యమైన విద్య- మెరుగైన వైద్యం అందించాల్సిన కనీస బాధ్యత ఉంది అని అన్నారు. ఈ కార్యక్రమం లో తెలంగాణ యువజన సంఘము రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు, ఉస్మానియా యూనివర్సిటీ అధ్యక్షులు దాసరి శశాంకర్, రాష్ట్ర కో ఆర్డినేటర్ కర్రే సత్యనారాయణ, తెలంగాణ యువజన సంఘము రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు యువరాణి, నాయకులు పుల్లూరి రాజు, విప్లవ్ కుమార్, రాజ్ కుమార్, సురేష్ నాయక్, సందీప్, శివ, గోపి, మహేందర్,యడ్ల భాస్కర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## పౌష్టికాహార లోపం లేని తెలంగాణను నిర్మించడమే లక్ష్యం

- పిల్లలను ఆరోగ్యంగా ఉంచడమే ప్రభుత్వ లక్ష్యం
- చిన్నపిల్లలు దేవుళ్ళతో సమానం ఇచ్చిన హామీలను కచ్చితంగా నెరవేరుస్తాం
- అంగన్వాడి కేంద్రాలపై నమ్మకం కలిగేలా విధులు నిర్వహించాలి
- కార్పొరేట్ స్థాయి పాఠశాలలకు దీటుగా అంగన్వాడి కేంద్రాలు.
- ప్రీస్కూల్ చిన్నారులకు 100 మి.లీ విజయ పాలు పంపిణీ.
- మంత్రి ధనసరి అనసూయ సీతక్క.





**ములుగు ప్రతినిధి, నవంబర్ 17(జనంసాక్షి) :** రాష్ట్రంలోని పేదరికంలో ఉన్న పిల్లలను ఆరోగ్యంగా ఉంచడం కోసమే ప్రభుత్వం బలమైన ఆహారం అందించడానికి చర్యలు తీసుకుంటుందని, చిన్నపిల్లలు దేవుళ్లతో సమానంగా అంగన్వాడీ టీచర్లు చూసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా,శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. సోమవారం ములుగు జిల్లా కేంద్రంలోని కృష్ణా కాలనీ అంగన్వాడీ కేంద్రంలో తెలంగాణ రాష్ట్రం లోనే తొలిసారిగా చేపట్టిన పైలట్ ప్రాజెక్టులో భాగంగా ప్రీస్కూల్ చిన్నారులకు ప్రతీరోజు 100 మిల్లి లీటర్ ల పాల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఐటీడీఏ పిఓ చిత్రమిశ్ర, అదనపు కలెక్టర్ మహేందర్ జి లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్రంలోని పోషకాహార లోపాన్ని అధిగమించి తెలంగాణ రాష్ట్రాన్ని పోషకాహార లోప రహిత తెలంగాణగా మార్చడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నదని, అంగన్వాడి కేంద్రాల్లో 3 నుండి 6 సంవత్సరాల వయసు కలిగిన పిల్లలకు ప్రతిరోజు పాలను అందజేయడం జరుగుతుందని, ములుగు జిల్లాలో పేదరికంలో ఉన్న పిల్లలు అధిక సంఖ్యలో ఉండడంతో ఈ నూతన కార్యక్రమాన్ని ఇక్కడి నుండే ప్రారంభించడం జరిగిందని వివరించారు. పిల్లలకు అందించే ప్రతి ఆహారాన్ని అంగన్వాడీ టీచర్లు ప్రతిరోజు పరిశీలించాలని, అనారోగ్యానికి గురి చేసే వస్తువులు వచ్చిన పక్షంలో వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం విజయవంతానికి అంగన్వాడీ టీచర్లు క్రియాశీల పాత్ర వహించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నూతన కార్యక్రమాన్ని ములుగు జిల్లా నుండి ప్రారంభించడం సంతోషకరంగా ఉందని, జిల్లాలోని ప్రతి సెంటర్లో పిల్లలకు సరిపోను ఆట వస్తువులు, పౌష్టిక ఆహారం అందించడానికి చర్యలు తీసుకుంటమని వివరించారు. పిల్లలకు పౌష్టికాహారం అందించడానికి ప్రతి ఒక్కరూ చోరువ చూపాలని అన్నారు. అనంతరం వయోవృద్ధుల వారోత్సవాల్లో భాగంగా పోస్టర్లు ఆవిష్కరించి మంత్రి సీతక్క మాట్లాడుతూ తల్లితండ్రులను ఎవరైతే పిల్లలు నిర్లక్ష్యం చేస్తారో వారి నుండి ఆస్తులను జప్తు చేసి తల్లితండ్రుల మీద మార్పిడి చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా బాలల హక్కుల పరిరక్షణ మరియు బాలి వివాహాలపై ఏర్పాటుచేసిన పోస్టర్లు మంత్రి ఆవిష్కరించారు. ఈ విషయంలో సిడిపిఓ లు, సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు ఎంత కృషిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పాల పంపిణీని ప్రారంభించి ప్రీస్కూల్ చిన్నారులకు ఉచిత 100 మీ.లీ లీటర్ల పాలను మంత్రి అందించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ఆత్మ కమిటీ చైర్మన్ రవీందర్ రెడ్డి, డిడబ్ల్యూఓ తుల రవి, సిడిపిఓ శిరీష, సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసులతో వ్యక్తిపై థర్డ్ డిగ్రీ

- పెద్దేముల్ పోలీస్ స్టేషన్ లో ఘటన
- అత్తకు అల్లునికి వివాహేతర సంబంధం అంటగట్టిన పోలీసులు
- నేరం ఒప్పుకోవాలని చిత్రవధ
- పోలీస్ స్టేషన్ ముందు బాధితుడి బంధువుల ఆందోళన
- దాడికి కారణమైన ఎస్సై కానిస్టేబుల్‌లను సస్పెండ్ చేయాలని డిమాండ్



**వికారాబాద్ జిల్లా బ్యూరో నవంబర్ 17 (జనం సాక్షి) :** పోలీసుల తలుచుకుంటే దెబ్బలు కొదువా అన్నట్లు విచారణ పేరుతో ఒక వ్యక్తిపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించారు. అల్లుడికి అత్తకు అక్రమ సంబంధం అంటగట్టి హత్య నేరము ఒప్పుకోవాలని పోలీస్ స్టేషన్ లో చిత్రవధ చేశారు. గుడ్డలు ఊడదీసి చిత్రహింసలు పెట్టారని బాధిత వ్యక్తి బంధువులు పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించారు. దాడికి బాధ్యులైన పోలీసులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా పెద్దేముల్ పోలీస్ స్టేషన్ లో జరిగింది. మంబాపూర్ గ్రామానికి చెందిన గౌస్ అనే వ్యక్తి కౌవులు పొలములో కొన్ని నెలల క్రితం మృతి చెందాడు. ఫోరెన్స్ నివేదికలో బాధితుడి గొంతు నొక్కి హత్య చేసినట్లు రిపోర్టు రావడంతో పెద్దేముల పోలీసులు హత్య కేసుగా భావించి విచారణ ప్రారంభించారు. అందులో భాగంగానే మంబాపూర్ గ్రామానికి చెందిన హతుడు గౌస్ అల్లుడు ఫెరోజ్ ను విచారణ నిమిత్తం పోలీస్ స్టేషన్ రప్పించారు. అనంతరం విచారణ పేరుతో స్థానిక ఎస్సై వేణు కుమార్ మరో ముగ్గురు కానిస్టేబుళ్లు కలిసి పోలీస్ స్టేషన్ లో తనపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారని బాధితుడు ఫెరోజ్ ఆరోపించారు. పోలీస్ స్టేషన్ లో చిత్రవధ చేస్తూ హత్య నేరాలు ఒప్పుకోవాలని ఒత్తిడి పెంచినట్లు ఆరోపించారు. తన అత్తతో అక్రమ సంబంధం పెట్టుకొని మామ గౌస్ ను హత్య చేసినట్లు అంగీకరించాలని పోలీస్ స్టేషన్ లో చిత్రహింసలు పెట్టినట్లు తెలియజేశాడు. ఒంటిపై గుడ్డలూడదీసి కాళ్లు చేతులపై కొన్ని గంటల పాటు కొట్టి చిత్రవధ చేసినట్లు వివరించారు. ఈ విషయమై ఎవరికైనా చెప్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. పోలీసులు చిత్రవధ చేసిన అనంతరం బాధితులని వదిలి వేయడంతో నడవలేని స్థితిలో ఇంటికి చేరుకున్న ఫెరోజ్ తీవ్ర అస్వస్థకు గురి అయ్యాడు. ఆయనను వెంటనే బంధువులు తాండూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. అనంతరం వారి బంధువులు పెద్దేముల్ పోలీస్ స్టేషన్ ముందు ఆందోళనకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న తాండూర్ రూరల్ సిఐ నాగేష్ యాలాల ఎస్సై విట్టల్ రెడ్డి కరణ్ కో ట్ ఎస్సై రాథోడ్ వినోద్ హుటా హుటిన పోలీస్ స్టేషన్ చేరుకొని ఆందోళన చేస్తున్న బాధితులతో మాట్లాడారు. బాధితుడు ఫెరోజ్ ఫిరోజ్ పై పోలీసు థర్డ్ డిగ్రీ విషయమై సీఐ నాగేష్ కు ఫిర్యాదు చేశారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన వారిపై చర్య తీసుకుంటామని సిఐ నాగేష్ బాధితులకు హామీ ఇచ్చారు. బాధితుడు ఫెరోజ్ ను పోలీసులు కొట్టినట్లు వారి బంధువులు ఫిర్యాదు చేశారని శాఖ పరమైన విచారణ జరిపి బాధ్యులైన వారిపై చర్య తీసుకుం టామని హామీ ఇచ్చారు . ఫెరోజ్ మామ గౌస్ అనుమానాస్పద మృతిపై పోస్టుమార్టం నివేదిక వచ్చిందా అని పలుమార్లు పోలీసులను అడిగిన రాలేదని జవాబు చెప్పారని ఇప్పుడు పోస్టుమార్టం రిపోర్టులో హత్య అని తేలినందున అనుమానితుడిగా ఫెరోజ్ ను గుర్తించి విచారణ జరిపినట్లు పోలీసులు చెప్పడం విడ్డూరంగా ఉందని ఆరోపించారు.



## 69వ ఎస్‌జిఎఫ్ అథ్లెట్స్ జాతీయ స్థాయి ఛాంపియన్షిప్‌కు ఎంపిక

- అభినయశ్రీ కోచ్ బి. తిరుమల రావు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** 69వ తెలంగాణ ప్రభుత్వం, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జిఎఫ్ఐ) అభినయశ్రీ (అండర్ - 14 అమ్మాయిలు) 200 మీటర్స్ రన్నింగ్ లో రజత పతకం సాధించగ అథ్లెట్స్ స్టేట్ లెవెల్ ఛాంపియన్షిప్ ఈనెల 14 తేదీ నుంచి 16వ తేదీ వరకు హైదరాబాద్ (జింఖానా గ్రౌండ్) లో వివిధ జిల్లాల నుంచి వచ్చేసినటువంటి క్రీడాకారులు వివిధ క్రీడల్లో జేమ్స్, త్రోస్, ప్రింట్స్ మిల్ డిస్టెన్స్ అండ్ రన్నింగ్ పాల్గొన్నారు. తెలంగాణ నుంచి అభినయశ్రీ (అండర్ - 14 అమ్మాయి) 200 మీటర్స్ రన్నింగ్ లో జాతీయ స్థాయి కి ఎంపికయ్యారు. జరగనున్న (డిసెంబర్ 1 నుంచి 4వ తేది వరకు ఇండోర్ మధ్యప్రదేశ్) మేడ్చల్ డిస్ట్రిక్ట్ డి.వై.ఎస్.ఓ దామోదర్ రెడ్డి అథ్లెట్ అభినయశ్రీ ,అథ్లెటిక్స్ కోచ్ బి. తిరుమల రావు అభినందిస్తూ మన జిల్లాకి మన రాష్ట్రానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని మెడల్ సాధించాలని మరింత అత్యున్నత స్థాయికి వెళ్లాలని ప్రతి ఒక తల్లిదండ్రులు తమ తమ పిల్లల్ని క్రీడల వైపు మళ్ళించాలని శారీరకంగా మానసికంగా దృఢంగా ఆరోగ్యంగా ఉండాలని చెప్పుకొచ్చారు. తల్లిదండ్రులు ధర్మేంద్ర శ్రీలత కోచ్ తిరుమలరావు అభినందించారు .

## కొమురవెల్లి మల్లన్న కల్యాణం, జాతరను ఘనంగా నిర్వహించాలి

- ఎండోమెంటు ఉన్నతాధికారులకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ దిశానిర్దేశం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రం సిద్దిపేట జిల్లా చేర్యాలలోని శ్రీ కొమురవెల్లి మల్లన్న కల్యాణం, జాతరలను తెలంగాణ ఆధ్యాత్మిక సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా వైభవోపేతంగా నిర్వహించాలని దేవాదాయ ధర్మాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. వేలాదిగా జాతరకు తరలివచ్చే భక్తులను దృష్టిలో పెట్టుకుని ఏ చిన్న పొరపాటు తలెత్తకుండా పటిష్టమైన కార్యాచరణతో ఏర్పాట్లు చేయాలని మంత్రి సురేఖ అధికారులకు సూచించారు. సోమవారం డా.బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సెక్రటేరియట్ లోని దేవాదాయ ధర్మాదాయ మంత్రిత్వశాఖ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో మంత్రి సురేఖ సిద్దిపేట జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశం కంటే ముందు మల్లన్న జాతర, కళ్యాణం పోస్టరును మంత్రి సురేఖ రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి(జనగామ), ఎండోమెంటు ప్రిన్స్ పల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ హరీష్?, సిద్దిపేట కలెక్టర్ హైమావతి, సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ ఉన్నతాధికారులు, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, సిద్దిపేట అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ), ఆర్డివో, కొమురవెల్లి ఆలయ ఈవో టంకశాల వెంకటేశ్, ఆర్టిసి డిపో మేనేజర్, డిఎంహెచ్ఓ, డిపిఓ, డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్, ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి,గ్రామీణ నీటి సరఫరా, ఫైర్, ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ తదితర శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. రివ్యూ సమావేశంలో దేవాదాయ శాఖ మంత్రి సురేఖ మాట్లాడుతూ గత సంవత్సరం కంటే మరింత వైభవోపేతంగా మల్లికార్జున స్వామివారి కల్యాణం, జాతరను నిర్వహించనున్నట్లు తెలిపారు. గత సంవత్సరం జాతర, కల్యాణం నిర్వహించిన సమయంలో తలెత్తిన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఈ సారి అవి రాకుండా చూడాలని సూచించారు. డిసెంబర్ 14 ఉదయం 10.45 గంటలకు శ్రీ మల్లికార్జున స్వామి వారి కల్యాణాన్ని, జనవరి 18 నుండి 10 వారాలపాటు మార్చి 16 వరకు జాతరను నిర్వహించేందుకు నిర్ణయించినట్లు మంత్రి సురేఖ ప్రకటించారు. ఈ దిశగా భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేయాలని పోలీస్, విద్యుత్, వైద్యారోగ్యం, ఆర్టీసి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, ఆర్ అండ్ బి తదితర శాఖల అధికారులను మంత్రి సురేఖ ఆదేశించారు. భక్తులు ఎలాంటి ఇబ్బంది కలగకుండా కల్యాణాన్ని వీక్షించి, స్వామి అమ్మవార్లను దర్శించుకుని తిరుగు ప్రయాణమయ్యేందుకు వీలుగా అన్ని శాఖలు సమన్వయంతో వ్యవహరించేలా చర్యలు చేపట్టాలని మంత్రి సురేఖ కలెక్టర్ ను నిర్దేశించారు.

## ఆదివాసి గిరిజన ప్రాంతాలు అభివృద్ధి చెందినప్పుడే దేశ అభివృద్ధి సాధ్యం

మధుయాష్కి గౌడ్



**హైదరాబాద్ (జనం సాక్షి) :** రాజ్ భవన్ లో జరిగిన గిరిజన యువతతో ఇంట్రాక్షన్ ( వాలిడిక్టరీ) కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో కలిసి టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ పార్లమెంట్ సభ్యులు మధుయాష్కి గౌడ్ పాల్గొన్నారు. మేరా యువ భారత్ ఆధ్వర్యంలో 17వ ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం లో భాగంగా వారం రోజులపాటు నగరంలో జరిగిన గిరిజన యువత సమ్మేళనంలో చత్తీస్ ఘడ్, జార్ఖండ్, ఒడిశా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలోని వివిధ జిల్లాలకు చెందిన చెందిన యువతీ యువకులు పాల్గొన్నారు. చివరి రోజు అయిన సోమవారం ఉదయం వారు గవర్నర్ కార్యాలయాన్ని సందర్శించారు. వారం రోజులపాటు తాము తెలుసుకున్న అంశాలను, నూతన ఆవిష్కరణలకు సంబంధించి వారి మధ్య జరిగిన చర్చలను గవర్నర్‌తో పంచుకున్నారు. ఈ సందర్భంగా వారికి నిర్వహించిన పలు సాంస్కృతిక పోటీలలో ప్రతిభ కనబరిచిన వారికి బహుమాత్రను గవర్నర్, మధుయాష్కీ కలిసి అందజేశారు. ఈ సందర్భంగా మధుయాష్కీ మాట్లాడుతూ.. స్వాతంత్రం వచ్చి 75 ఏళ్లు దాటినా ఇప్పటికీ గిరిజన ఆదివాసి ప్రాంతాలలో రోడ్లు, పాఠశాలలు, ఆస్పత్రులు, తాగునీరు లాంటి కనీస సదుపాయాలు లేకపోవడం బాధాకరమన్నారు. సామాజిక ఆర్థిక అణిచివేత కారణంగా చాలామంది యువత నక్సలిజం వైపు వెళ్తున్నారన్నారు. ఆదివాసీ ప్రాంతాలు అభివృద్ధి జరిగినప్పుడే దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. గిరిజన ప్రాంతాలలో అనేక వనరులు ఉన్నాయని, కానీ వారికి సరైన సదుపాయాలు, సంపదలో వాటా దక్కకపోవడం బాధాకరమన్నారు.

# భారతదేశంలో గ్రంథాలయ చట్టాలు

**రాజ్యాంగ ఆధారం-ముఖ్య ఉద్దేశ్యం :**

భారతదేశంలో గ్రంథాలయ చట్టాలు అంటే, ప్రజా గ్రంథాలయాలను స్థాపించడానికి, నిర్వహించడానికి, నిర్వహణకు, సమర్థవంతంగా పని చేయడానికి రాష్ట్ర ప్రభుత్వాలు చేసే పబ్లిక్ లైబ్రరీల యాక్ట్‌లు. భారత రాజ్యాంగం ప్రకారం, గ్రంథాలయ సేవలు రాష్ట్ర జాబితాలో ఉండటం వల్ల, రాష్ట్ర ప్రభుత్వాలు అలాగే కేంద్రపాలిత ప్రాంతాలు తమ స్వంత గ్రంథాలయ చట్టాలను చేయాలి. పబ్లిక్ లైబ్రరీ యాక్ట్ యొక్క ప్రధాన ఉద్దేశ్యం ఏమిటంటే, రాష్ట్ర స్థాయి నుండి గ్రామ స్థాయి వరకు బాగా నిర్వహించబడిన, సమగ్రమైన, రాష్ట్రవ్యాప్త ప్రజా గ్రంథాలయాల నెట్‌వర్క్‌ను సృష్టించడం. ఇది పౌరులందరికీ జ్ఞానాన్ని, సమాచారాన్ని ఉచితంగా ఏలాంటి వివక్షతలు లేకుండా సమ దృష్టితో అందిస్తుంది. అలాంటి చట్టాలు ప్రజాస్వామ్య సమాజంలో స్థిరమైన, ఏక రూపమైన(యూనిఫామ్‌గా) ఒక తీరుగా ప్రజా గ్రంథాలయ సేవలను అందిస్తుంది.

భారత రాజ్యాంగంలో గ్రంథాలయాలు రాష్ట్ర బాధ్యతగా ఉండటం వల్ల, కేంద్ర ప్రభుత్వం దీనిపై ప్రత్యక్షంగా చట్టాలు చేయదు. అందుకు బదులుగా, ప్రతి రాష్ట్రం తన సామాజిక, ఆర్థిక మరియు సాంస్కృతిక అవసరాలకు అనుగుణంగా చట్టాలను రాష్ట్రాలే తమకు తామే రూపొందించుకోవాలి. ఉదాహరణకు, తమిళనాడు, ఆంధ్ర ప్రదేశ్ వంటి కొన్ని రాష్ట్రాలు ఇప్పటికే ఇలాంటి చట్టాలు చేశాయి, ఇవి గ్రంథాలయాలను బలోపేతం చేశాయి. ఈ చట్టాల ఉద్దేశ్యం కేవలం గ్రంథాలయాలు స్థాపించడమే కాదు, వాటిని సమాజంలో జ్ఞాన వ్యాప్తికి ముఖ్యమైన సాధనాలుగా మార్చడం. ప్రజలు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నవారు, విద్య, వినోదం మరియు సమాచారం కోసం ఈ గ్రంథాలయాలపై ఆధారపడతారు. ఈ చట్టాలు లేకుండా, గ్రంథాలయాలు అనిశ్చితంగా మరియు అసమర్థంగా మిగిలిపోతాయి, ఇది సమాజ అభివృద్ధికి ఆటంకం కలిగిస్తుంది.

**గ్రంథాలయ చట్టాల అవసరం ఎందుకు?:**

ప్రపంచవ్యాప్తంగా గ్రంథాలయ చట్టాల ప్రాముఖ్యతను యునెస్కో పబ్లిక్ లైబ్రరీ మానిఫెస్టో (1994) హైలైట్ చేస్తుంది. ఇది ప్రజా గ్రంథాలయాలు జాతీయ మరియు స్థానిక అధికారుల బాధ్యత అని, "నిర్దిష్ట చట్టాలతో సపోర్ట్ చేయబడాలి మరియు జాతీయ మరియు స్థానిక ప్రభుత్వాలచే ఫైనాన్స్ చేయబడాలి" అని చెబుతుంది. భారతదేశంలో, ఇలాంటి చట్టాలు చేయకముందు, ప్రజా గ్రంథాలయాలు స్వచ్ఛంద సంస్థలు లేదా స్థానిక సంస్థలచే నడపబడేవి. అవి గణనీయమైన లోపాలతో బాధపడేవి, ఆ లోపాలను తొలగించి చట్టాలు సరిచేయడానికి ఉద్దేశించబడ్డాయి.

**అల్పమైన, అస్థిరమైన ఫండింగ్:**

ఇవి స్వచ్ఛంద ప్రయత్నాలు, సబ్‌స్క్రిప్షన్లు లేదా డొనేషన్లపై ఆధారపడేవి, ఇవి ఆధునిక అవసరాలకు ,సమర్థవంతమైన సేవల నిర్వాహణకు ఆ కొద్ది పాటి నిధులు సరిపోవు. ఉదాహరణకు, ఒక గ్రంథాలయం ప్రారంభంలో ఉత్సాహంతో మొదలైనా, డొనేషన్లు తగ్గిపోతే అది మూసివేయబడుతుంది. ఇది సేవలు అందరికీ అందుబాటులో లేకుండా చేస్తుంది.

**అనియమితమైన నిర్వహణ:**

గతంలో గ్రంథాలయాల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండేది, స్పష్టమైన అధికారం వనరులు లేకుండా. ఎవరు బాధ్యతలు తీసుకోవాలి అనేది అస్పష్టంగా ఉండేది. ఇది అసమర్థతకు దారితీస్తుంది. స్థానిక సంస్థలు ఇతర ప్రాధాన్యతలతో గ్రంథాలయాలను నిర్లక్ష్యం చేసేవి.

**పరిమిత, అస్థిరమైన సేవలు:**



సేవలు తరచుగా సభ్యులకు మాత్రమే పరిమితమై ఉండేవి. గ్రంథాలయాలు స్థిరత్వం మరియు విస్తరణకు అవకాశాలు (స్కోప్) లేకుండా ఉండేవి. స్థాపకుల ఉత్సాహం తగ్గిపోయిన తర్వాత అవి తరచుగా మసకబారేవి. ఉదాహరణకు, ఒక చిన్న గ్రామంలోని గ్రంథాలయం పుస్తకాలు లేకుండా మిగిలిపోయి, పిల్లలు విద్యా అవసరాలకు దూరమవుతారు.

సాధారణ ప్రభుత్వ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ శాశ్వత మరియు సమగ్ర వ్యవస్థను సృష్టించడానికి సరిపోదు. సమగ్ర చట్టం అవసరం ఎందుకంటే: సరైన పరిపాలన మరియు పర్యవేక్షణ బాడీని సృష్టించడానికి, ఇది ఎగ్జిక్యూటివ్ పవర్లతో ఉంటుంది. ఇది నిర్వహణను సమర్థవంతం చేస్తుంది.

మొత్తం రాష్ట్రంలో బాగా నిర్వహించబడిన ప్రజా గ్రంథాలయ నెట్‌వర్క్‌ను స్థాపించడానికి, ఇది గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు విస్తరిస్తుంది. ఇది అన్ని ప్రాంతాల్లో సమాన సేవలను హామీ ఇస్తుంది. స్థిరమైన మరియు శాశ్వతమైన ఫైనాన్స్ మూలాన్ని అందించడానికి, ఇది కీలకమైన విధిని (ఫంక్షన్) నిర్వర్తిస్తుంది. ఫండింగ్ లేకుండా గ్రంథాలయాలు జీవించలేవు కనుక ప్రభుత్వ గ్రాంటులు అందిస్తాయి .గ్రంథాలయ సేవలలో నిర్వహణ లో ఒకే విధమైన విధి విధానాలతో సమర్థవంతంగా ఒకే స్థాయితో (స్టాండర్డ్) నిర్వహించడానికి, నాణ్యత కలిగిన హామీని ఇస్తుంది. పనితీరు మరియు ఫైనాన్స్‌లకు అకౌంటబిలిటీని హామీ చేయడానికి, ఇది దుర్వినియోగాన్ని నివారిస్తుంది. ఉదాహరణకు, ఆడిట్‌లు, పబ్లిక్ ఇన్‌స్పెక్షన్ ద్వారా పారదర్శకతను పెంచుతుంది. ఈ అవసరాలు గ్రంథాలయాలు సమాజంలో జ్ఞాన కేంద్రాలుగా మారడానికి సహాయపడతాయి, ముఖ్యంగా డిజిటల్ యుగంలో సమాచార అసమానతలను తగ్గించడానికి ఈ పద్ధతులు చాలా అవసరం.

**పబ్లిక్ లైబ్రరీల యాక్ట్ - అవసరమైన ఫీచర్లు**

భారతీయ పరిస్థితులకు అనుకూలమైన ఆధునిక పబ్లిక్ లైబ్రరీల యాక్ట్ సమర్థవంతంగా ఉండాలంటే అనేక అవసరమైన భాగాలను కలిగి ఉండాలి. ఒక మోడల్ యాక్ట్ డాక్టర్ ఎస్.ఆర్. రంగనాథన్ యొక్క ఐదు గ్రంథాలయ శాస్త్ర నియమాలకు రూపమిస్తుంది, ఇవి గ్రంథాలయాలు అందరికీ అందుబాటులో ఉండాలి, పుస్తకాలు సరైన వినియోగానికి, మొదలైనవి.

**ప్రీయాంబుల్ (ప్రవేశిక):**

యాక్ట్ యొక్క ఉద్దేశ్యాలను స్పష్టమైన మరియు సంక్షిప్తమైన స్టేట్‌మెంట్ రూపంలో రాయండి ఉంటుంది. ఇది చట్టం యొక్క లక్ష్యాలను వివరిస్తుంది, ఉదాహరణకు, "ప్రజలకు ఉచిత జ్ఞాన ప్రవేశాన్ని అందించడం మరియు గ్రంథాలయ నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడం" మొదలైనవి స్పష్టంగా నియమ, నిబంధనలు లిఖిత పూర్వకంగా ఉంటాయి.

**రాష్ట్ర స్థాయి అథారిటీ:**

రాష్ట్ర గ్రంథాలయ అథారిటీని అపెక్స్ బాడీగా ఏర్పాటు చేయడం, సాధారణంగా గ్రంథాలయాల ఇన్‌చార్జ్ మంత్రి అధ్యక్షతన. ఈ యాక్ట్‌ను అమలు చేయడం, గ్రంథాలయ సేవలను ప్రమోట్ చేయడం జరుగుతుంది. ఎగ్జిక్యూటివ్ డ్యూటీలను చేపట్టుతుంది. ఇది నిర్ణయాలు తీసుకోవడానికి వివిధ నిపుణులు, అధికారులను కలిగి ఉంటుంది.

**చీఫ్ ఎగ్జిక్యూటివ్:**

ప్రొఫెషనల్ డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ లైబ్రరీల పోస్ట్‌ను సృష్టించడం, మొత్తం ప్రజా గ్రంథాలయ వ్యవస్థను పర్యవేక్షించడం, నియంత్రించడం. ఇది గ్రంథాలయ శాస్త్రంలో నిపుణుడిని నియమించడం ద్వారా సమర్థవంతమైన నిర్వహణను హామీ ఇస్తుంది.

**గ్రంథాలయాల నెట్‌వర్క్:**

పిరమిడ్ స్ట్రక్చర్‌లో గ్రంథాలయాలను స్థాపించడానికి ప్రావిజన్, రాష్ట్ర స్థాయి నుండి గ్రామ స్థాయి వరకు నెట్‌వర్క్ సృష్టించడం. ఉదాహరణకు, స్టేట్ సెంట్రల్ లైబ్రరీ, డిస్ట్రిక్ట్ లైబ్రరీలు, బ్లాక్ లెవల్ మరియు విలేజ్ లైబ్రరీలు, ఇవి ఒకదానితో ఒకటి కనెక్ట్ అయి ఉంటాయి.

**ఫైనాన్షియల్ క్లాజులు:** సాధారణ మరియు శాశ్వతమైన ఫండ్‌ల ఫ్లోను హామీ చేయడానికి క్రూషియల్ కాంపోనెంట్. ఇది గ్రంథాలయాల జీవితానికి మూలం.

**లైబ్రరీ సెస్:** మోస్ట్ క్రిటికల్ ఫీచర్, ప్రాపర్టీ ట్యాక్స్, హౌస్ ట్యాక్స్ మరియు వెహికల్ ట్యాక్స్ వంటి ట్యాక్స్‌లపై సర్‌చార్జ్‌గా లైబ్రరీ సెస్‌ను కలెక్ట్ చేయడానికి మాండటరీ ప్రావిజన్. శ్రీ కె.పి. సిన్హా అధ్యక్షతన అడ్వైజరీ కమిటీ ఫర్ పబ్లిక్ లైబ్రరీలు "కేవలం సెస్ మాత్రమే గ్రంథాలయ ఫైనాన్స్‌కు స్థిరమైన బేస్‌ను అందిస్తుంది" అని ముగించింది. ఇది స్థానిక ట్యాక్స్‌లతో లింక్ అయి, ఆటోమేటిక్ ఫండింగ్‌ను అందిస్తుంది.

**స్టేట్ కాంట్రిబ్యూషన్:** స్టేట్ గవర్నమెంట్ నుండి గ్రాంట్‌లకు ప్రావిజన్, తరచుగా సెస్ ద్వారా కలెక్ట్ అయిన మొత్తాన్ని మ్యాచ్ చేయడం. ఇది సెంట్రల్ సపోర్ట్‌ను పెంచుతుంది.

**మ్యాన్‌పవర్:** ప్రొఫెషనల్ స్టేట్ లైబ్రరీ సర్వీస్ క్యాడర్‌ను సృష్టించడానికి ప్రావిజన్ ఉంది. అందరూ గవర్నమెంట్ సర్వెంట్లుగా గుర్తించబడతారు. ఇది నైపుణ్యవంతమైన స్టాఫ్ కు హామీ ఇస్తుంది, ట్రైనింగ్ మరియు ప్రమోషన్‌లతో ఇతర ప్రభుత్వ ఉద్యోగుల వలే నియమం నిబంధనలు పాటించాలి.

**జవాబుదారీతనం (అకౌంటబిలిటీ):** వ్యవస్థ యొక్క కార్యకలాపాలు మరియు అకౌంట్‌లు పబ్లిక్ ఇన్‌స్పెక్షన్ మరియు ఆడిట్‌కు ఓపెన్‌గా ఉండేలా క్లాజులు ఉంటాయి. ఇది పారదర్శకతను పెంచుతుంది మరియు ఆర్థిక దుర్వినియోగాన్ని నివారిస్తుంది.

**లీగల్ డిపాజిట్:** రాష్ట్రంలో ప్రచురించబడిన పుస్తకాలు మరియు న్యూస్‌పేపర్ల లీగల్ డిపాజిట్‌కు ప్రావిజన్. ఇది గ్రంథాలయాలలో సమాచారాన్ని సంరక్షించడానికి సహాయపడుతుంది, సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుతుంది. ఈ ఫీచర్లు కలిసి గ్రంథాలయాలను సమర్థవంతమైన, స్థిరమైన మరియు ప్రజలకు అందుబాటులో ఉండేలా చేస్తాయి, భారతదేశంలో విద్య మరియు సమాచార వ్యాప్తిని పెంచుతాయి.



**డాక్టర్. జీ. రాధికా రాణి,**
అసిస్టెంట్ ప్రొఫెసర్, హెడ్
డిపార్ట్మెంట్ ఆఫ్ లైబ్రరీ అండ్
ఇన్ఫర్మేషన్ సైన్స్, కాకతీయ
యూనివర్సిటీ, వరంగల్.

# అక్షరానువాదం కాదు... భావానువాదమే కీలకం

ఇంగ్లీష్ ఈనాడు ప్రపంచ జ్ఞానానికి ప్రధాన ద్వారం. పాఠ్యపుస్తకాలు, శాస్త్రీయ వ్యాసాలు, సాంకేతిక డాక్యుమెంట్లు, సాహిత్యం... దాదాపు అన్నీ ముందు ఇంగ్లీష్‌లోనే వస్తున్నాయి. ఈ జ్ఞానాన్ని తెలుగు పాఠకులకు చేర్చాలంటే అనువాదం తప్పనిసరి. కానీ ఇంగ్లీష్ నుంచి తెలుగులోకి అనువాదం చేయడం అంత సులువైన పని కాదు. భాషా నిర్మాణం, సాంకేతిక పదజాలం, సాంస్కృతిక భేదాలు... ఇలా ఎంతో గండి. ఈ సమస్యలను అధిగమిస్తేనే నాణ్యమైన అనువాదం సాధ్యమవుతుంది.

**వాక్య నిర్మాణంలోనే మొదటి గండి**

ఇంగ్లీష్ వాక్యం కర్త-క్రియ-కర్మ (S-V-O) క్రమంలో ఉంటుంది. తెలుగులో కర్త-కర్మ-క్రియ (S-O-V). "Ram eats an apple" అయితే తెలుగులో "రాముడు ఒక ఆపిల్ తిన్నాడు" అవుతుంది. క్రియ చివరికి వచ్చేస్తుంది. ఇంగ్లీష్‌లో పొడవాటి ఉపవాక్యాలు సహజం. తెలుగులో అలాంటి వాక్యం రాస్తే గజిబిజిగా మారుతుంది. ఒక్క పెద్ద ఇంగ్లీష్ వాక్యాన్ని రెండు మూడు చిన్న తెలుగు వాక్యాలుగా విడగొట్టి, ప్రవాహంగా రాయాలి. ఇది అనువాదకుని నైపుణ్యాన్ని పరీక్షిస్తుంది.

ప్రిపోజిషన్లు... విభక్తుల మధ్య గండి ఇంగ్లీష్‌లో 'on', 'in', 'about', 'with' వంటి ప్రిపోజిషన్లు ఎక్కువ. తెలుగులో విభక్తి ప్రత్యయాలు (ను, కు, లో, మీద, గురించి, వలన) ఆ పని చేస్తాయి. కానీ ఒక్కొక్కటీ నేరుగా సరిపోవు. "I am thinking about you" అయితే "నేను నీ గురించి ఆలోచిస్తున్నాను". ఇక్కడ 'about'కి 'గురించి' సరైనది. కానీ "The book is on the table" అయితే 'టేబుల్ మీద' అవుతుంది. ఈ సూక్ష్మ భేదాలు లేకపోతే అర్థం తికమకపడుతుంది.

**సాంకేతిక పదాలకు తెలుగులో ప్రతిరూపాలు లేవు**

కంప్యూటర్, ఇంటర్నెట్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, జీనోమ్... ఇలాంటి వేలాది పదాలకు తెలుగులో సహజమైన ప్రతిరూపాలు ఇంకా రూపొందలేదు లేదా రూపొందినా ప్రజల మాటల్లో పడలేదు. 'గణకం', 'మహాజాలం', 'కృత్రిమ మేధ' అని రాస్తే చదవడమే కష్టం. చివరికి 'కంప్యూటర్' అనే అలాగే వాడేస్తున్నాం. ఇది తెలుగు భాషలో ఆంగ్లీకరణను పెంచుతోంది. ఒకే పదానికి సందర్భం బట్టి వేర్వేరు అర్థాలు వచ్చేస్తాయి. 'run' అనే పదం... మనిషి పరిగెత్తడమా, యంత్రం నడవడమా, నది ప్రవహించడమా? సందర్భం చూసుకోకపోతే అనువాదం తప్పుతుంది.

**సాంస్కృతిక అంతరాలు... ముఖ్యవాదాలు**

ఇంగ్లీష్ వ్యాసాల్లో పాశ్చాత్య సంస్కృతి, వ్యక్తివాదం (individualism) ప్రధానంగా కనిపిస్తాయి. తెలుగు సమాజం సామూహికత (collectivism) మీద నడుస్తుంది. "Its raining cats and dogs" అని నేరుగా అనువదిస్తే "కుక్కలు, పిల్లులు కురుస్తున్నాయి" అవుతుంది. తెలుగు పాఠకుడు గందరగోళం అవుతాడు. బదులు "జోరుగా వర్షం కురుస్తోంది" లేదా "గుమ్మడికాయలు కురిసినట్లు" అని సాంస్కృతికంగా సమానమైన వ్యక్తీకరణ వాడాలి.

**అనువాదకుని నైపుణ్యమే కీలకం**

అనువాదం అంటే యాంత్రిక ప్రక్రియ కాదు, సృజనాత్మక ప్రక్రియ. రెండు భాషలపై గట్టి పట్టు, విషయ పరిజ్ఞానం, సాంస్కృతిక సున్నితత్వం... ఇవన్నీ అనువాదకుడికి ఉండాలి. వైద్య వ్యాసం అయితే వైద్య పదజాలం తెలియాలి. లేకపోతే అనువాదం ప్రమాదకరం కావచ్చు. మూల రచయిత భావాన్ని, శైలిని కాపాడుతూనే తెలుగు పాఠకుడికి సహజంగా అనిపించేలా రాయాలి. అంటే అనువాదకుడు కేవలం అనువాదకుడు మాత్రమే కాదు, రెండో రచయితగా మారాలి.

**పరిష్కార మార్గాలు ఏమిటి?**

ముందు తెలుగులో సాంకేతిక, శాస్త్రీయ పదకోశాలను బాగా అభివృద్ధి చేయాలి. ఆ పదాలు పాఠశాలల నుంచి సామాన్య ప్రజల వరకు వ్యాప్తి చేయాలి. అక్షరానువాదం కాకుండా భావానువాదం చేయాలి. సందర్భాన్ని లోతుగా అర్థం చేసుకోవాలి. పాశ్చాత్య ఉదాహరణలకు బదులు తెలుగు పాఠకులకు సుపరిచితమైన ఉదాహరణలు వాడాలి. అనువాదకులకు శిక్షణ, విషయ పరిజ్ఞానం పెంచే కార్యక్రమాలు ఎక్కువగా చేపట్టాలి. ఇంగ్లీష్ నుంచి తెలుగులోకి అనువాదం కేవలం పదాల మార్పిడి కాదు, జ్ఞానాన్ని ఒక సంస్కృతి నుంచి మరో సంస్కృతికి బదిలీ చేయడం. ఈ పని సవాలుతో నిండినదైనా, సాధ్యమే. నైపుణ్యం, సున్నితత్వం, సృజనాత్మకత ఉన్న అనువాదకులు ఉంటే తెలుగు భాషలో జ్ఞాన సంపద మరింత సమృద్ధిగా మారుతుంది. ఆ వంతెన బలంగా నిలిచి, రెండు భాషల మధ్య అంతరాన్ని తొలగిస్తుంది.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

# తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థి సంఘాల ఎన్నికలు-ఆవశ్యకత

చదువుకుంటూనే సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను అర్థం చేసుకుంటూ అసాంఘిక శక్తులపై పోరాటం చేసేవాడు విద్యార్థి. అతని నిస్వార్థపు ఆలోచనలు, చర్యలు దేశ నిర్మాణానికి, ప్రగతికి దోహదం చేస్తాయి.

తెలంగాణ రాష్ట్ర విద్య కమిషన్ తన సిఫారసులలో విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని అప్పుడే యూనివర్శిటీలు ప్రజాస్వామ్య భావాలతో ఉంటాయని తన నివేదికలో పేర్కొంది. దీంతో రాష్ట్రంలో మళ్ళీ విద్యార్థి సంఘాల ఎన్నికల గురించి చర్చ మొదలైంది. తెలంగాణలో ఉన్నత, సాధారణ విద్యా సంస్థల్లో విద్యార్థి సంఘాల ఎన్నికలు గత దశాబ్దంగా నిలిచిపోయిన స్థితి ఎవరికీ తెలియని విషయం కాదు. విద్యార్థుల రాజకీయ శక్తిని చూసి భయపడే ప్రభుత్వాలు, యూనివర్శిటీలు ఈ ఎన్నికలను నిషేధించడం వలన క్యాంపస్‌లలో ప్రజాస్వామ్య వాతావరణం క్షీణించింది. విద్యార్థి సంక్షేమానికి, విద్యా నాణ్యతకు, క్యాంపస్ హక్కుల రక్షణకు ఎన్నికైన ప్రతినిధులు అవసరం అన్న వాస్తవం మరింత స్పష్టం అవుతోంది. క్యాంపస్ ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాల్సిన అవసరం గుర్తించాలి. విద్యార్థి సంఘాలు అనేవి కేవలం రాజకీయ పోటీ వేదికలు కాదుబీ అవి విద్యార్థుల ప్రతిరోజు సమస్యలను పరిష్కరించే ప్రజాస్వామ్య వేదికలు. హాస్టల్ ఫీజులు, ట్రాన్స్‌పోర్ట్, ప్రయోగశాల సామగ్రి, భద్రత, లైబ్రరీ సదుపాయాలు, స్కాలర్‌షిప్‌లు వంటి అనేక అంశాలు ఎన్నికైన సంఘాలు ఉన్నప్పుడు మాత్రమే పారదర్శకంగా చర్చలకు వస్తాయి. ప్రధానంగా రాష్ట్రంలో ఎన్నికలను నిషేధించిన తర్వాత విద్యారంగంలో అనేక మార్పులు వచ్చాయి.

**విద్యార్థి సమస్యలు అణచివేయబడ్డాయి.**

యూనివర్శిటీలు, విద్యలో ప్రభుత్వాల ఏకపక్ష నిర్ణయాలు పెరిగాయి. క్యాంపస్‌లలో భయానక వాతావరణం పెరిగింది. విద్యరంగంలో పెరుగుతున్న ప్రైవేటీకరణ, విద్య వాణిజ్య కరణ వ్యతిరేకంగా స్వరాలు బలహీనపడ్డాయి. ప్రతి ప్రభుత్వానికి విద్యార్థి నాయకత్వంపై ఒక భయం ఉంటుంది. ఎందుకంటే క్యాంపస్‌లలో చైతన్యం పెరిగితే, అది ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తుంది. తెలంగాణలో కూడా అదే జరిగింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల నుంచి విద్యా బడ్జెట్ కోతల వరకు అనేక అంశాలపై విద్యార్థి లోకం వీధుల్లోకి రాకుండా నిలుపుదల చేయడం కోసం ఎన్నికలను రద్దు చేశారు.

క్యాంపస్ల నుండే అనేక మంది విద్యార్థి నాయకులు దేశ రాజకీయాలలో రాజకీయ నాయకులుగా ఎదిగారు. యూనివర్సిటీల్లో విద్యార్థి సంఘ నేతలుగా ఎదిగిన అనేక మంది దేశానికి ప్రధానులు, రాష్ట్రపతులు, ఆయా రాష్ట్రాలకు సీఎంలుగా ప్రజలకు సేవ చేశారు. ప్రస్తుతం సెంట్రల్ వర్సిటీలు, కొన్ని రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో తప్పితే ప్రభుత్వాలు విద్యార్థి సంఘం ఎన్నికలు నిర్వహించడం లేదు. దీంతో సమాజానికి, దేశానికి నిస్వార్థంగా పనిచేసేందుకు రాజకీయాల్లోకి వచ్చే నాయకులు తగ్గిపోతున్నారు.

ఉమ్మడి రాష్ట్రంలో 1988లో ఉస్మానియా విశ్వవిద్యాలయ అనుబంధ నిజాం కళాశాలలో రెండు విద్యార్థి గ్రూపుల మధ్య ఘర్షణలో దేవేందర్ యాదవ్ అనే విద్యార్థి హత్య జరిగిందనే నెపంతో అప్పటి పాలకులు ఈ ఎన్నికలపై నిషేధం విధించారు. ఎనభయ్యవ దశకంలో విద్యార్థి సంఘం ఎన్నికలు విద్యార్థుల ఆలోచనలను మెరుగుపరిచి, అభివృద్ధి వైపు నడిపించాయి. విద్యాసంస్థల్లో ఈ ఎన్నికల నుంచి ప్రేరణ, చైతన్యం పొంది రాజకీయాలలోకి వచ్చిన అనేక మంది సాధారణ విద్యార్థులు నేడు భారత పార్లమెంటరీ రాజకీయ వ్యవస్థలో తమ ప్రభావాన్ని చూపుతున్నారు. బహుజన సమూహాల విద్యార్థులు నాయకులుగా ఎదిగేవారు. ఇది ఇష్టం లేని పాలకవర్గాలే ఈ మూడున్నర దశాబ్దాలుగా ఎన్నికల వైపు తొంగి చూడటం లేదు. పైగా నిషేధాన్ని కొనసాగిస్తూనే ప్రగతిశీల విద్యార్థి ఉద్యమాలను, సంఘాలను అణచివేస్తున్నారు.

ఇటీవల కాలంలో తెలంగాణ ముఖ్యమంత్రి విద్యార్థుల పోరాటాలతోనే ప్రత్యేక రాష్ట్రం సాకారమైందని, విద్యార్థులు రాజకీయాలలోకి రావాలని పిలుపునిచ్చారు. ఒకవైపు విద్యార్థి సంఘం ఎన్నికలపై నిషేధాన్ని కొనసాగిస్తూ, మరోవైపు విద్యార్థులు రాజకీయాలలోకి రావాలనడం మోసం చేయడమే. తక్షణమే విద్యార్థి ఎన్నికల నిర్వహణపై ముఖ్యమంత్రి దృష్టి సారించాలి. అందుకు గతంలో భారత మాజీ ఎన్నికల అధికారి జె.యం లింగ్డో కమిటీ సూచనలు పాటిస్తూ, విశ్వవిద్యాలయాల నిధుల సంఘం (యూజీసీ) విడుదల చేసిన మార్గదర్శకాలను పరిగణనలోకి తీసుకోవాలి.

విద్యలో ప్రైవేటీకరణ, ఫీజుల దోపిడీ, ప్రైవేటు యూనివర్సిటీల ఏర్పాటు, నిరుద్యోగం, కులం, మతం, ప్రాంతాల పేరుతో విద్వేషాలు సృష్టించడం ఇలా విద్యార్థుల భవిష్యత్తును అంధకారం చేసే అనేక వైపరీత్యాలు జరుగుతున్నా విద్యార్థులు, విద్యార్థి సంఘాల నేతలు కనీసం వారి హక్కుల కోసం గళం ఎత్తలేని అచేతన స్థితిలో ఉంటున్నారు. ప్రశ్నించే తత్వం తగ్గిపోతోంది. విద్యార్థి సంఘం ఎన్నికల అంశం తెరమీదకు వచ్చినప్పుడల్లా పాలకవర్గాలు, ఆయా యూనివర్సిటీల యాజమాన్యాలు శాంతిభద్రతల అంశాన్ని సాకుగా చూపుతున్నాయి. శాంతిభద్రతలే సమస్యైతే సాధారణ ఎన్నికలు ఎలా నిర్వహిస్తున్నారు? ఇప్పటికైనా విశ్వవిద్యాలయాలు, కాలేజీలలో విద్యార్థి ఎన్నికలను నిర్వహించి ప్రజాస్వామ్యానికి అవసరమైన ప్రజానాయకులను, సామాజికవేత్తలను దేశానికి అందించవలసిన ఆవశ్యకత ఉన్నది.




**టి.నాగరాజు**
ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి,
ఫోన్:9490098292

# వ్యవసాయ రంగంలో దిగుమతులా వ్యవసాయ దేశానికి ఇది తగునా!

వ్యవసాయం భారతదేశ జీవనాడి అనే విషయాన్ని తరతరాలుగా చెప్పుకుంటున్నప్పటికీ ప్రస్తుత గణాంకాలు చూస్తే మన బలహీనతలు కళ్లకు కండ్లంత కనబడుతున్నాయి. అనాదిగా పసిడి నేలలతో ప్రకృతి నిచ్చిన వరాల మధ్య పెరిగిన ఈ దేశం ప్రపంచంలోనే ఔషధ మొక్కల ఉత్పత్తిలో అగ్రస్థానంలో నిలిచింది పంటల వైవిధ్యానికి నిలయంగా నిలిచింది కాని ఆధునిక కాలపు వ్యవసాయ విధానాలు హరిత విప్లవ ప్రభావం క్రిమిసంహారక ద్రవ్యాల అధిక వినియోగం రసాయన ఎరువుల అతిమోతాదులు ఇవన్నీ కలిసివచ్చి భూసారాన్ని దెబ్బతీసి పంటలలో ఉండాల్సిన పౌష్టిక విలువలను తగ్గించాయి. దీనివల్ల దిగుబడి తగ్గి దేశీయ అవసరాలను తీర్చలేని పరిస్థితి ఏర్పడి నేడు ఎన్నో కీలక వ్యవసాయ ఉత్పత్తులకు భారత్ దిగుమతులపై ఆధారపడే దశకు చేరింది. ఇది ఆర్థిక వ్యవస్థపై భారమేగాక విదేశీ మారక ద్రవ్య నిల్వలకు కూడా ప్రమాదకర సంకేతమని స్పష్టంగా తెలుస్తోంది.

దేశ స్థాయి నుండి గ్రామస్థాయి వరకు ఆహారపు అలవాట్ల మార్పు ఆరోగ్యంపై పెరిగిన అవగాహన పోషక విలువలపై ప్రజల దృష్టి పెరగడం వంటి కారణాలు వివిధ పంటల డిమాండును పెంచినా ఆ డిమాండుకు సరిపడే విధంగా వ్యవసాయ ప్రణాళికలను రూపొందించడంలో పాలకవర్గాలు వ్యవసాయ నిపుణులు రైతులు సమన్వయం పాటించకపోవడం వల్లే అసమతుల్యత తీవ్రమైంది. హరిత విప్లవ ఫలితంగా వచ్చిన ప్రతికూల దుష్పరిణామాలను పక్కనబెట్టి మట్టిసారాన్ని పునరుద్ధరించేందుకు అవసరమైన చర్యలను నిర్లక్ష్యం చేయడం పంటలలో విషపూరితాల ప్రవేశం ఆరోగ్యంపై దెబ్బతీస్తుండగా భారతదేశం వంటి వ్యవసాయ ప్రధాన దేశానికి ఇది తగని స్థితి. దిగుబడిని పెంచడం పంటలలో పౌష్టిక విలువలను పెంపొందించడం దిగుమతులను తగ్గించడం ఎగుమతులను పెంచడం ఇవన్నీ ఒకే దిశలో నడిచే చర్యలు కావాలి.

వ్యవసాయ అధికారులు వ్యవసాయ నిపుణులు పాలకులు రైతుల మధ్య సమన్వయ లోపం లక్ష్య నిర్ధారణ లోపం భూసార పరీక్షలను శాస్త్రీయంగా అమలు చేయకపోవడం రైతులకు సరైన అవగాహన అందించకపోవడం ఇవన్నీ కలసి సమస్యను మరింత క్లిష్టం చేశాయి. అయినప్పటికీ నేటికీ రైతులు తమ చెమటను నమ్ముకుని పనిచేస్తున్నారన్న విషయం నిజం. ఇటీవల కేంద్ర ప్రభుత్వం 3000 కోట్ల రూపాయలతో దేశవ్యాప్తంగా సేంద్రీయ వ్యవసాయాన్ని అమలు చేయాలనే నిర్ణయం తీసుకోవడం ఉపశమనకర సంకేతం అయినప్పటికీ ఇది సమగ్ర మార్పుకి ఆరంభ సూచిక మాత్రమే. వ్యవసాయ రంగం బలపడాలంటే సమన్వయ చిత్తశుద్ధి అంకితభావం రైతాంగ పట్టుదల ప్రభుత్వాల నిబద్ధత ఇవన్నీ తప్పనిసరి.




కేంద్ర ప్రభుత్వ వార్షిక నివేదిక ప్రకారం దిగుమతులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఎంత తీవ్రమైందో గణాంకాలు చెబుతున్నాయి. 2018-20లో 1.52 లక్షల కోట్ల విలువైన 10 ప్రధాన వ్యవసాయ సరుకులను దిగుమతి చేసుకున్న భారత్ 2022%-%23లో 2.82 లక్షల కోట్లకు చేరగా 2024%-%25లో అది 3 లక్షల కోట్లకు చేరుతుందని అంచనా. 2024 నవంబర్ నాటికే దిగుమతుల మీద ఖర్చు చేసిన మొత్తం 1,81,141 కోట్లు. వీటిలో వెజిటేబుల్ ఆయిల్స్ 1,22,202 కోట్లు పప్పుధాన్యాలు 27,441 కోట్లు పండ్లు 16,092 కోట్లు చక్కెర 8,004 కోట్లు జీడిపప్పు 9,896 కోట్లు సహజ రబ్బరు 6,798 కోట్లు ఇవన్నీ కలిపి ఒక వ్యవసాయదేశానికి తగని దిగుమతి భారంగా కనిపిస్తున్నాయి. మనలాంటి మట్టి మనిషులతో నిండిన దేశం పంట వైవిధ్యానికి ప్రసిద్ధి చెందిన భూభాగం కలిగిన దేశం ఇంత పెద్ద మొత్తంలో విదేశీ నిధులు ఖర్చు చేయడం ఆర్థిక అరాచకత్వంలా అనిపించకమానదు.

ఈ దుస్థితి నుంచి బయటపడాలంటే దిగుమతులను తగ్గించే చర్యలతో పాటు ఎగుమతులను పెంచే ప్రణాళికలు వ్యూహాలు అవసరం. వ్యవసాయ వనరులు నీటి వనరులు శాస్త్రీయ జ్ఞానం ప్రపంచ స్థాయి మార్కెట్ అవకాశాలు ఇవన్నీ మనకున్న బలం. ఇవన్నీ సమన్వయంతో అమలు చేయగలిగితే దిగుమతుల తగ్గుదల సాధ్యమే కాదు వ్యవసాయ రంగంలో భారతదేశం ఆత్మనిర్భరత వైపు వేగంగా దూసుకుపోదు.

మనకు లభించే నేల వనరులు నీటి వనరులు శాస్త్రీయ నైపుణ్యం ఇవన్నీ సమగ్ర ప్రణాళికగా అమలు అయ్యే రోజు భారత్ దిగుమతులపై ఆధారపడని వ్యవసాయ శక్తిగా మారుతుంది. రైతులకు సరైన పంటల మార్గనిర్దేశం మార్కెట్ భరోసా ఎగుమతి అవకాశాలపై పూర్తి అవగాహన అందిస్తే దిగుమతుల నీడ నుండి బయటపడే మార్గం సులభమవుతుంది. విద్యను గ్రామస్థాయికి చేర్చడం మట్టిసార పరీక్షలను కచ్చితంగా అమలు చేయడం పంటల వివిధీకరణను ప్రోత్సహించడం భారత వ్యవసాయ రంగానికి కొత్త ఉత్సాహాన్ని ఇస్తాయి. భారత ఆర్థిక వ్యవస్థ బలపడాలంటే ముందుగా వ్యవసాయ రంగాన్ని బలపరచాలి ఎందుకంటే భారత ఆర్థిక శక్తికి పునాది వ్యవసాయమే. ప్రణాళికాబద్ధమైన వ్యవసాయ వికాసం అమలు అయితే దిగుమతి భారాన్ని తగ్గించి దేశాన్ని ఆహార సంపదలో విశ్వసనీయ ఎగుమతి కేంద్రంగా మార్చే మార్గం స్పష్టంగా కనిపిస్తుంది.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

## ఊర్లో ఏముంది

ఊర్లో ఏముందంటే...,
ఆకలి పసిగట్టి కడుపు నింపే
మా అమ్మ ఉంది
నీడలా వెన్నంటే ఉంటూ
కంచెలా కాపు కాచే మా నాన్న ఉన్నాడు
కలుషితం లేని
ఆహ్లాదకర వాతావరణం ఉంది
తారతమ్యం లేకుండా వరుసలతో
ఆప్యాయంగా పలకరించుకునే
బంధాలున్నాయి
పచ్చని పొలం గట్ల పై తిరిగిన
అందమైన అనుభవాల
తీపి జ్ఞాపకాలున్నాయి
తొలి పొద్దున లేవగానే వినే
కోయిల కమ్మని రాగాలున్నాయి
పంట చేన్లో ఒకరి సద్ది మూట
ఒకరు పంచుకుని తినే మంచి
మనసుల కలివిడితనం ఉంది
చలువను అందిచి మమతానురాగాలు
పంచే మా మట్టిల్లు ఉంది
ఐకమత్యంతో కలిసి మెలిసి
జీవించి నడిచే గుణముంది
అన్నిటికన్నా మన మనసుకు
విలువైనది అవసరమైనది
మనశ్శాంతి మెండుగా ఉంది.

ఎం రాజశేఖర్ ఆదోని
9381004519.

# అక్రమ కట్టడాలపై ఉక్కుపాదం

- ఐజీఆర్ఎస్ ద్వారా వచ్చిన 38 కోట్లను దశలవారీ అభివృద్ధి పనులకు వినియోగం
- గుండ్లపోచంపల్లి పురపాలక సంఘం కార్యాలయంలో అవినీతికి పాల్పడితే ఉపేక్షించేది లేదు
- కమిషనర్ ఆర్.వెంకటగోపాల్



మేడ్చల్ నవంబర్ 17 (జనంసాక్షి): గుండ్లపోచంపల్లి పురపాలక సంఘం పరిధిలో అక్రమ నిర్మాణాలను ఈపాటికే పట్టిపరంగా నోటీసులు అందజేయడం జరిగిందని కమిషనర్ ఆర్.వెంకటగోపాల్ అన్నారు. సోమవారం గుండ్లపోచంపల్లి పురపాలక సంఘం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఇన్చార్జి మంత్రి శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో గుండ్లపోచంపల్లి పురపాలక సంఘం మరింత అభివృద్ధి సాధించే దిశగా ముందుకు వెళ్తున్నామని అన్నారు. ఈ క్రమంలోనే అయోధ్య చౌరస్తా నుంచి కొంపల్లి వరకు రోడ్డు విస్తరణ పనులను త్వరలో చేపట్టే విధంగా ప్రయత్నాలు కొనసాగుతున్నాయని తెలిపారు. గుండ్లపోచంపల్లి పురపాలక సంఘం పరిధిలో సహజ వనరులు, వాతావరణ కాలుష్యం లేకుండా ఎస్టీపీలను ఏర్పాటు చేసి మురుగు నీరు వలసకాలంలో నిర్మాణం చేపడుతూ అవసరమైన చోట సీసీ రోడ్లు నిర్మాణం కొనసాగిస్తామని తెలిపారు. అదే విధంగా పురపాలక సంఘం పరిధిలో (గ్రామ ప్రజలు సిటిజన్ చార్ట్ ప్రకారం అందరికీ సేవలు అందిస్తామని ప్రత్యేకంగా ప్రజలకు అత్యవసర సమయంలో సైతం అందుబాటులో ఉంటూ మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు. అంతేకాకుండా గుండ్లపోచంపల్లి పురపాలక సంఘం పరిధిలో టాక్సుల రూపంలో రావలసిన నిధులు రూ.16 కోట్ల 13 లక్షలు ఉండగా బకాయిల రూపంలో మరికొంత సొమ్ము అదనంగా ఉన్నట్లు తెలిపారు. టాక్సుల రూపంలో 49 శాతం పనులు చేశామని ఇద్వారా వచ్చిన ఆదాయాన్ని జిల్లా ఇన్చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా గుండ్లపోచంపల్లి పురపాలక సంఘం పరిధిలో బాలుర వసతి గృహాలు, బాలికల వసతి గృహాలు అధికసంఖ్యలో ఉన్నాయని ఆ వసతి గృహాల యజమానులు తమ బాధ్యతగా విద్యార్థిని, విద్యార్థుల పూర్తి జాబితాను తయారు చేసుకుంటూ వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలని, అనుమానస్పదంగా ఉన్న విద్యార్థుల వివరాలు వారి తల్లిదం(డులకు తెలియజేయాలని మరీ శృతిమించితే పోలీసు లకు సైతం సమాచారం ఇవ్వాలని తెలిపారు. జీ ప్లస్ 2 భవన అనుమతులు తీసుకుని ఎలాంటి అనుమతులు లేకుండా అదనపు అంతస్తులు నిర్మించి వాణిజ్య వ్యాపారాలు నిర్వహిస్తున్న భవన యజమానుల వివరాలు సేకరించి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని, సదరు భవన నిర్మాణాలకు అగ్నిమాపక శాఖ అనుమతులు ఉండాలని తెలిపారు. అగ్నిమాపక శాఖ నుంచి అనుమతులు లేని భవనాలపై సైతం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఆఫీసర్ శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

# కొడంగల్ డిగ్రీ కళాశాల ఎంఓయు మధ్య ఒప్పందం

చరిత్రాత్మక అధ్యయనం



కొడంగల్, నవంబర్ 17 (జనంసాక్షి): ప్రభుత్వ డిగ్రీ కళాశాల కొడంగల్ చరిత్ర విభాగం, తెలంగాణ వారసత్వ శాఖ (డిపార్ట్మెంట్ అఫ్ హెరిటేజ్) మధ్య ఈరోజు ఎం.ఓ.యూ (అవగాహనా ఒప్పందం) జరిగింది. తెలంగాణ వారసత్వ శాఖ డైరెక్టర్ ప్రొఫెసర్ అర్జున్ రావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా శ్రీనివాస్ రెడ్డి ఈ అవగాహనా ఒప్పందంపై సంతకాలు చేసి ఒప్పంద పత్రాలను పరస్పరం మార్చుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ వారసత్వ శాఖ డైరెక్టర్ ప్రొఫెసర్ అర్జున్ రావు మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కొడంగల్ తో అవగాహనా ఒప్పందం తమకు సంతోషదాయకమని, డిగ్రీ కళాశాల విద్యార్థులు తమ సంస్థ జరిపే చారిత్రక తవ్వకాలు, ఇతర అధ్యయన కార్యక్రమాలలో పాల్గొనడం వల్ల వారు చరిత్ర సబ్జెక్ట్ పట్ల ఆకర్షితులై భవిష్యత్తులో గొప్ప చరిత్రకారులుగా మారే అవకాశం ఉందన్నారు. ఎం. ఓ. యూ కై కళాశాల ప్రిన్సిపాల్ చరిత్ర విభాగం చూపిన చొరవను ప్రశంసించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ వారసత్వ విభాగంతో తమ కళాశాల అవగాహన ఒప్పందం చేసుకోవడం కళాశాల చరిత్రలోనే ఒక చారిత్రక ఘట్టం అని, ఈ అవగాహనా ఒప్పందం తమకు ఎంతో లాభదాయకమని, దీనివల్ల తమ కళాశాల అధ్యాపకులు విద్యార్థులు, వారసత్వ విభాగం జరిపే చారిత్రక తవ్వకాలు, అధ్యయనాలలో స్వయంగా పాల్గొని చరిత్ర పరిజ్ఞానాన్ని, చరిత్ర సబ్జెక్టు పట్ల ఆసక్తిని పొందగలరని, వారసత్వ విభాగ నిపుణుల ద్వారా కళాశాలలో సెమినార్లు, కార్యశాలలు, శిక్షణ కార్యక్రమాలు, పురాతన వస్తు ప్రదర్శనలు, విస్తరణోపన్యాసాలను నిర్వహించే అవకాశం ఉంటుందని, పరిశోధనా పత్రాలను సమర్పించే గొప్ప అవకాశం కూడా లభిస్తుందని, విద్యార్థులు పురాతన విగ్రహాలు, వస్తువులు, నాణేలు వంటి వాటిని అధ్యయనం చేస్తారని తెలిపారు. అంతేకాకుండా తమ విద్యార్థులు వారసత్వ శాఖ మ్యూజియంలను క్షేత్ర పర్యటనల ద్వారా సందర్శించే గొప్ప అవకాశం కూడా లభిస్తుందన్నారు.ఈ కార్యక్రమం లో వారసత్వ శాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగరాజు,అసిస్టెంట్ డైరెక్టర్ బి. మల్లు కళాశాల చరిత్ర విభాగాధిపతి సోమ్లా పాల్గొన్నారు.

# బోర్న్ టూ సూన్, బట్ ఇన్ ది సేఫ్ హ్యాండ్స్




దేశవ్యాప్తంగా ప్రీ మీథన్ 2025 ప్రారంభం

హైదరాబాద్, నవంబర్ 17 (జనంసాక్షి): భారతదేశంలోని మహిళలు, పిల్లల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రముఖ నెట్వర్క్ అయిన అంకురా హాస్పిటల్స్, ఏవియేషన్ ఫౌండేషన్‌తో కలిసి, ప్రీమెథాన్ 2025ను ప్రారంభించింది, ఇది "బోర్న్ టూ సూన్, బట్ ఇన్ ది సేఫ్ హ్యాండ్స్" అనే జాతీయ ప్రచారం కింద అకాల జననాల గురించి అవగాహన పెంచడానికి అంకితమైన బహుళ-నగర వాకథాన్. ఈ చిన్న యోధులు , వారి కుటుంబాల ధైర్యాన్ని జరుపుకుంటూ అకాల జననాల చుట్టూ ఉన్న వైద్య, భావోద్వేగ సామాజిక సవాళ్లను ఈ చొరవ హైలైట్ చేసింది. ఈ వాకథాన్ హైదరాబాద్, పుణే, ఖమ్మం, విజయవాడ, తిరుపతి, భువనేశ్వర్ అనే నాలుగు రాష్ట్రాల్లోని ఆరు నగరాల్లో జరిగింది. హైదరాబాద్‌లో జరిగిన ప్రధాన కార్యక్రమంలో ఒలింపిక్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ సైనా నెహ్వాల్ ముఖ్య అతిథిగా పాల్గొని క్రీడ, మనుగడ రెండింటినీ నిర్వచించే బలం, సంకల్పం మరియు స్థితిస్థాపకత స్ఫూర్తిని ప్రతిబింబిస్తుంది. సైనా నెహ్వాల్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులకు విద్యను అందించడంలో, పిల్లల శ్రేయస్సును ప్రోత్సహించడంలో అంకురా హాస్పిటల్స్ నిబద్ధత నిజంగా ప్రశంసనీయం, ఆరోగ్యకరమైన భవిష్యత్తులను ప్రోత్సహించే ఉద్యమంలో భాగం కావడం నాకు సంతోషంగా ఉంది అని అన్నారు. హైదరాబాద్ కార్యక్రమానికి గౌరవ అతిథిగా సీఎస్ఆర్ వింగ్ (తెలంగాణ సోషల్ ఇంపాక్ట్ గ్రూప్ / తెలంగాణ ప్రభుత్వ సీఎస్ఆర్ వింగ్) మాజీ డైరెక్టర్ అర్చన సురేష్‌ను స్వాగతించడానికి అంకురా హాస్పిటల్స్ గౌరవించబడింది. అంకురా హాస్పిటల్స్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, నియోనాటాలజిస్ట్ డాక్టర్ కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

# భగత్‌సింగ్ నగర్ గుడిసెవాసులకు న్యాయం చేయండి



బోడుప్పల్ నవంబర్ 17 (జనంసాక్షి): మేడిపల్లి మండలం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో భగత్ సింగ్ నగర్ కాలనీ వాసులకు న్యాయం చేయాలని సిపిఐ పార్టీ మండల కార్యదర్శి రచ్చ కిషన్ ఆధ్వర్యంలో మేడిపల్లి మండల తహసిల్దార్ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రచ్చ కిషన్ మరియు జె లక్ష్మిలు మాట్లాడుతూ పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో భగత్ సింగ్ నగర్ కాలనీలో గత 20 సంవత్సరాల క్రితం సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో గుడిసెలు వేయడం జరిగినది. ఇప్పుడు కొంత మంది ఖాళీ ఉన్న ప్రదేశంలో కొత్త గుడిసెలు వేయడంతో నిజమైన లబ్దిదారులకు అన్యాయం జరుగుతుంది. కావున ఇప్పుడు వేస్తున్న కొత్త గుడిసెలను వెంటనే తొలగించాలని , ప్రభుత్వం ఇచ్చిన పట్టాలపై కొంత మంది కోర్టు కేసు వేయడం జరిగినది. ఈ కోర్టు కేసు ఆపిల్ వెయ్యాలని కొంతమంది గుడిసెలలో డబ్బు దాటేయ చేసి లాయర్ కు డబ్బులు కట్టాలని పేద ప్రజల దగ్గర డబ్బులు వసూలు చేయడం జరుగుతున్నది. కావున ఈ కేసును ప్రభుత్వమే తీసుకుని ఈ పేద ప్రజల పక్షాన న్యాయం పోరాటం చేయాలని లబ్దిదారులకు పట్టాలు ఇవ్వాలని ఎవరైతే స్థానికంగా గుడిసెలలో నివాసం ఉంటున్నారో పట్టాలు రాని వారికి వెంటనే ప్రభుత్వం తరపున పట్టా లు ఇప్పించాలని ఎవరైతే కాలి స్థలాన్ని కబ్జా చేయాలని ప్రయత్నం చేస్తున్నారో వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఐ పార్టీ నుంచి తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు సిపిఐ పార్టీ మండల సహాయ కార్యదర్శి సిహెచ్ మాధవి, బీసీ సంఘం జిల్లా నాయకురాలు శేప్రమీల, బికెఎంయు కార్యదర్శి , అధ్యక్షులు కే మహాలక్ష్మి, భూతం బలయ్య, ఇన్చార్జి పాల్గొనడం జరిగినది.

# ప్రజావాణికి ఫిర్యాదులు నిల్



మర్పల్లి నవంబర్ 17 (జనంసాక్షి): ప్రజాపాలనలో ప్రజావాణికి సీఎం రేవంత్ రెడ్డి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నప్పటికీ మండల స్థాయిలో అది ఆచరణకు నోచుకోవడంలేదు. వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల కేంద్రంలో కొన్ని వారాలుగా ఒక్క ఫిర్యాదు రాకపోవడమే అందుకు నిదర్శనం. ప్రజావాణి కార్యక్రమం పై ప్రజల్లో నమ్మకం పోతుంది. మండల కేంద్రంలో ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో గత కొన్ని వారాల నుండి ఒక దరఖాస్తు కూడా రాలేదు. దీనికి కారణం మండల ప్రజలకు ప్రజావాణి కార్యక్రమం పై అవగాహన లేకపోవడమే కారణమన్న చర్చ జరుగుతుంది. వచ్చిన దరఖాస్తులపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం కూడా మరో కారణమన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతి గ్రామంలో ప్రజావాణి కార్యక్రమం పై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని జనం అంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రజావాణి కార్యక్రమానికి మండల స్థాయి అధికారులందరూ హాజరై వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా చూడాలని డిమాండ్ చేస్తున్నారు. కార్యక్రమంపై ప్రజలకు నమ్మకాన్ని పెంచాలని అభిప్రాయ పడుతున్నారు.

# పేదల వైద్యం కోసం

ఎంసీఎంఆర్ఎఫ్



అల్వాల్, నవంబర్ 17 (జనంసాక్షి): పేద చికిత్సకు ప్రభుత్వం అందించే సీఎంఆర్ఎఫ్ సహాయం నిజమైన వరంగా మారుతోంది. సోమవారం శ్రీరామ్‌నగర్ నివాసి దయానందకు రూ.60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డిలు అందజేశారు. అవసరంలో ఉన్న కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న ఈ వైద్యసాయం వేగంగా చేరేలా ప్రజాప్రతినిధులు చూపుతున్న శ్రద్ధను స్థానికులు ప్రశంసించారు. కార్యక్రమంలో యాదగిరి, ప్రేమ్, గిరి పాల్గొన్నారు.

# దొంగతనం ముసుగులో దారుణ హత్య

నిందితులు క్రూరమృగాలు
ఉరితీయాల్సిందే
స్థానికుల డిమాండ్



శేరిలింగంపల్లి, నవంబర్ 17 (జనంసాక్షి) : బలవంతంగా బెదిరింపులు పాల్పడి ఫోన్ లాక్కుంటుం దడంతో ప్రతిఘటించిన పాపానికి ఓ అమాయకుడిని అత్యంత దారుణంగా హత్య చేసిన ఉదంతం సోమవారం వెలుగులోకి వచ్చింది. మాదాపూర్ డీసీపీ రితిరాజ్ వెల్లడించిన వివరాల ప్రకారం... ఈనెల 10వ తేదీ 11.30 గంటల సమయంలో గర్చుడ్రం పోలీసులకు ఓ ఫిర్యాదు అందింది. దీంతో హుటాహుటిన పోలీస్ స్టేషన్ పరిధి నంది హిల్స్ సమీపంలోని బిఎస్ఆర్ హిల్స్ బ్రిడ్జి వద్దకు చేరుకోగా అక్కడ తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో సౌరబ్ కుమార్(24) పడి ఉండడం గమనించిన పోలీసులు బాధితుడిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించి అనంతరం అక్కడి నుంచి ఐసీయూలో చికిత్స అందించడం జరిగింది. అయితే రెండు రోజుల చికిత్స అనంతరం సౌరబ్ కుమార్ మృతి చెందడం జరిగింది. ఈ నేపథ్యంలో 10వ తేదీ అర్ధరాత్రి జరిగిన ఘటన వివరాలను పోలీసులు ఛేదించే క్రమంలో భయంకరమైన వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. హఫీజ్ పేట్ ప్రాంతానికి చెందిన మొహమ్మద్ రెహాన్ (19), మహమ్మద్ ఇబ్రహీం (19), మరో ఇద్దరు మైనర్లు హైటెక్ సిటీ ప్రాంతంలో నంబర్ ప్లేట్లులేని రెండు బైకులు(హీరో హెూండా ప్యాషన్ ప్రో, హెూండా డియో) లపై రాత్రి రా త్రి 11.30 గంటల సమయంలో విచ్చలవిడిగా తిరుగుతూ ఒంటరిగా కనిపించిన సౌరబ్ కుమార్ ను టార్గెట్ చేసి బలవంతంగా తమ బైకుపై ఎక్కించుకొని జూబ్లీహిల్స్ ప్రాంతం నిర్మాణస్థ ప్రదేశంలోకి వెళ్లిన తర్వాత అతని ఫోన్ ని లాక్కోవడానికి ప్రయత్నించగా కుమార్ గట్టిగా ప్రతిఘటించి మహమ్మద్ రిహాన్‌తో పెనుగులాడాడు. దీనిని అవమానంగా భావించిన రెహాన్, ఇబ్రహీం మరో ఇద్దరు మైనర్లు సౌరబ్ కుమార్ హత్య చేయడమే లక్ష్యంగా నంది నగర్ పరిధి బిఎస్ఆర్ హిల్స్ వద్ద సెంట్రింగ్ రాడ్లను ఉపయోగించి అత్యంత పాశవికంగా దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలైన సౌరబ్ కుమార్ ను వదిలేసి పారిపోవడం జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు బాధితుడిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా ఈనెల 13న చనిపోవడం జరిగింది.

నిందితులు క్రూరమృగాలు : దొంగతనాలకు పాల్పడుతున్నట్లు నలుగురు నిందితులు కనిపిస్తున్న ప్రవృత్తి మాత్రం క్రూరంగా, అత్యంత పాసవికంగా కనిపిస్తుందని, కేవలం ఫోన్ లాక్కుంటుంటే ప్రతిఘటించిన పాపానికి దారుణంగా కొట్టి చంపడం ఎంతవరకు సమంజసం స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మనుషుల ముసుగులో ఉండే వీరు మరింత పెట్రేగిపోయి గూండాలుగా, అసాంఘిక శక్తులుగా ఎదిగి సమాజాన్ని మరింత భయభ్రాంతులకు గురిచేసే అవకాశం ఉందని, విచారణ పేరుతో కాలయాపన చేయకుండా తక్షణమే ఉరితీయడం ఒక్కటే ఈ సమాజానికి మేలు చేకూరు స్తుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# మెడికల్ కాలేజీ, గురుకుల భవనాలు తరలించొద్దు



కొడంగల్ ప్రజల అభిప్రాయం

కొడంగల్, నవంబర్ 17 (జనంసాక్షి): మెడికల్ కాలేజీ, గురుకుల భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వం మరోచోటకు తరలించడం కొడంగల్ ప్రజలను అవమానిచ్చినట్లే అని కొడంగల్ ప్రజలు అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విధంగా ప్రణాళికలు మార్చుకోవడం సరికాదన్నారు. కేడీపీ జేసీసీ ఆదర్యంలో సోమవారం కొడంగల్ స్థానిక ప్రజల అభిప్రాయాలు తెలుసుకునేందుకు పట్టణంలోని ఓ కాలనీలో ఇంటింటికి కరపత్రాలు పంచుతూ ప్రజాభిప్రాయం సేకరించారు. ఈ సందర్భంగా ప్రజలు మాట్లాడుతూ..ఇప్పటికైనా ముఖ్యమంత్రి పునరాలోచించి శంకుస్థాపన చేసిన చోటనే పనులు కొనసాగించాలి అంటూ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గ కేంద్రమైన కొడంగల్ పట్టణంలో మెడికల్ కాలేజీ, గురుకుల భవనాలతో పాటు మరికొన్ని ప్రభుత్వ భవనాలు నిర్మిస్తే కొడంగల్ అభివృద్ధి జరుగుతుందని అభిప్రాయం చెబుతున్నారు. ఈ కార్యక్రమంలో కేడీపీ జేసీసీ కో కన్వీనర్లు గంటి సురేష్ కుమార్, ఎస్ఎం గౌసన్ ఎర్రన్ పల్లి శ్రీనివాస్, మసాని వెంకటయ్య, విహార్ పాల్గొన్నారు.

# మానవాళికి మంచి చేయాలనే దృక్పథం, ఆలోచన ఉండాలి

ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి




చేవెళ్ల, నవంబరు 17 (జనంసాక్షి): మానవాళికి మంచి చేయాలనే దృక్పథం, ఆలోచన ఉండాలని ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. చేవెళ్ల డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం 2025-2026 విద్యార్థులకు వైట్ కోట్ సెరిమని క్యాడవర్ ఓత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...వైద్య వృత్తి నేటి కాలంలో ఎంతో గొప్పగా అనిపించినా విద్యార్థులు సేవాభావంతో మెలగాలని అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఎప్పటికప్పుడు కొత్త ఆలోచనలతో వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవటం కోసం తపించాలని సూచించారు. ఎన్నో జన్మనెత్తితే తప్ప మానవ జన్మ రాదని ఇలాంటి పరిస్థితుల్లో మానవాళికి మంచి చేయాలనే దృక్పథం, ఆలోచన ఉండాలని సూచించారు.

# మహిళ మెడలోంచి గొలుసును లాక్కెళ్లిన దుండగులు

- శామీర్ పేటలో పట్టపగలే 4 తులాల చైన్ స్నాచింగ్
- అగంతకుల కోసం తీవ్రంగా గాలిస్తున్న పోలీసులు

శామీర్ పేట (జనంసాక్షి): రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ మహిళ మెడలోంచి బైక్ పై వచ్చిన ఇద్దరు ఆగంతకులు బంగారు గొలుసును లాక్కెళ్లారు(చైన్ స్నాచింగ్). ఈ చోరీ సంఘటన శామీర్ పేట మండలంలోని తూంకుంటలో సోమవారం ఉదయం పట్టపగలే జరిగింది. కాగా ఈ చైన్ స్నాచింగ్ చోరీ సంఘటన స్థానికంగా కలకలం రేపింది. బాధితురాలు, స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం ఈ చైన్ స్నాచింగ్ చోరీ సంఘటన వివరాలిలా ఉన్నాయి. తూంకుంటకు చెందిన మల్లారం జమున(45) స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలలో... పనిచేస్తు కుటుంబంతో జీవనం సాగిస్తుంది. కాగా సోమవారం జమున జ్వరంతో బాధపడు తుండటంతో తూంకుంటలోని ఓ హాస్పిటల్ డాక్టర్ కు చూయించుకొని వైద్య సర్టిఫికెట్ తీసుకుని ఆ పాఠశాలలో సమర్పించడానికి బయలుదేరింది. కాగా ఇంటి నుండి వెళ్లిన కొద్ది దూరంలో గల క్లైజన్ పాత జిమ్ సమీపంలో ఉన్న రోడ్డుపై జమున నడుచుకుంటూ వెళ్తుండగా సోమవారం ఉదయం 11 గంటల సమయంలో వెనక వైపు నుంచి బైక్ పై వచ్చిన ఇద్దరు ఆగంతకులు ఆ మహిళ మెడలో ఉన్న దాదాపు 4 తులాల బంగారు చైన్ ను లాక్కొని చిక్కకుండా అక్కడి నుంచి పారి పోయారు. బైక్ పై వచ్చిన గుర్తు తెలియని ఇద్దరు ఆగంతకులు మొకాలకు మాస్కులు ధరించి ఉన్నారు. కాగా ఈ చైన్ స్నాచింగ్ సంఘటన తంతు ఆ రోడ్డు పక్క ఉన్న మెడికల్ షాపు సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. సంఘటన చోటుకు వెళ్ళి పూర్వాపరాలపై విచారణ జరిపి కేసు నమోదు చేశారు. అలాగే మహిళ మెడలోంచి బంగారు గొలుసును లాక్కొని చైన్ స్నాచింగ్ కు పాల్పడిన ఆగంతకులను పట్టుకునేందుకై ఇన్స్పెక్టర్ శ్రీనాథ్ ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలను చేపట్టారు.

# విద్యార్థులకు నాణ్యమైన పోషక ఆహారాన్ని అందించండి

- గంగారం సాయిబాబా కాలనీలో పాఠశాలలు తనిఖీ చేసిన కలెక్టర్





వికారాబాద్ జిల్లా బ్యూరో నవంబర్ 17 (జనంసాక్షి): మెనూ ప్రకారం, విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు.సోమవారం వికారాబాద్ గంగారం సాయి బాబా కాలనీ నందు మండల పరిషత్ ప్రైమరీ స్కూల్ మరియు కొత్త గడి జిల్లా పరిషత్ హై స్కూల్ ను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈరోజు మెనూ ప్రకారం విద్యార్థులకి పెట్టే భోజనం వంట చేయడం జరిగిందా లేదా అని పరిశీలించారు. వంటకి ఉపయోగించే వంట సామగ్రిని కలెక్టర్ పరిశీలించారు. ప్రతి రోజు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం పెడుతున్నారా లేదా అని విద్యార్థులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఐ ఎఫ్ టి ప్యానెల్ పని విధానాన్ని పరిశీలించారు. స్టోర్ రూమ్ ని పరిశీలించి బియ్యం నాణ్యతను చెక్ చేశారు. తాజా కూరగాయలతో విద్యార్థులకు భోజనం పెట్టాలని అధికారులకు ఆదేశించారు.పాఠశాలలో మొత్తం విద్యార్థుల సంఖ్య ఎంత అని, అందులో పదవ తరగతి చదివే విద్యార్థులు ఎంత మంది ఉన్నారని స్కూల్ ప్రిన్సిపాల్ ను కలెక్టర్ వివరాలు అడిగి తెలుసు కున్నారు. ఇప్పటి వరకు పదవ తరగతి లో అన్ని సబ్జెక్ట్ లలో ఎంత మేరకు పోర్షన్ జరిగిందని వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోజు సాయంత్రం విద్యార్థులకి స్పెషల్ క్లాసులు చెప్తున్నారా, సబ్జెక్టులలో వెనకబడిన విద్యార్థుల కు స్పెషల్ క్లాసులు నిర్వహించాలన్నారు. పదవ తరగతి చదివే విద్యార్థులు అందరూ కూడా ఇప్పటి నుండే పరీక్షలకు సిద్ధం కావాలని అన్నారు.ఈ కార్యక్రమంలోజిల్లా విద్యా శాఖ అధికారి రేణుకా దేవి, ఎంఇఓబాబు సింగ్, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

# ఎన్ఎండిసి@68

ప్రముఖ ఇనుప ఖనిజ ఉత్పత్తిదారుగా
ఆరున్నర దశాబ్దాలకుపైగా విశిష్టత



హైదరాబాద్, నవంబర్ 17 (జనంసాక్షి): భారత దేశంలో అతిపెద్ద ఇనుప ఖనిజ ఉత్పత్తిదారు అయిన ఎన్ ఎండిసి, నవంబర్ 15న 68 సంవత్సరాల కార్యకలాపాలలోకి అడుగుపెట్టి, తన వ్యవస్థాపక దినోత్సవాన్ని ఎంతోగర్వంగా జరుపుకుంది. సంస్థ ప్రధాన గుర్తింపు వేదిక, సీఎండి ఎక్సలెన్స్ అవార్డులు, కంపెనీ అంతటా అత్యుత్తమ సహకారాన్ని సత్కరించారు. 1958లో స్థాపించబడిన సింగిల్-యూనిట్ ఆపరేషన్ నుండి భారతదేశంలో అతిపెద్ద ఇనుప ఖనిజం ఉత్పత్తిదారుగా, మైనింగ్‌లో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన నాయకుడిగా ఎదగడానికి ఎన్ఎండిసి సాధించిన అద్భుతమైన ప్రయాణాన్ని ఈ వేడుక గుర్తు చేసుకుంది. ఈ కార్యక్రమంలో ఎన్ఎండి అమితవ ముఖర్జీ, డైరెక్టర్ (వాణిజ్య) విశ్వనాథ్ సురేష్, డైరెక్టర్ (టెక్నికల్) వినయ్ కుమార్, డైరెక్టర్ (ప్రొడక్షన్) జోయ్‌దీప్ దాస్‌గుప్తా, డైరెక్టర్ (పర్సనల్) ప్రియ దర్శిని స్వతంత్ర డైరెక్టర్లు, గత డైరెక్టర్లుటీ సీనియర్ అధికారులుటీ ఉద్యోగులుటీ వారి కుటుంబ సభ్యులు వంటి సీనియర్ నాయకులు హాజరయ్యారు. ఇనిషియేటివ్ రత్న (వ్యక్తిగత, సమూహం), ఎన్ఎండిసి రత్న (వ్యక్తిగత, సమూహం), ఉత్తమ విభాగం-ఉత్పత్తి, ఉత్తమ విభాగం-సపోర్ట్ అమ్మకాలకు సీఎండి షీల్డ్, కోసం సీఎండి షీల్డ్, ఉత్తమ ప్రాజెక్ట్, ఉత్తమ ప్రాజెక్ట్ (రచనలు) వంటి అనేక విభాగాలలో సీఎండి ఎక్సలెన్స్ అవార్డులను ప్రదానం చేశారు. 2023 లో స్థాపించబడిన ఈ అవా ర్డులు సంస్థ అంతటా ఎన్ఎండిసి ఉద్యోగుల అసాధారణ ప్రయత్నాలు, విజయాలను గుర్తించి, జరుపుకుంటాయి. "మేము ఎన్ఎండిసి 2.0 కోసం విత్తనాలు విత్తుతున్నాము. ఎన్ఎండిసిని భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, ఆవిష్కరణ, స్థిరత్వం, కార్యాచరణ నైపుణ్యం ముందుకు తీసుకెళ్లడంలో స్థిరంగా ఉంది. గత 68 సంవత్సరాలుగా నిర్మించిన బలమైన వారసత్వంతో, ఈ సంస్థ భారతదేశం విక్షిత్ భారత్... 2047 దార్శనికతను సాధించడంలో కీలక పాత్ర పోషించడానికి సిద్ధంగా ఉంది" అని ఎన్ఎండిసి కుటుంబాన్ని అభినందిస్తూ అమితవ ముఖర్జీ పేర్కొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
18 నవంబర్ 2025


# కాలుష్య కోరల నుండి దోమడుగు రైతులను కాపాడండి

- కాలుష్యరైత కంపెనీలను తొలగించండి
- రైతులను రక్షించండి
- కలుషిత నీరుతో ప్రజలు అనారోగ్యాలకు బారిన
- అధికారులు స్పందించి న్యాయం చేయాలి
- జిల్లా కలెక్టర్ ఎదుట దోమడుగు గ్రామ రైతులు
- కలుషిత నీరుతో నిరసన
- రైతులకు ఇబ్బందులు ఎదురైనా పట్టించుకోని అధికారులు
- గ్రామ ప్రజల ఆవేదన
- జిల్లా కలెక్టర్ వినతి



**సంగారెడ్డి టౌన్, నవంబర్ 17 (జనం సాక్షి) :** సాగునీటి చెరువులనూ, భూగర్భ జలాలనూ విషపూరితం చేస్తూ ప్రజల, పశువుల ప్రాణాలు హరిస్తున్న, సాగు భూములను దెబ్బ తీస్తున్న హెటిరో డ్రగ్స్ -1 యూనిట్ నూ ఇతర రసాయన కంపనీలను మూసివేయాలనీ దోమడుగు గ్రామ రైతులు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట కలుషిత నీరుతో నిరసన వ్యక్తం చేశారు అనంతరం జిల్లా కలెక్టర్ ప్రావిణ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోమడుగు గ్రామం దగ్గర ఉన్న హెటిరో డ్రగ్స్ (ఫార్మా) యూనిట్ -1 తాజాగా ఆగస్ట్ లో భారీ వర్షాల మధ్యలో నల్లకుంట చెరువు లోకి వదిలిన విష రసాయనాలతో చెరువు పూర్తిగా గులాబీ రంగు లోకి మారిపోయింది. దాని పరిధిలో ఉన్న పంట పొలాల లోకి కూడా ఆ నీళ్ళు ప్రవహించి భూముల రంగు మారి పోయింది. అన్నారు. ఈ కంపనీ చాలా కాలంగానే ఈ విధంగా ఈ ప్రాంతంలో కాలుష్యాన్ని సృష్టిస్తున్నది. 2012 లో గత 12 ఏళ్ల క్రితమే ఈ కంపనీ మా గ్రామ నల్లకుంట చెరువును విషపూరితం చేసింది. ప్రజలు ఆ కాలంలో ఐక్యంగా పోరాడారు. గ్రీన్ ట్రిబ్యునల్ లో కూడా కేసులు వేశారు. కోర్టు తీర్పు, ఇతర ప్రజా పోరాటాల వలన అప్పుడు కొంత మార్పు వచ్చింది.కానీ, ఈ కంపనీ యాజమాన్యం ఇటీవలి కాలంలో మళ్ళీ మరో సారి చెరువులు, కుంటలలోకి రసాయన విషాలను వదులు తున్నది. చుట్టూ ప్రాంతాల భూ గర్భ జలాలు కూడా విష పూరితమై పోయాయి. ఈ ఒక్క కంపనీ మాత్రమే కాకుండా, మరిన్ని రసాయన పరిశ్రమలు ఈ ప్రాంతానికి వచ్చి, మా గ్రామాల చుట్టూ మరింత విష కాలుష్యాన్ని పెంచుతున్నాయి. గత ప్రభుత్వం కానీ, ఇప్పుడు, ఉన్న ప్రభుత్వం కానీ, జిల్లా అధికార యంత్రాంగం కానీ, ముఖ్యంగా కాలుష్య నియంత్రణ మండలి కానీ హెటిరో డ్రగ్స్ కంపనీ ఈ గ్రామం చుట్టూ చేస్తున్న విధ్వంసాన్ని అసలు పట్టించుకోవడం లేదు. ప్రజలు ఫిర్యాదులు చేసినా పక్కన పెడుతున్నారు. ఆవేదన వ్యక్తం చేశారు అధికారులు ఇప్పటికైనా పట్టించుకోని రైతుల సమస్యలను పట్టించుకోవాలని అన్నారు కాలుష్య రహిత రసాయన నీటిని తాగి అనేక పశువులు మృత్యువాత పడుతున్నాయని అన్నారు ఈ మధ్యకాలంలోనే త్రాగునీటి పూర్తిగా రసాయనాలతో కలుషితమై ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు మా బాధలను దృష్టిలో పెట్టుకొని తగు చర్యలు తీసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో దొమడు గు రైతులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సంక్షేమమే టియుడబ్ల్యూజే లక్ష్యం



**తూప్రాన్, నవంబర్ 17 (జనం సాక్షి) :** జర్నలిస్టుల సంక్షేమమే టియూడబ్ల్యూజె యూనియన్ (ఐజెయూ) లక్ష్యం అని యూనియన్ జిల్లా అధ్యక్షులు శంకర్ దయాల్ చారి అన్నారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ల సంఘం యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం లో భాగంగా సోమవారం తూప్రాన్, మనోహరాబాద్ మండలాల జర్నలిస్టులకు యూనియన్ సభ్యత్వం ను అందచేశారు. స్థానిక టోల్ ప్లాజా వద్ద గల ఐబీ గెస్ట్ హౌస్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో అయన జర్నలిస్టులను ఉద్దేశించి మాట్లాడుతూ ఎల్లపుడు జర్నలిస్టుల సమస్యలపై నిరంతర పోరాటం చేస్తూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం యూనియన్ పనిచేస్తుందని అన్నారు. అదేవిదంగా చిన్న శంకరం పేట్, చేగుంట, వెల్దుర్తి మండలాలలో జర్నలిస్టులకు యూనియన్ సభ్యత్వ నమోదును నిర్వహించారు. ఈ కార్యక్రమం లో యూనియన్ నాయకులు డిజె శ్రీనివాస్ శర్మ, శ్రీధర్, అశోక్, రామాచారి, పూర్ణ రాజు, మండలాల జర్నలిస్ట్ లు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అశోక్ యాదవ్



**మొయినాబాద్, నవంబర్ 17 (జనం సాక్షి) :** వచ్చే స్థానిక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని మొయినాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పల్లగోల్ల అశోక్ యాదవ్ పేర్కొ న్నారు. సోమవారం జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ జన్మదినం సందర్భంగా మొయినాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పల్లగోల్ల అశోక్ యాదవ్ ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలతో కలిసి ఆయన నివాసంలో ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లగోల్ల అశోక్ యాదవ్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపే లక్ష్యంగా పనిచేయాలని పల్లగోల్ల అశోక్ యాదవ్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ చేసిందన్నారు. గత ప్రభుత్వం హయాంలో డబుల్ బెడ్ రూమ్, రేషన్ కార్డులు ఏ ఒక్క పేదలకు పంచలేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టే సంక్షేమ పథకాలను ఇతర పార్టీలు ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని అన్నారు. వచ్చే స్థానిక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధిక స్థానాలు గెలుస్తుదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫిషర్మెన్ చైర్మన్ మహేందర్ ముదిరాజ్, పట్నం రామ్ రెడ్డి, కుమ్మరి శంకర్, హనుమంత్ యాదవ్, నేరేట్ల రాజు గౌడ్, దేవులపల్లి రాజు గౌడ్, మాల రాజు, పిరంగీ భాస్కర్, ఆపోజిగూడ రాజు, కంజర్ల శేఖర్, పూడూరు టిల్లు, కుశంగల నవీన్, షాబాద్ సునీల్, కంజర్ల రోహిత్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## భవిష్యత్తు వామపక్షాలదే..

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ



**సదాశివపేట, నవంబర్ 17 (జనం సాక్షి) :** దేశంలో పెట్టుబడిదారీ, మతతత్వవాద శక్తులు ఎన్ని కుట్రలు చేసిన భవిష్యత్తు మాత్రం వామపక్షాలదేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ స్పష్టం చేశారు. సోమవారం సదాశివపేటకు చేరుకున్న సీపీఐ శతాబ్ది రాష్ట్రజాత లో ఆమె పాల్గొని నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన పశ్య పద్మ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ ఏర్పడి వందేళ్లు పూర్తి చేసుకుంటున్న ఈ చారిత్రక సందర్భంలో పార్టీ పోరాటగాధను రాష్ట్రంలోని ప్రతి ఇంటికి చేర్చాల్సిన సమయం వచ్చింది అని పేర్కొన్నారు. భూమి కోసం,భుక్తికోసం,పెట్టి చాకిరి,విముక్తి కోసం, ప్రజల హక్కుల కోసం సీపీఐ అనేక ఉద్యమాలు నడిపి, లక్షలాది పేదలకు సాగుభూములు, ఇళ్ల స్థలాలు అందించిన ఘనచరిత్ర తమదేనని ఆమె గుర్తుచేశారు. పేదల సమస్యలతో, వారి న్యాయపోరాటాలతో పుట్టి పెరిగిన పార్టీ ఈ దేశంలో 100 ఏళ్లు పూర్తి చేసుకోవడం పేదల విజయం, కార్మిక కూలీల గర్వకారణం అని అన్నారు. రాబోయే రోజులలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా భారీ స్థాయిలో పోరాటాలకు సిద్ధం కావాలని పశ్య పద్మ పిలుపునిచ్చారు. డిసెంబర్ 26న ఖమ్మంలో జరగనున్న భారీ బహిరంగ సభకు ఈ ప్రాంతం నుంచి వేలాదిగా హాజరుకావాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాల్, మా. రహ్మాన్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. తాజుద్దీన్, ఎం.డి. షఫీ, పాండు, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎం. గంగమ్మ, ముస్తఫా, శంకరప్పా, సాదిక్ అలీ, వెంకట్ గౌడ్, పులమ్మా, చంద్రయ్య, యశ్వంత్, అన్నుజ, బుజ్జమ్మ, లక్ష్మి, బిపాషా, దేవి పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి

- ఫిర్యాదులను స్వీకరించిన జిల్లా ఎస్పీ



**సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 17 (జనం సాక్షి) :** ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుదారుల సమస్యలను ఓపికగా విని, సమస్యలు తలెత్తడానికి గల కారణాలపై సంబంధిత ఎస్‌హెచ్ఓ లతో ప్రత్యక్షంగా ఫోన్ ద్వారా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. చట్టాన్ని అమలు చేయడంలో ఎటువంటి అలసత్వం ప్రదర్శించకూడదని, ప్రతి కేసును పారదర్శకంగా దర్యాప్తు చేయాలని సూచించారు. సివిల్ తగాదాల్లో పోలీసు అధికారులు జోక్యం చేసుకోకూడదని స్పష్టం చేశారు.జిల్లా ప్రజలు తమ సమస్యలకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో పరిష్కారం దొరకనప్పుడు, మూడవ వ్యక్తి ప్రమేయం లేకుండా నేరుగా జిల్లా పోలీసు కార్యాలయ సేవలను వినియోగించుకోవాలని ఎస్పీ సూచించారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా వచ్చిన ప్రతి ఫిర్యాదు పురోగతిని నిరంతరం సమీక్షిస్తూ, ప్రజల సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని జిల్లా ఎస్పీ గారు తెలిపారు.

## వినతి ఇచ్చి వెళ్లిన తర్వాత వెంటనే పరిష్కారం చూపాలి

- జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య
- ప్రజావాణికి 25 దరఖాస్తులు



**సంగారెడ్డి టౌన్, నవంబర్ 17 (జనం సాక్షి) :** ప్రజావాణి కార్యక్రమము కేవలం సమస్యలు వినే కార్యక్రమంగా కాకుండా, పరిష్కారాల వేదికగా నిలపాలని, వినతి ఇచ్చి వెళ్లిన తర్వాత, వెంటనే పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 25 దరఖాస్తుల అందాయని తెలిపారు. ప్రజల నుండి వివిధ అంశాలకు సంబంధించిన ఫిర్యాదుల వినతిపత్రాలు అధికారులతో కలిసి స్వీకరించారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, సంక్షేమ పథకాల అర్హత, మున్సిపల్ సమస్యలు వంటి అనేక అంశాలపై వచ్చిన దరఖాస్తులను స్వీకరించి, సంబంధిత శాఖల అధికారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ పి. ప్రావిణ్య మాట్లాడారు ప్రజలు నేరుగా అధికారులను కలుసుకొని తమ సమస్యలు చెప్పుకునే అవకాశం కల్పించడం వల్ల పారదర్శక పరిపాలనకు తోడ్పడుతోందని అధికారులు తెలిపారు. ప్రజావాణి కార్యక్రమాన్ని సమస్యలు పరిష్కరించే వేదికగా మార్చాలని, పేర్కొన్నారు. కార్యక్రమానికి వచ్చిన ప్రజలకు అవసరమైన సూచనలు, సహాయం అందించడంలో అధికారులు, సిబ్బంది చురుకుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో అదనపుకలెక్టర్లు చంద్రశేఖర్ ,మాధురి, డిఆర్ఓ పద్మజారాణి, జడ్పీ సీఈఓ జానకిరెడ్డి, వివిధశాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు

- టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి



**కొండాపూర్, నవంబర్ 17 (జనం సాక్షి) :** మండల పరిధిలోని తేర్పోల్ గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని తెలంగాణ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇండస్ట్రియల్ కార్పొరేషన్ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, పిఎసిఎస్ ల ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. కాంగ్రెస్ ప్రభుత్వం ఆయంలో అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కృషి చేస్తుందని. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని రైతులు పండించిన పంట చివరి గింజ వరకు రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ వై.ప్రభు, కొండాపూర్ మాజీ ఎంపిటిసి నరసింహారెడ్డి, మండల జనరల్ సెక్రెటరీ జి.నర్సింలు, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభుదాస్, పిఎసియస్ చైర్మన్ మానిక్ రెడ్డి, మాజీ యూత్ కాంగ్రెస్ మండల ప్రెసిడెంట్ సునీల్, తేర్పోల్ పిఎసిఎస్ చైర్మన్ రామ్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజు, యూత్ కాంగ్రెస్ మండల ప్రెసిడెంట్ అశోక్, వినయ్, నగేష్, మహేందర్, ప్రమోద్, తదితరులు పాల్గొన్నారు.


# గంజాయి లేని సమాజం నిర్మించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి



**నిజాంపేట్, నవంబర్ 17 (జనం సాక్షి) :** కుతుబుల్లాపూర్ నియోజకవర్గ బాచుపల్లి మండల పరిధిలో ఇటీవల రోజురోజుకు విచ్చలవిడిగా గంజాయి సేవిస్తూ అనేక దాడులతోపాటు, కత్తులతో దాడులు జరుగుతున్నాయని. ఆ దాడులను అరికట్టాలని,సీపీఐ ఆధ్వర్యంలో బాచుపల్లో సీఐ సి. సతీష్‌కి సోమవారం పిర్యాదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ బాచుపల్లి మండల పరిధిలోని ఇందిరమ్మ గృహాలలో, రాజీవ్ గృహ కల్ప, డబుల్ బెదురూమ్ అనేక ప్రాంతాలలో గంజాయి సేవించే వారి సంఖ్య రోజు పెరుగుతుందని గుర్తు చేశారు. గంజాయి సేవించడం వల్ల మతిస్థిమితం లేక నేటి యువత అనేక దారుణలకు పాల్పడుతున్నారని అన్నారు. ఇందుకు సాక్షంగా గత కొద్దీ రోజుల క్రితం జగద్గిరిగుట్ట లో పట్టపగలే నడిరోడ్డు పై కత్తులతో దాడిచేసుకున్నారని, అలాగే నిజాంపేట్ రాజీవ్ గృహకల్ప లో దాడులు జరిగాయని అన్నారు. నేటి యువతను తల్లి,తండ్రులు ప్రతిరోజు గమనిస్తూ ఉండాలి. ఒకవేళ పిల్లలు గంజాయికి బానిస అయ్యారని తెలిస్తే వెంటనే వారు అదుపులో పెట్టి గంజాయి సేవించ కుండా తల్లి తండ్రులు చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే పోలీస్ అధికారులు ఇక్కడ గంజాయి బ్యాచులు వున్నారో అక్కడ గస్తీలను పెంచాలి. తనిఖీ ప్రతి రోజు జరగాలి. తామందరం సీపీఐ పార్టీగా స్థానిక అన్ని పార్టీ నాయకులను కలిసి అఖిలపక్షంగా ఏర్పాటయి అన్ని పార్టీలను కలుపుకొని గంజాయి లేని సమాజ%శీ% నిర్మించే విదంగా ప్రతి కుటుంబీకులు భాగస్వామ్యం తెలుపుతూ ప్రతిజ్ఞ చేశారు తెలిపారు.ఈ కార్యక్రమం సీపీఐ నాయకులు ఆశి. యాదయ్య , పొన్నికంటి దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

## ముగ్గురు లబ్ధిదారులకు ఉపకరణాల అందజేత

- జిల్లా కలెక్టర్ పి. ప్రవీణ్య



**సంగారెడ్డి, నవంబర్ 17 (జనం సాక్షి) :** ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను సమీక్షించిన జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశాల మేరకు, జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారిణి లలిత కుమారి వెంటనే చర్యలు చేపట్టి సోమవారం ముగ్గురు లబ్ధిదారులకు అవసరమైన ఉపకరణాలను అందజేశారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతి అభ్యర్థనను కేసు వారీగా పరిశీలించి, సంబంధిత శాఖలతో సమన్వయం చేసి, అవసరానికి అనుగుణంగా చర్యలు తీసుకోవడం, అత్యంత ప్రాధాన్యతగా ఉన్నదని జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి తెలిపారు.తక్షణ స్పందన పై లబ్ధిదారులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా, నశాముక్త భారత్ అభియాన్ జిల్లా స్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతోంది. 18 న సంగారెడ్డి జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలల్లో లిసే నో టూ డ్రగ్స్ ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి తెలిపారు. యువతలో మత్తు పదార్థాల మానసిక, శారీరక హానికారక ప్రభావాలపై అవగాహన పెంపొందించడం ప్రధాన లక్ష్యంగా ఈ ప్రతిజ్ఞను చేపట్టినట్లు పేర్కొన్నారు.విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులను మత్తు పదార్థాల నుండి దూరంగా ఉంచేలా మార్గనిర్దేశం చేయాలని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేయాలని సూచించారు.ప్రజా సమస్యల పరిష్కారం, మత్తు రహిత సమాజ నిర్మాణం కోసం జిల్లా పరిపాలన తీసుకుంటున్న చర్యలను ప్రజలు అభినందిస్తున్నారు.

# ప్రజల సౌకర్యార్థం జాతీయ రహదారి విస్తరణ

- బిహెచ్ఇఎల్ నుంచి పటాన్చెరువు వరకు పనులు
- పరిశీలన చేసిన ఎమ్మెల్యే

**అమీన్పూర్, నవంబర్ 17 (జనం సాక్షి) :** మదినగూడ నుండి సంగారెడ్డి వరకు చేపడుతున్న జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ప్రజల సౌకర్యార్థం పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని రామచంద్రపురం డివిజన్, పటాన్చెరు డివిజన్లో పరిధిలో ఐదు ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం చేపట్టబోతున్నట్లు పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం జాతీయ రహదారణ సంస్థ, పోలీసు, ట్రాఫిక్ శాఖల అధికారులు, కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులతో కలిసి ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించబోయే స్థలాలలో ఎమ్మెల్యే క్షేత్రస్థాయి పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిహెచ్ఎల్ చౌరస్తా నుండి పటాన్చెరు పట్టణంలోని సాకి చెరువు వరకు ప్రతిరోజు నిత్యం వేలాది మంది ప్రజలు వివిధ అవసరాల నిమిత్తం రహదారిని దాటుతూ ఉంటారని తెలిపారు. ఈ నేపథ్యంలో వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకుగాను ఐదు ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించబోతున్నట్లు తెలిపారు. రామచంద్రపురం డివిజన్ పరిధిలోని అశోక్ నగర్,. బీరంగూడ ఐటిఐ,. రామచంద్రపురం రైల్వే లైను, పటాన్చెరు బస్టాండ్, పటాన్చెరు సాకి చెరువు సమీపంలో వీటిని నిర్మించబోతున్నట్లు తెలిపారు. విశాలమైన విస్తీర్ణంతో, లిఫ్ట్ సౌకర్యంతో వీటిని నిర్మించబోతున్నట్లు తెలిపారు. నిర్దేశించిన గడువులోగా రహదారి విస్తరణ పనులు పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. నిర్మాణాల నాణ్యత విషయంలో



రాజీ పడవద్దని.. ప్రమాణాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జాతీయ రహదారుల సంస్థ డి ఈ రామకృష్ణ, డిఎస్పి ప్రభాకర్, సిఐలు వినాయక్ రెడ్డి, లాలు నాయక్, ఎక్సైసీఐ పరమేశ్వర్, నిర్మాణ సంస్థ ప్రతినిధులు శాస్త్రి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీ పేలుడు నేపథ్యంలో హై అలర్ట్

- ఓరుగల్లు కోటలో పోలీసుల రెక్కీ.
- పోలీసులకు వివరించిన గైడ్ రవి యాదవ్



**వరంగల్ ఈస్ట్, నవంబర్ 17 (జనం సాక్షి) :** దేశ రాజధాని ఢిల్లీలో ఇటీవల జరిగిన భారీ పేలుడు ఘటన నేపథ్యంలో అప్రమత్తమైన భద్రతా సంస్థలు, ముఖ్యంగా హైదరాబాద్ నుండి వచ్చిన పోలీసులు (ఆక్టోపస్) చారిత్రక నగరమైన ఓరుగల్లు కోటలోని ప్రధాన పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రాలపై 'రెక్కీ' (ముందస్తు నిఘా) నిర్వహించారు. ఈ ఘటనల పర్యవసానంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టేందుకు హైదరాబాద్ నుండి 25 మంది ప్రత్యేక పోలీసు బృందం ఓరుగల్లుకు చేరుకున్నారు. వీరు ముఖ్యంగా వరంగల్ కోట, వేయి స్తంభాల ఆలయం సహా అనేక దేవాలయాల వద్ద భద్రతా ఏర్పాట్లు, ప్రవేశ-నిష్క్రమణ మార్గాలు, భౌగోళిక పరిస్థితులను పసిగట్టే పనిలో నిమగ్నమయ్యారు.

### పురావస్తు శాఖ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

కేంద్ర పురావస్తు పర్యవేక్షణలో ఉన్న చారిత్రక స్థలాలు, నిర్మాణాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా, ఏకశిలగుట్ట, ఖుష్ మహల్, స్వయంభు దేవాలయాల మధ్య ఉన్న పురాతన కళాఖండాలు, కళాతోరణాలను క్షుణ్ణంగా పర్యవేక్షించి, వాటి రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసుకున్నారు. ఈ రెక్కీ బృందానికి కేంద్ర పురావస్తు శాఖ ఖిలావరంగల్ కోఆర్డినేటర్ శ్రీకాంత్, సిబ్బంది సహకారం అందించారు.

### కాకతీయుల వైభవాన్ని వివరించిన గైడ్

పోలీస్ బృందానికి పర్యాటక శాఖ నియమించిన గైడ్ రవియాదవ్ తోడుగా ఉండి కాకతీయుల ఘనమైన చరిత్రను, పాలనా వైభవాన్ని వివరంగా తెలియజేశారు. కోటలు, ఆలయాల నిర్మాణంలో కాకతీయుల శిల్పకళా నైపుణ్యాన్ని, ఆనాటి వైభవాన్ని ప్రతిబింబించే శిల్పాలను చూపిస్తూ గైడ్ వారికి పూర్తి సమాచారం అందించారు. దేశవ్యాప్తంగా సున్నితమైన ప్రాంతాలు, పర్యాటక కేంద్రాలపై భద్రతను పటిష్టం చేయడంలో భాగంగా ఈ ముందస్తు తనిఖీలు, రెక్కీ నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. హైదరాబాద్ పోలీస్ బృందం ఈ ప్రాంతంలోని భద్రతా లోపాలను, ముప్పు కలిగే అవకాశాలు ఉన్న ప్రాంతాలను గుర్తించి, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై తమ నివేదికను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిసింది.

# సైబర్ నేరగాళ్లపై అప్రమత్తంగా ఉండాలి

- జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఆకర్షణీయమైన ప్రకటనలకు మోసపోకుండా, సైబర్ నేరగాళ్లపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల నకిలీ ఆన్లైన్ ట్రేడింగ్ యాప్‌లు, వెబ్‌సైట్లు, అలాగే ఐపిఓ ఆఫర్ పేరుతో జరుగుతున్న సైబర్ మోసాలు అధికంగా నమోదవుతున్నాయని తెలిపారు. ప్రముఖ కంపెనీల పేరుతో నమ్మదగినట్లుగా కనిపించే నకిలీ వెబ్‌సైట్లు, మొబైల్ యాప్‌లను మోసగాళ్లు రూపొందిస్తున్నారని, వాట్సాప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్, ఇమెయిల్ వంటి వేదికల ద్వారా ఆకర్షణీయమైన లింకులు పంపిస్తున్నారని, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు, త్వరిత రిటర్న్ వంటి వాగ్దానాలతో పెట్టుబడి దారులను నమ్మిస్తూ మోసగిస్తున్నారని తెలిపారు. బ్యాంక్ వివరాలు, ఆధార్, పాన్ వివరాలు లేదా యుపిఐ చెల్లింపులు కోరుతున్నారని, కొన్నిసార్లు నకిలీ షేర్ సర్టిఫికేట్‌లు పంపి ప్రజలను నమ్మించడం, ప్రజలు డబ్బు బదిలీ చేసిన తరువాత వెబ్‌సైట్ లేదా యాప్‌ను మూసివేసి పరారవడం జరుగుతుందన్నారు. సోషల్ మీడియా, యూట్యూబ్ వీడియోలు, వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూపుల ద్వారా రోజుకు భారీ లాభాలు వంద శాతం రిటర్న్ వంటి తప్పుడు ప్రచారాలతో ప్రజలను వలలో వేస్తున్నారని, చిన్న మొత్తంలో కొంత లాభం చూపి నమ్మబలికి, తరువాత పెద్ద మొత్తాలు పెట్టాలని ఒత్తిడి చేస్తారని, విత్‌డ్రా చేయాలనుకున్నప్పుడు ట్యాక్స్, సర్వీస్ చార్జీల పేరుతో మరిన్ని మొత్తాలు అడుగుతారని, చివరికి యాప్ యాక్సెస్‌ను బ్లాక్ చేసి మాయం అవుతారని వివరించారు. ఐపిఓలో పెట్టుబడి చేసేముందు ఎస్ఈబిఐ, ఎన్ఎస్ఈ, బిఎస్ఈ అధికారిక వెబ్‌సైట్లు తప్పనిసరిగా తనిఖీ చేయాలని, సోషల్ మీడియాలో వచ్చే ఐపిఓ ఆఫర్లను నమ్మవద్దని, ఎవరైనా అడ్వాన్స్ పేమెంట్ లేదా రిజిస్ట్రేషన్ ఫీజు అడిగితే వెంటనే అప్రమత్తం కావాలని తెలిపారు. గ్యారంటీ రిటర్న్ పేరుతో వచ్చే ఆఫర్లను తిరస్కరించాలని, తెలియని యాప్ లింకులు, వెబ్‌సైట్లు వాడకూడదని, పెట్టుబడి పెట్టమని ఒత్తిడి చేసే వ్యక్తులను వెంటనే బ్లాక్ చేయాలని కోరారు. వినియోగించే ట్రేడింగ్ యాప్ లేదా వెబ్‌సైట్ ఎస్ఈబిఐ/ఆర్బిఐ వద్ద రిజిస్టర్డ్ అయ్యిందా అని తప్పనిసరిగా చెక్ చేయాలని, ఏవైనా అనుమానాస్పద లావాదేవీలు గమనించిన వెంటనే పోలీసులకు లేదా 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని ఎస్పీ తెలియజేశారు.

# ప్రజావాణి అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్



**నిర్మల్ బ్యూరో, నవంబర్17 (జనంసాక్షి) :** ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాల్గొని, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి దరఖాస్తును పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను అదనపు కలెక్టర్‌కు సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం, అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా అదనపు కలెక్టర్, అధికారులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రత్నకల్యాణి, జెడ్పీ సీఈవో గోవింద్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రైల్ కోచ్ రెస్టారెంట్






- 24 గంటలు ప్రయాణికులకు సేవలు
- బయటికంటే తక్కువ ధరలకే ఆహార పదార్థాలు
- ఐఆర్‌సిటిసి ఆధ్వర్యంలో నిర్వహణ
- తెలంగాణలో మొదటిసారి వరంగల్ రైల్వేస్టేషన్లో ఏర్పాటు

**వరంగల్ ఈస్ట్, నవంబర్ 17 (జనం సాక్షి) :** రైలులో ప్రయాణిస్తూ.. రైలు భోగీలో ఆహార పదార్థాలను తింటూ సరదాగా గడిపినట్టుగానే ఉంటుంది.. అచ్చం రైల్ భోగి లాంటి రెస్టారెంట్ వరంగల్ నగరంలోని వరంగల్ రైల్వే స్టేషన్ లో ఏర్పాటు చేశారు. ఇది ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐ ఆర్ సి టిసీ) ఆధ్వర్యంలో నిర్వహింపబడుతుంది. ఇది తెలంగాణలోనే మొదటి ప్రయత్నం. ప్రస్తుతం వరంగల్ రైల్వే స్టేషన్ వద్ద గల ఈ రైల్వే కోచ్ రెస్టారెంట్ ను రామకృష్ణ అనే యజమాని నిర్వహిస్తున్నాడు. రైలు ప్రయాణికులు ఏ రాత్రి రైలు దిగివచ్చిన వారికి కావలసిన ఆహార ఆహార పదార్థాలను అందించడానికి ప్రతి రోజు 24 గంటలు ప్రయాణికుల కోసం నాణ్యమైన ఆహార పదార్థాలను ఇక్కడ అందించడం జరుగుతుంది. ఒకేసారి 64 మంది కూర్చొని తినే విధంగా కోచ్ లో సోఫా తో కూడినటువంటి టేబుల్స్ ఏర్పాటు చేశారు. సుమారు 60 లక్షల రూపాయలతో ఈ రైల్వే కోచ్ రెస్టారెంట్ ను తయారు చేసినట్లు నిర్వాహకుడు రామకృష్ణ తెలిపారు. నాణ్యమైన ఇడ్లీ, వడ, దోశ, చపాతి, సాదా రైస్, బిర్యాని, పూరి, మొదలైన తాజా ఆహార పదార్థాలను ప్రయాణికులకు అందిస్తున్నట్లు చెప్పారు. రైలు ప్రయాణికులే కాకుండా ఇతర సాధారణ జనాలు కూడా రైల్ కోచ్ లో కూర్చొని ఆహార పదార్థాలు తింటున్నట్లు చెప్పారు. రైలు కోచ్ లో ఏసీ కూడా ఉన్నట్లు తెలిపారు. ఏది ఏమైనా ప్రయాణికుల సౌకర్యార్థం కావలసిన సేవలు అందిస్తున్నట్లు రామకృష్ణ తెలిపాడు. అదేవిధంగా రైల్వే వాళ్లు కూడా మరింత సహకారం అందించాలని ఈ సందర్భంగా కోరుతున్నాడు.

# ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్‌లో పెట్టొద్దు

- సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి
- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ప్రజలు దూర ప్రాంతాల నుండి ప్రజావాణి కార్యక్రమానికి వచ్చి తమ సమస్యల పరిష్కారానికై దరఖాస్తులు సమర్పిస్తున్నారని, ఆ దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా సత్వర పరిష్కారం కల్పించేందుకు సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్రంలోని ఐడిఓసి కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ రాహుల్ శర్మ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని మొత్తం 37 దరఖాస్తులు స్వీకరించారు. ప్రతి సోమవారం జరిగే ప్రజావాణిలో ప్రజలు అనేక రకాల సమస్యలను తెలియజేస్తున్న నేపథ్యంలో, స్వీకరించిన దరఖాస్తులు ఆయా శాఖల అధికారులకు ఎండార్స్ చేస్తున్నామని తెలిపారు. తదుపరి ప్రజావాణి వరకు జీరో పెండింగ్ ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి సోమవారం ప్రజావాణి అనంతరం సమీక్ష సమావేశం నిర్వహించి, దరఖాస్తుల పరిష్కార స్థితిపై సమీక్షిస్తానని తెలిపారు. అధికారులు ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకుగా, బాధ్యతగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డీఓ రవి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# రాత్రి, తెల్లవారుజామున ప్రయాణాలు చేయకండి

- పొగమంచుతో జాగ్రత్త
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



**వరంగల్ బ్యూరో, నవంబర్ 17 (జనం సాక్షి) :** వాతావరణంలో పొగమంచు తీవ్రత పెరగటంతో వీలైనంత వాహనదారులు రాత్రి, తెల్లవారుజామున ప్రయాణాలు చేయద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రజలకు సూచించారు. వాతావరణంలో పొగమంచు తీవ్రత పెరగడం కారణంగా జరిగిన రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో ప్రజలను వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రకటన చేస్తూ. రాత్రి, తెల్లవారుజామున దట్టమైన పొగమంచు కారణంగా రహదారులపై ఎదురుగా వచ్చే వాహనాలు, పాదాచారులను గుర్తించడం, వీక్షించే సామర్థ్యం తక్కువుగా వుంటుంది. ఈ సమయంలో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు దారితీసే అవకాశాలు ఉన్నందున, ప్రజలు అత్యవసరమైతే తప్ప ఈ సమయాల్లో ప్రయాణాలను మానుకోగలరని వరంగల్ సీపీ ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే పొగమంచు ఎక్కువగా ఉండే సమయంలో వాహనాలు నడుపుతున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సీపీ సూచింస్తూ. వాహనాలను వేగంగా నడపొద్దని, వాహనదారులు శ్రద్ధతో, నిదానంగా ప్రయాణించాలి. తక్కువ వీక్షించే సామర్థ్యం కారణంగా ఇతర వాహనాలు, పాదచారులు, మలుపులు, రోడ్డు విభాగాలు సరిగా కనిపించక ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నందున, హెడ్‌లైట్లను లో బీమ్‌లో ఉంచి, ఫాగ్ లైట్లను వాడాలని సూచించారు. అత్యవసర సమయాల్లో ప్రయాణం తప్పనిసరి అయితే వాహనాల స్థితిని ముందుగానే తనిఖీ చేసుకోవంతో పాటు ముఖ్యంగా బ్రేకులు, లైట్లు, టైర్లు సరిగా ఉన్నాయో లేదో సరి చూసుకోవాలని. డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం, ఆకస్మికంగా ఓవర్‌టేక్ చేయడం, ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించడం వంటి ప్రమాదకరమైన చర్యలకు పాల్పడవద్దని. పోలీసుల సూచనలతో పాటు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ వాహనదారులు వారి గమ్యస్థానాలకు క్షేమంగా చేరుకోవడమే వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రధాన లక్ష్యమని సీపీ వెల్లడించారు.

# ప్రజావాణి వినతులను వెంటనే పరిష్కరించాలి

- అధికారులకు ఆదేశాలు జారీ చేసిన కలెక్టర్ స్నేహ శబరిష్

**హనుమకొండ ప్రతినిధి నవంబర్ 17 (జనం సాక్షి) :** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి స్వీకరించిన వినతుల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశపు హాలులో ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డిలకు వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు వినతులను అందజేశారు. ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ, గృహ నిర్మాణ, మున్సిపల్, తదితర సమస్యలపై ప్రజలు 139 వినతులను కలెక్టర్, అదనపు కలెక్టర్లకు అందజేశారు. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు వినతి పత్రాలను అందజేస్తూ తమ సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ను కోరగా అక్కడే ఉన్న సంబంధిత శాఖల అధికారులను వినతుల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా పలు మండలాలకు సంబంధించిన వినతులపై పరిష్కార చర్యల నిమిత్తం తహసిల్దార్లను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, పలువురు తహసీల్దార్లు పాల్గొన్నారు.



# కత్తితో పొడిచిన ఆటో డ్రైవర్ అరెస్టు



**బెల్లంపల్లి, నవంబర్ 17 (జనంసాక్షి) :** కత్తితో పొడిచి పరారైనా ఆటో డ్రైవర్ ను అరెస్టు చేసినట్లు బెల్లంపల్లి రూరల్ సీఐ హనోక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం చీర్ల హరీష్, చీర్ల సురేష్, పత్తిరెడ్డి అఖిల్ అనే ముగ్గురు ఆదివారం సాయంత్రం కారులో నెన్నెల మండలం కోణంపేట గ్రామంలో వివాహ రిసెప్షన్ కు వెళ్లే క్రమంలో నెన్నెల మండలం ఘనపూర్ గ్రామంలోని పంజాల విద్యాసాగర్ గౌడ్ ఇంటి సమీపంలోని స్పీడ్ బ్రేకర్ వద్ద నెన్నెల నుంచి జోగాపూర్ గ్రామానికి వెళుతున్న ఆటోకు తగిలి కుడిపక్క కొంచం బంపర్ డామేజ్ అయింది. ఈక్రమంలో గొడవ జరుగగా ఆటో డ్రైవర్ కొడిపె అశోక్ వాళ్ళను బెదిరించి, అతని ఆటో డ్రైవింగ్ సీట్ కింద ఉన్న కత్తిని బయటకి తీసి దానితో కార్ ను నడుపుతున్న చీర్ల హరీష్ ను కత్తితో అతని ఎడమ పక్క ఛాతీ, పొట్ట బాగంలో పొడిచాడు. హరీష్ అక్కడే కింద పడిపోయాడు. ఆ కారులో వచ్చిన చీర్ల సురేష్ ను కూడా పొడవడానికి సురేష్ వెనుక పరిగెత్తుతుండగా అక్కడకి ఘనపూర్ గ్రామస్తులు అశోక్ ను అడ్డుకున్నారు. పరిస్థితి గమనించి అశోక్ అక్కడి నుంచి పారిపోయాడు. వెంటనే గాయపడిన హరీష్ ను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. ఆదివారం రాత్రి పిర్యాదు రాగా కొడిపె అశోక్ మీద అటెంప్ట్ మర్డర్ కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు. కేసు నమోదు అనంతరం కేసు విచారణలో బాగంగా కొడిపె అశోక్ గురించి వెతకగా సోమవారం మధ్యాహ్నం చిత్తాపూర్ గ్రామం దగ్గర ఉన్న ప్రభుత్వ స్కూల్ దగ్గరలో ఉన్న మామిడి తోటలో దాక్కొని ఉన్నాడు. పక్కా సమాచారం మేరకు నెన్నెల ఎస్సై కే ప్రసాద్, పోలీస్ సిబ్బంది అతన్ని పట్టుకొని, పక్కనే రైస్ మిల్ దగ్గరలో మామిడిచెట్లలో ఉన్న అతని ఆటోను బజాజ్ కంపెనీ ఆటో, ఆటో డ్రైవరు సీట్ కింద చంపడానికి ఉపయోగించిన కత్తిని స్వాదినం చేసుకొని అశోక్ ను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు వివరించారు. ఈ కేసులో నేరస్థుడికి సహాయం చేసిన అతని స్నేహితుడు చిందం అంజి, నేరస్తుని సోదరుడు అయిన కోడిపే రాజు మీద కూడా అభియోగం మోపినట్లు సీఐ హనోక్ తెలిపారు. ఈసమావేశంలో నెన్నెల ఎస్సై కే ప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ విజయ్ కుమార్, కానిస్టేబుల్ ప్రసాద్, సంతోష్ పాల్గొన్నారు.

# ప్రజావాణికి 62 దరఖాస్తులు

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



ములుగు ప్రతినిధి, నవంబర్ 17(జనంసాక్షి) : సమస్యలు పరిష్కరించాలని, ప్రజావాణిలో ప్రజలు ఇచ్చిన దరఖాస్తులు పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పాల్గొని జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు పరిష్కార నిమిత్తం ఎండార్స్మెంట్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో 62 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. భూ సమస్యలు 17, గృహ నిర్మాణ శాఖకు 12, పెన్షన్ 05, ఉపాధి కల్పనకు 01, ఇతర ఇతర శాఖలకు సంబంధించినవి 27 దరఖాస్తుల వచ్చాయి. సమస్యలను విని వెంటనే పరిష్కారం చూపించడం లక్ష్యంగా ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణికి వచ్చిన 62 మంది దరఖాస్తుదారులతో కలెక్టర్ మీ సమస్య చెప్పండని అడిగి తెలుసుకుని దరఖాస్తు పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులకు ఎండార్స్మెంట్ చేస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తులను సమయానికి పరిష్కరించడం అన్ని శాఖల బాధ్యత అని ఆయన తెలిపారు. ప్రతి ఫిర్యాదును జాగ్రత్తగా నమోదు చేసి, పరిష్కారం వరకు అధికారులు పర్యవేక్షించాలని, అవసరమైతే ఫీల్డ్ పరిశీలనలు కూడా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ సిహెచ్ మహేందర్ జి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ఆర్డీఓ వెంకటేష్, డి ఆర్డీఓ శ్రీనివాస్ రావు, అన్ని శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడిఓ లు, ఎంపిఓ లు, తదితరులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి



**తిరుమలగిరి (సాగర్), నవంబర్ 17 (జనంసాక్షి) :** రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని నాగార్జున సాగర్ నియోజకవర్గ శాసనసభ్యుడు కుందూరు జైవీర్ రెడ్డి అన్నారు . సోమవారం ఆయన మండలంలోని అల్వాల వద్ద మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇందిర క్రాంతి పథం కేంద్రాన్ని ప్రారంభించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని ఐకెపి సెంటర్లకు తీసుకువచ్చి గిట్టుబాటు ధరను పొందాలని , దళారులను అమ్మి మోసపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఇంచార్జీ తహసిల్దార్ అనిల్ కుమార్ , మండల వ్యవసాయ అధికారి గంటా హర్షిత , ఏపీఎం రాజేశ్వరి, హాలియా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ ఆంగోతు భగవాన్ నాయక్, పెంకీసు పాపిరెడ్డి ,పల్ రెడ్డి రామిరెడ్డి ,మహిళా సంఘం సభ్యులు తదితరులు ఉన్నారు.

## దమ్మపేట మండలంలో కొత్త సబ్ స్టేషన్లు



**దమ్మపేట, నవంబర్ 17 (జనం సాక్షి) :** దమ్మపేట మండలంలో నూతనంగా 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్లలు అశ్వరావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు జారే ఆదినారాయణ కృషితో.విద్యుత్ సమస్యలను నివారించేందుకు మల్లారం,జగ్గారం గ్రామాల్లో విద్యుత్ సబ్ స్టేషన్ కు 5కోట్ల 27 లక్షల 82 వేల రూపాయలు నిధులలు మంజూరైనట్లు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలియజేశారు.33/11 కెవి సబ్ స్టేషన్ నిర్మాణం పూర్తయితే,ఆయా ప్రాంతాల ప్రజలకు ముఖ్యంగా రైతులకు విద్యుత్ పరంగా ఉన్న సమస్యలు పూర్తిగా తొలగిపోతాయని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలియజేశారు. నాణ్యమైన,నిరంతరాయ విద్యుత్ సరఫరా అందుబాటులోకి రానుందనీ సమస్యను ప్రభుత్వానికి విన్నవించడంతో సబ్ స్టేషన్ మంజూరు చేయడం పట్ల ముఖ్యమంత్రికి, సంబంధిత శాఖ మంత్రి బట్టి విక్రమార్కకి నియోజకవర్గం తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దమ్మపేట మండల అధ్యక్షులు సత్యప్రసాద్,మాజీ సర్పంచ్ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూముల ఆక్రమలణల తొలగింపు



**అశ్వరావుపేట నవంబర్ 17 (జనం సాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట మున్సిపాలిటీలో ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలను అధికారులు తొలగించారు. మున్సిపాలిటీ పరిధిలోని రెండు ప్రాంతాల్లో సుమారు 150 కుటుంబాలు మూడేళ్ళ నుండీ అనధికారికంగా నివాసాలు ఏర్పాటు చేసుకుని నివసిస్తున్నారు. రాత్రి రెండు గంటల నుండి రెవిన్యూ మున్సిపల్ పోలీస్ శాఖలు అక్రమ నివాసాల తొలగింపు చర్యలు చేపట్టారు. శాంతిభద్రతల దృష్ట్యా సిపిఐ నేతలను ముందస్తు అరెస్టులు చేశారు. రెండు ప్రాంతాల్లో ను భారీగా మోహరించిన పోలీసులు జేసీబీ లతో నివాసాలు తొలగిస్తున్నారు. కనీస సమాచారం లేకుండా ఇళ్ళు కూలుస్తున్నారని, ముందస్తుగా సమాచారం ఇస్తే ఇంట్లోని వస్తువులైన బయటకు తెచ్చుకునేవారుమని బాధితులు ఆరోపిస్తున్నారు.ఓ రాజకీయ పార్టీకి చెందిన నేత తమ వద్ద డబ్బులు తీసుకుని నివాసాలు ఏర్పాటు చేయించాడని, అప్పులు తెచ్చి మరీ ఇల్లు కట్టుకున్నామని అప్పులు తీరకముందే మళ్లీ రోడ్డును పడ్డామని బాధితులు రోదిస్తున్నారు.

## ముఫ్తి జావిద్ సేవలు చిరస్మరణీయం



**దేవరకొండ, నవంబర్ 17 (జనం సాక్షి) :** దేవరకొండ జామియాతుల్ ఉలేమా నేత, ముస్లిం మత పెద్ద ముఫ్తి మొహమ్మద్ జావిద్ హుస్సేన్ ఖాస్మి సాహెబ్ అకస్మిక మరణం దేవరకొండ ముస్లిం సమాజానికి తీరని లోటు అని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. సోమవారం వారి భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళు లర్పించి,వారి కుటుంబ సభ్యులకు పరామర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఫ్తి సాహెబ్ యొక్క సరళమైన జీవన విధానం, ఆధ్యాత్మిక సేవలను స్మరించుకున్నారు. సమాజ శాంతి, సౌభ్రాతృత్వం కోసం ఆయన చేసిన కృషి ఎన్నటికీ మరవలేనిదని అభిప్రాయపడ్డారు. ముఫ్తి జావిద్ హుస్సేన్ ఖాస్మి సాహెబ్ సమాజానికి చేసిన సేవలు చిరస్థాయిగా నిలుస్తాయని, ఆయన మరణం సమాజంలో తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని అన్నారు.ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, ఫారుక్ మౌలానా, మాజీద్ మౌలానా, ముఫ్తి రిజ్వాన్, సిరాజ్ ఖాన్,వైస్ చైర్మన్ రహత్ అలీ, టౌన్ ప్రెసిడెంట్ యూనుస్, మైనార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, యువజన కాంగ్రెస్ నాయకులు, ప్రముఖులు, ప్రజలు పాల్గొని ముఫ్తి సాహెబ్‌కు నివాళులు అర్పించారు.

# రైతులకు భూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు, భూమి సునీల్

**తుంగతుర్తి, నవంబర్ 17 (జనం సాక్షి) :** వ్యవసాయం చేసే ప్రతి రైతు సాగు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని భూ చట్టాల నిపుణుడు, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు భూమి సునీల్ అన్నారు. లిఫ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన తెలంగాణ సాగు న్యాయ యాత్ర లో భాగంగా సోమవారం తుంగతుర్తి మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో భూమి సునీల్ పాల్గొని మాట్లాడుతూ.దళారీ వ్యవస్థ పూర్తిగా నిర్మూలించబడినప్పుడే నిజమైన సాగు న్యాయం సాధ్యమవుతుందని తెలిపారు. రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలు, నాణ్యతలేని విత్తనాలు, ఎరువుల మోసాలు, మార్కెట్‌లో అన్యాయం, పంటల బీమా వంటి కీలక అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచంలో పలు దేశాల్లో భూ చట్టాలను సమర్థంగా వినియోగిస్తూ రైతులు లబ్ధి పొందుతున్నారని, అలాంటి అవగాహన మన రైతులకు ఉండాలని సూచించారు. ప్రస్తుతం దేశంలో 200కుపైగా భూ చట్టాలు ఉన్నాయనీ, అవన్నీ రైతులకు ఉపయోగపడేలా అవగాహన కల్పించడమే ఈ యాత్ర లక్ష్యమని పేర్కొన్నారు.ఈ సమావేశంలో పాల్గొన్న రైతులకు ప్రతి ఒక్కరు తలా పదిమందికి ఈ విషయాలను తెలియజేయాలన్న పిలుపునిచ్చారు. భూమి ఉండి పాసుపుస్తకం లేకపోయినా, ఇతర ఏ భూ సమస్య ఉన్న ప్రభుత్వ నిర్దేశించిన నమూనాలో మీసేవ కేంద్రాల ద్వారా చేసుకోవచ్చని తెలిపారు.ఇది దేశంలోనే తొలిసారిగా సాగు చట్టాలపై రైతులలో లోతైన అవగాహన కల్పించేందుకు చేపట్టిన అధ్యయన యాత్రగా గుర్తించారు. అంతేకాకుండా, వినూత్న పంటల వైపు దృష్టి సారించాలని, అధికంగా ఎరువుల వాడకం వల్ల ప్రజలు అనారోగ్యానికి లోనవుతున్నారని హెచ్చరించారు. రైతులు పలు సమస్యలను తెరపైకి తెచ్చారు. భూమికి పట్టా ఉన్నప్పటికీ ఆక్రమణల పాలవడం, రిజిస్ట్రేషన్‌కు మ్యాప్ అవసరమవడం, భూ వివాదాల



వంటి అంశాలను ప్రస్తావించగా ఈ సమస్యలను భూ చట్టాల ఆధారంగా పరిష్కరించవచ్చని వివరించారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ దయానందం,లిఫ్స్ సంస్థ ప్రతినిధులు, అడ్వకేట్లు జీవన్,రవి, అభిలాష్, సందీప్, దాయం కరుణాకర్ రెడ్డి, కేతిరెడ్డి కరుణాకర్ రెడ్డి, ఏడిఏ రమేష్ బాబు, డిప్యూటీ తహసిల్దార్ యాదగిరి, ఆర్ ఐ లు రవీందర్ రెడ్డి, శ్రీనివాస్ ఏఈఓలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, నవంబర్ 17 (జనంసాక్షి) :** ప్రజావాణి ఫిర్యాదులపై అధికారులు సత్వరమే చర్యలు తీసుకొని పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి ఆర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు తప్పనిసరిగా హాజరై, ఫిర్యాదులపై శాఖల వారీగా ప్రత్యేక శ్రద్ధ పెట్టి పరిష్కరించాలని అన్నారు.వారం రోజుల్లో ప్రజావాణి ఫిర్యాదుల స్టేటస్ పై సమీక్ష నిర్వహిస్తానని తెలిపారు.కోర్ట్ కేసులు ఏమైనా పెండింగ్ ఉంటే వెంటనే తదుపరి వాయిదా నాటికి కౌంటర్ ఫైల్ సిద్ధం చేయాలని ఆదేశించారు.ప్రభుత్వ కార్యాలయాలకు స్థలం అవసరం ఉంటే తెలియజేయాలని, అలాగే ప్రభుత్వ కార్యాలయాలకు చెందిన భూముల వివరాలు రికార్డ్ లలో అప్ డేట్ చేయాలని అన్నారు.జిల్లా స్థాయి అధికారులు, మండల ప్రత్యేక అధికారులు క్షేత్ర స్థాయి పరిశీలన చేసి శాఖల వారీగా సమీక్షలు నిర్వహించాలని అన్నారు.పురోగతిపై నివేదికలు వెబ్ లింక్ ద్వారా ఎప్పటికప్పుడు అప్ లోడ్ చేయాలని ఆదేశించారు.నషా ముక్తా భారత్ అభియాన్ లో భాగంగా జిల్లాలో మాదకద్రవ్యాలను అరికట్టుటకై ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం జిల్లాలోని విద్యాసంస్థలలో, గ్రామ స్థాయిలో ప్రతిజ్ఞ చేపించాలని అధికారులను ఆదేశించారు.మహిళా శిశు సంక్షేమ శాఖ పరిధిలో మహిళా సాధికారిత కేంద్రం ఆధ్వర్యంలో భేటీ బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ తెలంగాణ 30 రోజుల ప్రత్యేక ప్రచారంలో భాగంగా బాల్య వివాహల నిర్మూలన అవగాహన కార్యక్రమ పోస్టర్, టోల్ ఫ్రీ నెంబర్ పోస్టర్లను ఆవిష్కరించారు.సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భూ సమస్యలకి సంబందించి 24 దరఖాస్తులు,మున్సిపల్ కమిషనర్లకు 4, జిల్లా ఇరిగేషన్ అధికారికి 2, సోషల్ వెల్ఫేర్ అధికారికి 2, మిగిలిన 10 దరఖాస్తులు వివిధ శాఖలకు,మొత్తం 42 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ కె.సీతారామారావు , ఆర్డీఓ వేణుమాధవ రావు,మహిళా సంక్షేమ అధికారి కె.నర్సింహారావు, హౌజింగ్ పిడి సిధార్థ, ఇరిగేషన్ అధికారి,జడ్పీ డిప్యూటీ సిఈఓ శిరీష, డిఎస్సిడిఓ కె.దయానంద రాణి,డిపిఓ యాదగిరి, డిఈఓ ఆశోక్, డిఐఈఓ బాను నాయక్, డిఎంహెచ్ఓ వెంకట రమణ,అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


## మంత్రుల పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే బిఎల్ఆర్



**మిర్యాలగూడ, నవంబర్ 17 (జనం సాక్షి) :** మిర్యాలగూడ నియోజకవర్గ అభివృద్ధి కోసం రాజకీయాలకు అతీతంగా సామాజిక సేవతోనే బతికి ఉన్నంతకాలం సేవ చేస్తానని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఈనెల 17న మిర్యాలగూడ లో పర్యటించనున్న రాష్ట్ర మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి కోమటిరెడ్డిల పర్యటన ఏర్పాట్లను ఆదివారం ఆయన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తో కలిసి పరిశీలించారు. చిల్లాపురం బైపాస్ వద్ద ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ భద్రత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఉదయం 9:30 కు శెట్టిపాలెం మీదుగా అవంతిపురం వరకు నిర్మించనున్న ఔటర్ రింగ్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తారన్నారు. ఈదులగూడ వద్దగల కేఎన్ఎమ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన భవనం తో పాటు జూనియర్ కళాశాలలో నిర్మించిన నూతన భవనాలను వారు ప్రారంభిస్తారనీ అన్నారు. అనంతరం నందిపాడు చౌరస్తా వద్ద రూ 75 కోట్ల 25 లక్షలతో నిర్మించనున్న పలు పట్టణ అభివృద్ధి పనుల్లో భాగంగా ఫ్లైఓవర్ నిర్మాణ పనులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం బి ఎల్ ఆర్ బ్రదర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహా అన్నప్రసాద కార్యక్రమంలో మంత్రులు పాల్గొంటారన్నారు. మిర్యాలగూడ నియోజకవర్గాన్ని తెలంగాణ రాష్ట్రంలోనే అద్భుతంగా తీర్చిదిద్ది మహానగరంగా తీర్చిదిద్దేందుకు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. ఈ మంత్రుల పర్యటనలో రాజకీయాలకు అతీతంగా ప్రజలు పాల్గొని మిర్యాలగూడ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ఆయన వెంట సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, డీఎస్పీ రాజశేఖర్ రాజు రెవిన్యూ , మున్సిపాలిటీ అధికారులు ఉన్నారు.

## కుక్కల దాడిలో గొర్రె పిల్లలు మృతి

**రాజాపూర్, నవంబర్ 17 (జనంసాక్షి) :** బాలానగర్ మండల పరిధిలోని గంగాధరిపల్లి గ్రామంలో కుక్కల దాడిలో 15 గొర్రె పిల్లల మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి బాధిత రైతులకు రూ.20,000 ఆర్థిక సహాయం అందించారు. రైతులు రాములు (5), చెనయ్య (3), నరేష్ (2), మలయ్య (2), జంగయ్య (2), నర్సిమా (1) కుటుంబాలకు ఎమ్మెల్యే ఆర్థిక సహాయం అందించారు.



# జమలాపురం ఆలయంలో కవిత ప్రత్యేక పూజలు

- ఆలయ మర్యాదలతో స్వాగతం పలికిన అర్చకులు

**మధిర, నవంబర్ 17 (జనం సాక్షి) :** జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా ఎర్రుపాలెం మండలంలోని జమలాపురం ఆలయాన్ని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం అర్చకులు,ఆలయ అధికారులు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కవిత శ్రీవారికి ప్రత్యేక పూజలు చేశారు. షుమారు 2 గంటల పాటు పైగా ఆమె ఆలయంలో గడిపారు. ఆలయ చరిత్ర,విశిష్టతను ఆడిగి తెలుసుకున్నారు.అనంతరం అర్చకులు ఆశీర్వచనంతో పాటు శ్రీవారి చిత్రపటాన్ని, శేష వస్త్రాలను అందజేశారు. అనంతరం జాగృతి నాయకుడు మాజీ తెలంగాణ జాగృతి మండల అధ్యక్షుడు కాపర్తి సతీష్ గృహంలో అల్పాహారాన్ని స్వీకరించారు.

ఏకో టూరిజం భూ నిర్వాసితులను పరామర్శ

జమలాపురంలో నిర్మాణం జరుగుతున్న అర్బన్ పార్క్ ఏకో టూరిజం ప్రాజెక్ట్ భూ నిర్వాసితులను ఆమె పరామర్శించారు. ఏకో టూరిజం ప్రాజెక్ట్ ద్వారా తమ భూములను కోల్పోతున్నామని, ప్రత్యామ్నాయం చూపకుండా అటవీశాఖ అధికారులు భూములను లాక్కున్నారని రైతులు ఆమె ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చొరవ తీసుకొనేల తమ వైపు పోరాడాలని కవితను నిర్వాసితులు అభ్యర్థించారు. ఉన్నతాధికారులతో మాట్లాడతానని భూములు కోల్పోయిన రైతలకు



జాగృతి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రత్యామ్నాయమో, పరిహారము వచ్చే వరకు జాగృతి 13 మంది రైతుల తరుపున పోరాటం చేస్తుందన్నారు. ప్రస్తుతం కోర్ట్ పరిధిలో ఉన్నందున తీర్పు వచ్చే వరకు సంయమనం పాటించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, జిల్లా అధ్యక్షుడు గుంటి సుందర్,కొత్తగూడెం జిల్లా అధ్యక్షురాలు గట్టు కరుణ, జాగృతి రాష్ట్ర నాయకులు పవన్ ప్రతాప్ నాయక్, నాయకులు బూసిపోగు సృజన్ కుమార్, గద్దల సత్యనారాయణ, ఉయ్యూరు సాయిరాం,పోతురాజు గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

# కోతుల మూలంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం

- గృహిణులకు ఆటంకంగా మారిన కోతుల మూకలు
- కోతుల ఆగడాలకు పిట్టజాతి అభివృద్ధికి ఆటంకం

**పెనుబల్లి, నవంబర్ 17 (జనం సాక్షి) :** కోతుల సంతతి విపరీతంగా పెరిగిపోయిఅవి చేసే అరాచకం, గ్రామాలలో మానవ మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. కోతుల మూలంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమవుతోంది, వ్యవసాయం కుదేలవుతుంది, ఇళ్ల వెనుక ఉండే ఖాళీ జాగాల్లో (పెరడు) పెంచుకునే కూరగాయలు,మొక్కజొన్న, పూలమొక్కలు వంటివి కనుమరుగయ్యాయి, కంచెలకు పెరిగే కూరగాయల మొక్కలతో పల్లెలు కనువిందుగా కనిపించేవి,ఒకప్పుడు కూరగాయలు,మొక్కజొన్న కంకులు బహిరంగ మార్కెట్లో కొనడం అరదు,కోతుల మూలంగా ఈరోజున ప్రతి ఒక్కరూ వీటిని మార్కెట్లో కొనాల్సి వస్తుంది,వీటి కొనుగోళ్లు తలకు మించిన భారంగా మారుతుంది. పంటలకే కాదు, నివాస గృహాలకు కూడా రక్షణ కరువవుతోంది, ఆదమరిస్తే ఇంట్లోకి చొరబడుతున్నాయి, ఇళ్ల చుట్టూ సోలార్ తీగలు అమర్చుకోవాల్సి వస్తోంది. పాఠశాలలకు వెళ్లే పిల్లలు కూడా కోతుల బారిన పడుతున్నారు,ఇవి కనిపిస్తే నడిచి వెళ్లే పెద్దలు కూడా ఒంటరిగా వెళ్లలేని పరిస్థితి, కోతుల మూలంగా పిట్ట జాతి కూడా అంతరించి పోతుంది, ఒకప్పుడు కొంగలు, కాకులు, పిచ్చుకలు, ఇతర జాతి పక్షుల గూళ్ళు గ్రామాలలోప్రతి చెట్టు మీద కనపడేవి,పక్షులు వాటిపిల్లలఅరుపులు వినపడేవి, ఇప్పుడు కోతుల సంతతి పెరిగిచెట్ల మిదఉన్న పక్షులగూళ్ళు, గూళ్ళల్లో ఉన్న గుడ్లు, పిల్లల్ని కూడా కోతులు తినేస్తున్నాయి, చెట్ల మీద ఒక్క పిట్ట గూడు లేకుండా నాశనంచేసి పక్షి జాతి అభివృద్ధిని నిలువునా అడ్డుకుంటున్నాయి, గ్రామస్థులు ఇళ్ల వరండాలో, ఆవరణలో కోళ్లను పొదిగించే సాహసంకూడాచేయట్లేదంటే కోతుల ప్రభావం, వాటి ఆగడలు ఎంత పెట్రేగిపోయాయే ఉహించలేము, ముందు ముందు మనుషులకన్నా వీటి సంతతి రెట్టింపుగా పెరుగుతాయన్నా అతిశయోక్తి కాదు, సహజ సిద్ధంగా అడవుల్లో పెరగాల్సిన కోతులు, ప్రభుత్వ చర్యల మూలంగా అవి గ్రామాలకు తరలాల్సి వస్తోంది,చీమ చీమ ఎందుకు కుట్టావు అంటే"నా బంగారు పుట్టలో వేలు పెడితే కుట్టనా" అన్న



సామెతలా" నా ఇల్లు లాంటి అడవులను గెలికేతే మీ ఇళ్లను గెలకనా" అన్నట్లుగా, ప్రభుత్వాలు అడవుల్లో జామాయిల్ పెంచడం మూలాన కోతుల పాలిట శాపంగా మారింది,అడవుల్లో పండ్ల చెట్లను పెంచితే కోతులు గ్రామాలకు రావు,ప్రభుత్వాలు ఆ వైపుగా ఆలోచన చేస్తున్నట్లుగా కనిపించట్లేదు, కోతుల బెడద చట్ట సభల్లో చర్చకు వచ్చినా పరిష్కార మార్గాలను ప్రభుత్వం చూపడం లేదు.

# మెరుగైన రాబడి కోసం.. మిడ్‌క్యాప్ మ్యూచువల్ ఫండ్స్




**న్యూఢిల్లీ:**మధ్య కాలం నుంచి దీర్ఘకాలానికి పెట్టుబడులపై మెరుగైన రాబడి కోరుకునే ఇన్వెస్టర్ల ముందున్న ఎంపికల్లో మిడ్‌క్యాప్ మ్యూచువల్ ఫండ్స్ కూడా ఒకటి. వీటిల్లో రిస్క్ అధికం.రాబడి కూడా అధికంగానే ఉంటుంది. లార్జ్‌క్యాప్ కంటే దీర్ఘకాలంలో అదనపు రాబడి మిడ్‌క్యాప్ ఫండ్స్‌తో సాధ్యపడుతుందని గత గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఈ విభాగంలో క్వాంట్ మిడ్‌క్యాప్ ఫండ్ మంచి పనితీరు చూపిస్తోంది. పదేళ్లు అంతకుమించిన దీర్ఘకాల లక్ష్యాల కోసం ఇన్వెస్టర్లు ఈ పథకంలో పెట్టుబడులను పరిశీలించొచ్చు.రాబడులు: స్వల్పకాలం నుంచి దీర్ఘకాలంలోనూ ఈ పథకంలో పనితీరు మెరుగ్గా ఉండడం కనిపిస్తుంది. ముఖ్యంగా గత ఏడాది కాలంలో ఈ పథకం ఎలాంటి రాబడిని ఇవ్వలేదు. అదే సమయంలో నష్టాలను మిగల్చలేదు. గడిచిన ఏడాది కాలంలో ఈక్విటీలు దిద్దుబాటు దశలో ఉండడం తెలిసిందే ఇది మినహా మిగిలిన అన్ని కాలాల్లోనూ రాబడులు పటిష్టంగా ఉన్నాయి. మూడేళ్లలో చూస్తే ఏటా 18 శాతం చొప్పున డైరెక్ట్ ప్లాన్‌లో రాబడి నమోదైంది. ఐదేళ్లలోనూ ఏటా 28 శాతం చొప్పున ప్రతిఫలాన్ని అందించింది. ఇక ఏడేళ్ల కాలంలో 23 శాతం, పదేళ్లలోనూ 18.34 శాతం చొప్పున రాబడి తెచ్చిపెట్టింది. బీఎస్‌ఈ 150 మిడ్‌క్యాప్ టీఆర్‌ఐ సూచీతో పోల్చి చూస్తే ఐదేళ్లు, ఏడేళ్లలో అదనపు రాబడి ఇచ్చింది. పదేళ్ల కాలంలోనూ సూచీతో సమాన రాబడిని అందించింది. ముఖ్యంగా గడిచిన ఐదేళ్ల కాలంలో ఏ ఏడాది కూడా ఈ పథకం నికరంగా నష్టాలను ఇవ్వలేదు.

**పెట్టుబడుల విధానం:**
ఇది యాక్టివ్ ఫండ్. అంటే ఎప్పటికప్పుడు మార్పులు, చేర్పులు చేస్తుంటుంది. మార్కెట్, రంగాల వారీ పరిస్థితులు, పెట్టుబడుల అవకాశాలకు అనుగుణంగా పోర్ట్‌ఫోలియోలో కొత్త స్టాక్స్‌ను చేర్చుకోవడం, ప్రస్తుత స్టాక్స్‌లో ఎక్స్‌పోజర్ తగ్గించుకోవడం, పూర్తిగా వైదొలగడం వంటి బాధ్యలను ఫండ్ పరిశోధక బృందం ఎప్పటికప్పుడు చేస్తుంటుంది. ముఖ్యంగా ఏదో ఒక విధానానికి పరిమితం కాబోదు. మూమెంటమ్, వ్యాల్యూ, గ్రోత్ ఇలా అన్ని రకాల విధానాల్లోనూ పెట్టుబడుల అవకాశాలను ఈ పథకం పరిశీలిస్తుంటుంది. అవకాశాలకు అనుగుణంగా పెట్టుబడులపై నిర్ణయాలు తీసుకుంటూ ఉంటుంది.

**పోర్ట్‌ఫోలియో:** ఈ పథకం నిర్వహణలో ప్రస్తుతం రూ.8,525 కోట్ల పెట్టుబడులు ఉన్నాయి. ఇందులో 90.52 శాతం పెట్టుబడులను ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసింది. డెట్ సెక్యూరిటీల్లో 2.8 శాతం పెట్టుబడులు పెట్టింది. 6.68 శాతం నగదు నిల్వలు ఉన్నాయి. ముఖ్యంగా ఈక్విటీ పోర్ట్‌ఫోలియోని గమనించినట్టయితే మొత్తం 29 స్టాక్స్ ఉన్నాయి. టాప్-10 స్టాక్స్‌లోనే 58 శాతం పెట్టుబడులు ఉన్నాయి. ఈక్విటీ పెట్టుబడులను గమనిస్తే.. మిడ్‌క్యాప్ కంపెనీల్లో 59 శాతం ఇన్వెస్ట్ చేసింది. అదే సమయంలో 29 శాతం మేర లార్జ్‌క్యాప్ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేసింది.
లార్జ్‌క్యాప్ పెట్టుబడులు రిస్క్‌ను తగ్గిస్తాయి. మిడ్‌క్యాప్ పెట్టుబడులు మెరుగైన రాబడులకు అవకాశం కల్పిస్తాయని అర్థం చేసుకోవచ్చు. ఇంధన రంగ కంపెనీలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తూ 18 శాతం పెట్టుబడులను ఈ రంగాల కంపెనీల్లో ఇన్వెస్ట్ చేసింది. ఆ తర్వాత ఇండ్రస్టియల్స్ కంపెనీలకు 16.71 శాతం, హెల్త్ కేర్ కంపెనీలకు 15.30 శాతం, టెక్నాలజీ కంపెనీలకు 11.22 శాతం చొప్పున కేటాయింపులు చేసింది.

## 'తప్పు జరిగింది'

### డెలివరీ ఫీజులపై స్పందించిన సీఈఓ



**న్యూఢిల్లీ:**ధర నిర్ణయాలకు సంబంధించిన వివాదంపై క్విక్-కామర్స్ ప్లాట్‌ఫామ్ జెప్టో కో ఫౌండర్ అండ్ సీఈఓ ఆదిత్ పలిచా స్పందించారు. డార్క్ ప్యాటర్న్‌లను ఉపయోగించడం వల్ల తప్పు జరిగిందని ఒప్పుకున్నాడు.కస్టమర్ల నుంచి తీవ్రమైన వ్యతిరేఖత రావడంతో దీనిని నిలిపివేసినట్లు స్పష్టం చేశారు.మేము డెలివరీ ఫీజులు, ధరలపై ప్రయోగాలు చేయాలని అనుకున్నాము. దీనికోసం వేర్వేరు విధానాలను ప్రయత్నించాము. దీంతో సోషల్ మీడియాలో వ్యతిరేఖత మొదలైంది. అందుకే ఈ విధా నాన్ని పూర్తిగా నిలిపి వేశామని ఇలాంటి పొరపాటు మళ్లీ జరగదని ఆయన అన్నారు. కాగా క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్ జెప్టో అన్ని హ్యాండ్లింగ్ ఫీజులు సర్జ్ ఛార్జీలను తొలగించింది. అదే సమయంలో ఉచిత డెలివరీ కోసం దాని కనీస ఆర్డర్ విలువను గణనీయంగా తగ్గించింది.ఈ-కామర్స్, క్విక్ కామర్స్, రైడ్-హెయిలింగ్ కంపెనీలు తమ యాప్‌లలో అమలు చేసే మానిప్యులేటివ్ అండ్ మోస పూరిత డిజైన్ పద్ధతులను డార్క్ ప్యాటర్న్‌లు అంటారు. దీనిద్వారానే కస్టమర్‌కు తెలియ కుండా వివిధ రకాల ఛార్జీలు విధిస్తారు. అయితే ఇవి ప్లాట్‌ఫామ్ ఇంటర్‌ఫేస్‌లో ఎక్కడా కనిపించదు. కానీ.. ఆర్డర్ చేసి చెక్‌ఔట్ చేసే సమయంలో మాత్రమే అదనపు ధరలు కనిపిస్తాయి. జూన్ 7న, డార్క్ ప్యాటర్న్‌లను గుర్తించడానికి, అటు వంటి పద్ధతులను తొలగించడానికి అవస రమైన చర్యలు తీసుకోవడానికి కంపెనీలు స్వీయ-ఆడిట్‌లు నిర్వహించాలని కేంద్రం ఒక సలహాను జారీ చేసింది. ఇది కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి స్విగ్గీ , జొమాటో, బ్లింకిట్ పేరెంట్ ఎటర్నల్, ఫ్లిప్‌కార్ట్, బిగ్‌బాస్కెట్, టాటా 1ఎంజి, ఓలా, రాపిడోతో సహా బహుళ ఇంటర్నెట్ కంపెనీల మధ్య జరిగిన సమావేశం తర్వాత జరిగింది.

# 26 వేల ఎగువకు నిఫ్టీ

- లాభాల్లో ముగిసిన సూచీలు..



**న్యూఢిల్లీ:**దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ వారాన్ని లాభాలతో ప్రారంభించాయి. పీఎస్‌యూ బ్యాంకుల్లో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు రాణించాయి. ఇటీవలి బిహార్ ఎన్నికల్లో ఎన్డీయే విజయం ద్వారా విధాన నిర్ణయాలు కొనసాగింపు, మార్కెట్ స్థిరత్వానికి దోహదం చేస్తుందన్న అంచనాలు మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరిచాయి. ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడం, భారత్-అమెరికా మధ్య వాణిజ్య చర్చల్లో పురోగతి కూడా కలిసొచ్చింది. ఈ క్రమంలోనే నిఫ్టీ మళ్లీ 26 వేల మార్కు దాటింది.సెన్సెక్స్ ఉదయం 84,700.50 (క్రితం ముగింపు 84,562.78) వద్ద లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కదలాడింది. చివరకు 388.17 పాయింట్లు లాభపడి 84,950.95 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 103.40 పాయింట్లు పెరిగి 26,013.45 వద్ద ఉంది. డాలరుతో రూపాయి మారకం విలువ 88.64గా ఉంది. సెన్సెక్స్ 30లో ఎటెర్నల్, మారుతీ సుజుకీ, కోటక్ బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా, టెక్ ఎం, టైటాన్ షేర్లు లాభాల్లో ముగిశాయి. టీఎంపీవీ, అల్ట్రా సిమెంట్, ఏషియన్ పెయింట్స్, టాటా స్టీల్, అదానీ పోర్ట్స్ కంపెనీ షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 64.20 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4080 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.




# రూ.530 కోట్లతో అల్యూమినియం క్యాన్ల తయారీ ప్లాంట్ విస్తరణ



**న్యూఢిల్లీ:**సస్టైనబుల్ అల్యూమినియం ప్యాకేజింగ్‌లో సర్వీసులు అందిస్తున్న బాల్ కార్పొరేషన్ భారత్‌లో తన కార్యకలాపాలు విస్తరించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ముంబై సమీపంలోని తలోజా తయారీ కేంద్రానికి 2024లో చేసిన దాదాపు 55 మిలియన్ డాలర్ల(సుమారు రూ.480 కోట్లు) పెట్టుబడికి కొనసాగింపుగా బాల్ కార్పొరేషన్ ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీ సదుపాయంలో సుమారు 60 మిలియన్ డాలర్లు(సుమారు రూ.530 కోట్లు) ఇన్వెస్ట్ చేయబోతున్నట్లు తెలిపింది.దాంతో మొత్తంగా ఇండియాలో 115 మిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టినట్లవుతుంది.పానీయాలకు సంబంధించి అల్యూమినియం ప్యాకేజింగ్ కోసం పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడానికి బాల్ కార్పొరేషన్ ప్రాంతీయ సరఫరా గొలుసును బలోపేతం చేయడంలో ఈ చర్యలు కీలకంగా ఉంటాయని కంపెనీ అధికారులు చెబుతున్నారు. 'ప్రపంచవ్యాప్తంగా కంపెనీ వృద్ధికి భారతదేశం కీలకం. ఈ పెట్టుబడి ఇండియాలో కార్యకలాపాలను మరింత పెంచడానికి, ప్రత్యర్థులతో దీర్ఘకాలిక పోటీ ప్రయోజనాన్ని పొందటానికి వీలు కల్పిస్తుంది' అని బాల్ బేవరేజ్ ప్యాకేజింగ్ ఆసియా ప్రెసిడెంట్ మాండీ గ్లా అన్నారు.రాబోయే ఐదేళ్లలో భారతదేశపు పానీయాల మార్కెట్ వార్షికంగా 10% పైగా విస్తరిస్తుందని అంచనా వేస్తున్నారు. ప్యాకేజింగ్‌లో సుస్థిరత, వినియోగదారుల సౌలభ్యం కోసం వివిధ పానీయాల బ్రాండ్లు అల్యూమినియం ప్యాకేజింగ్ వైపు మళ్లుతున్నాయి. ముఖ్యంగా రెడీ టు డ్రింక్, పాల ఆధారిత పానీయాల్లో వీటి వాడకం ఎక్కువగా ఉంది. ఈ విభాగంలో మన్నిక, షెల్ఫ్ లైఫ్ పొడిగింపు కారణంగా అల్యూమినియం ప్యాకేజింగ్‌కు డిమాండ్ ఎక్కువగా ఉంది. పాల విభాగంలో ప్యాకేజింగ్‌కు సంబంధించి కంపెనీ రిటార్ట్ ఇన్నోవేషన్ టెక్నాలజీని వాడుతున్నట్లు అధికారులు చెప్పారు.ఈ సందర్భంగా బాల్ బేవరేజ్ ప్యాకేజింగ్ ఇండియా ఆసియా రీజినల్ కమర్షియల్ డైరెక్టర్ మనీష్ జోషి మాట్లాడుతూ..'వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ మార్కెట్లో కస్టమర్లకు విశ్వసనీయతతో సేవలందించాలని కంపెనీ నిబద్ధతతో పని చేస్తోంది' అన్నారు. బాల్ 2016లో భారతదేశంలోకి ప్రవేశించినప్పటి నుంచి తలోజా, శ్రీసిటీల్లో తన కార్యకలాపాలు విస్తరిస్తోంది. ఇది ప్రస్తుతం 185 మి.లీ నుంచి 500 మి.లీ వరకు విస్తృత శ్రేణి క్యాన్ ఫార్మాట్లను తయారు చేస్తోంది.

## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 6.10 | ₹ 6.12 |

## బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,14,650 (22 క్యారెట్లు) | ₹ 1,25,080 (24 క్యారెట్లు) |
|---|---|

## వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 1,75,000

# ఫేక్ మైక్రోసాఫ్ట్ టెక్ సపోర్ట్

## అమెరికన్లకే భారీ మొత్తంలోటోపీ



**న్యూఢిల్లీ:**కర్ణాటకలోని బెంగళూరులో ఇటీవల వెలుగులోకి వస్తున్న సైబర్ నేరాల కేసులు ఆందోళన రేపుతున్నాయి. డిజిటల్ అరెస్ట్ అంటూ జనాలను బెదిరించి, కోట్ల రూపాయలుదండుకుంటున్న వైనం కలకలం రేపుతోంది.తాజాగా మైక్రోసాఫ్ట్ టెక్ సపోర్ట్ అంటూ ఒక ముఠా రెచ్చిపోయింది. అమెరికన్ల నుంచి కోట్లాది రూపాయలను కాజేసింది.టైమ్స్ ఆఫ్ ఇండియా కథనం ప్రకారం హానికరమైన ఫేస్‌బుక్ ప్రకటనలు చేశారని అమెరికన్ వినియోగదారులను నమ్మించడమే కాదు, భద్రతా హెచ్చరికలు , సర్వీస్ లింక్స్ అంటూ వారిని మభ్యపెట్టింది. 'మైక్రోసాఫ్ట్ టెక్నీషియన్ల' పేరుతో బెంగళూరుకు ఒక ముఠా అమెరికన్లకు భారీగా దోచేసింది.కంప్యూటర్లు హ్యాక్ అయ్యాయని వారి భయపెట్టి, ఫేక్ సేఫ్టీ సొల్యూషన్స్, నకిలీ ఫెడరల్ ట్రేడ్ కమిషన్ సమ్మతి విధానం అంట వారిని నమ్మించి కోట్ల రూపాయలను వారినుంచి రాబట్టింది సైబర్ నేరస్థుల ముఠా.ఎలా అంటే ఒక యూజర్ ప్రకటనపై క్లిక్ చేసిన తర్వాత, కోడ్ కంప్యూటర్‌ను స్తంభింపజేసి, మైక్రోసాఫ్ట్ గ్లోబల్ టెక్నికల్ సపోర్ట్ నుండి వచ్చినట్లుగా ఒక ఫేక్ మెసేజ్ పాప్-అప్ అవుతుంది. దీనిమీద నకిలీ హెల్ప్‌లైన్ నంబర్ కూడా డిస్‌ప్లే అవుతుందని సీనియర్ ఒకరు అధికారి చెప్పారు. బాధితుడు ఆ నంబర్‌కు కాల్ చేయడానే వీళ్ల కపట దందాకు తెరలేస్తుంది. మైక్రోసాఫ్ట్ టెక్నీషియన్లుగా నటిస్తున్న మోసగాళ్ళు సిస్టం హ్యాక్,ఐపీ అడ్రస్ హ్యాక్ అయింది, దీంతో బ్యాంకింగ్ డేటా ప్రమాదంలో పడిందని బెదిరించారు. దీనికి పరిష్కారంగా ఫేక్ సేఫ్టీ సెక్యూరిటీ పేరుతో భారీ మొత్తంలో డబ్బులు దండుకున్నారు. అమెరికాలో ఉంటున్న అనుమానాస్పద పౌరులను లక్ష్యంగా చేసుకున్నారనే ఆరోపణలతో నగరానికి చెందిన సైబర్ క్రైమ్ సిండికేట్‌తో సంబంధం ఉన్న 21 మందిని బెంగళూరు పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక కోర్టు ముందు హాజరుపరిచారు, వారిని పోలీసు కస్టడీకి తరలించారు.ఈ ముఠా నకిలీ "ఫెడరల్ ట్రేడ్ కమిషన్ (%ఖీజ%)" ఉల్లంఘనలను ఉదహరించి అనేక కోట్ల రూపాయలు దోచుకుంది. సైబర్ కమాండ్ స్పెషల్ సెల్, వైట్‌ఫీల్డ్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌కు చెందిన బృందాలు సిగ్మా సాఫ్ట్ టెక్ పార్క్‌లోని డెల్టా భవనంలోని ఆరవ అంతస్తులో ఉన్న మస్క్ కమ్యూనికేషన్స్ కార్యాలయంపై దాడి చేసినట్టు తెలుస్తోంది. సెర్చ్ వారెంట్‌తో శుక్రవారం మరియు శనివారం నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, హార్డ్ డిస్క్‌లు, మొబైల్ ఫోన్లు, ఇతర పరికరాలు స్వాధీనం చేసుకున్నారు.దీనిపై ఆఫీసు యజమాని పాత్రపై కూడా పోలీసులు కూపీ లాగుతున్నారు.

## రష్యాతో వ్యాపారం చేస్తే భారీ వడ్డింపులు

ఈ దేశాల జాబితాలో భారత్, చైనా ఉన్నట్లు తెలుస్తోంది. ఇరాన్‌ను కూడా ఇందులో చేర్చనున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తూ.. ఉక్రెయిన్‌కు సాయం చేయని దేశాల ఉత్పత్తులపై 500 శాతం సుంకం విధిస్తున్నామన్నారు. భారత్, చైనాలే ఆ దేశం నుంచి 70శాతం చమురును కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ బిల్లు అమల్లోకి వస్తే.. రష్యా నుంచి పెద్దమొత్తంలో ముడి చమురు కొనుగోలు చేస్తున్న భారత్, చైనాలపై తీవ్ర ప్రభావం పడుతుంది. మన ఔషధాలు, వస్త్రాలు వంటి ఎగుమతులపై ప్రభావం పడుతుంది. ఈ బిల్లును రిపబ్లికన్ సెనేటర్ లిండ్సే గ్రాహం ఇటీవల ప్రతిపాదించారు.రష్యాకు సహకరిస్తున్న దేశాలపై కఠిన చర్యలు తీసుకోవడం తప్ప ప్రస్తుతం తమ దేశానికి వేరే మార్గం లేదని ట్రంప్ పేర్కొన్నారు. ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని ముగించేలా రష్యా కాల్పుల విరమణ ఒప్పందానికి అంగీకరిస్తే మాస్కోతో వ్యాపారం చేస్తున్న దేశాలపై టారిఫ్‌ల తగ్గింపునకు చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు.



## మళ్లీ 'జాఫర్ ఎక్స్‌ప్రెస్' టార్గెట్..

### రైలు వెళ్లగానే పేలుడు

**నసీరాబాద్:** పాకిస్తాన్‌లో 'జాఫర్ ఎక్స్‌ప్రెస్'కు పెను ప్రమాదం తప్పింది. బలూచిస్తాన్‌లో గల నసీరాబాద్ జిల్లా గుండా రైలు వెళుతుండగా బాంబు దాడి జరిగింది.అయితే రైలు ఈ ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకుంది. షాహీద్ అబ్దుల్ అజీజ్ బుల్లో ప్రాంతంలో రైలు ట్రాక్‌ను దాటిన కొన్ని సెకన్ల తర్వాత రైల్వే ట్రాక్ వెంట అమర్చిన ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైస్ (ఐఈడీ) పేలిపోయింది. ఈ ఘటనతో రైల్వే ట్రాక్‌కు కొంత నష్టం వాటిల్లినప్పటికీ, ఎటువంటి ప్రాణనష్టం సంభవించలేదు. భద్రతా చర్యల్లో భాగంగా నాలుగు రోజుల పాటు నిలిపివేసిన తర్వాత, ఈ రైలు సేవలు తిరిగి ప్రారంభించిన వెంటనే ఈ దాడి జరగడం ఆందోళన కలిగిస్తోంది.క్వెట్టా నుండి పెషావర్ వెళ్లే ఈ రైలుపై జరుగుతున్న దాడుల పరంపరలో ఈ తాజా ఘటన ఒకటి. దాడి జరిగిన వెంటనే పోలీసులు, భద్రతా దళాలు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని, ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి, దర్యాప్తు ప్రారంభించాయి. నసీరాబాద్ సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ గులాం సర్వార్, దాడికి పాల్పడినవారిని గుర్తించేందుకు సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోందని ధృవీకరించారు. ట్రాక్‌కు నష్టం జరగడం వలన క్వెట్టాతో పాటు ఇతర ప్రాంతాల మధ్య రైలు రాకపోకలు తాత్కాలికంగా నిలిచిపోయాయి.జాఫర్ ఎక్స్‌ప్రెస్ గత కొన్ని నెలలుగా తిరుగుబాటు గ్రూపులకు ప్రధాన లక్ష్యంగా మారింది. ఈ సంవత్సరంలో మార్చి, ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్‌లలో ఈ రైలుపై పలు దాడులు జరిగాయి. మార్చిలో నిషేధిత బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ ఈ రైలును హైజాక్ చేసింది. ఈ ఘటనలో 26 మంది మరణించారు. అక్టోబర్‌లో సింధ్‌లో జరిగిన పేలుడులో ఐదు కోచ్‌లు పట్టాలు తప్పగా, సెప్టెంబర్, ఆగస్టులలో జరిగిన దాడులలోనూ రైలుకు నష్టం వాటిల్లింది. పలువురు ప్రయాణికులు గాయాల పాలయ్యారు. బలూచిస్తాన్ భౌగోళిక పరిస్థితులను అనువుగా చేసుకున్న తిరుగుబాటు గ్రూపులు కీలకమైన రైలు మౌలిక సదుపాయాలు, సాధారణ పౌరులను లక్ష్యంగా చేసుకుంటున్నాయని భద్రతా సంస్థలు పేర్కొన్నాయి. ప్రయాణికుల భద్రత దృష్ట్యా పాకిస్తాన్ రైల్వేలు నవంబర్ 9 నుండి 12 వరకు రైలు కార్యకలాపాలను నిలిపివేసినప్పటికీ, సేవలు తిరిగి ప్రారంభమైన వెంటనే దాడి జరగడం, భద్రతా వ్యవస్థకు సవాలుగా మారింది. పదేపదే జరుగుతున్న ఈ దాడులు రైల్వే ప్రయాణికులు, సిబ్బంది భద్రతపై ఆందోళనను మరింతగా పెంచుతున్నాయి.

## ఇక '1800'పై బీజేపీ గురి!

**న్యూఢిల్లీ:**బీజేపీ.. ఇటీవల బిహార్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక సీట్లు గెలిచి అతిపెద్ద పార్టీగా అవతరించింది. ఈ ఎన్నికల్లో ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు 202 సీట్లు గెలుచుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి సిద్ధం కాగా, అందులో బీజేపీ 89 సీట్లతో దుమ్ములేపింది.ఇక మరో ఎన్డీఏ పక్షం జేడీయూ 85 సీట్లను సాధించి.. బీజేపీ కంటే వెనుకబడింది. దాంతో బిహార్‌లో బీజేపీ ప్రతిష్ట మరింత పెరిగింది.ఇదిలా ఉంచితే, 2004 నాటికి బీజేపీ ఓవరాల్ ఎమ్మెల్యేల సంఖ్య 1035 ఉండగా, నేటికి ఆ సంఖ్య మరింత ముందుకెళ్లింది. 2025 నాటికి బీజేపీ ఎమ్మెల్యేల సంఖ్య 1654గా ఉంది.ఈ విషయాన్నే బీజేపీ ఐటీ సెల్ కన్వీనర్ అమిత్ మాలవీయ హైలైట్ చేశారు. సోమవారం(నవంబర్ 17వ తేదీ) దేశవ్యాప్త అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ ఎలా తన ఉనికిని కాపాడుకుంటూ ముందుకెళుతుందనే విషయాన్ని ఆయన వెల్లడించారు. తాము ప్రస్తుతానికి సాధించిన సంఖ్య ఏదైతే ఉందో అది బీజేపీ రాజకీయ చరిత్రలో అత్యధికమన్నారు.

## అంతా ఐదు నిమిషాల్లో జరిగిపోయింది!

దేశ రాజధానిలో జరిగిన ఒక అనూహ్య సంఘటన. ఐదేళ్ల పసివాడి అమాయకపు చేష్ట అతడి ప్రాణాలను బలితీసుకుంది. ఢిల్లీ శివార్లలోని గురుగ్రామ్ సెక్టార్ 62లోని హైరైజ్ అపార్ట్‌మెంట్‌లోని 22వ అంతస్తులో ఒక కుటుంబం నివసిస్తోంది. దంపతులు, ఐదేళ్ల కుర్రాడు ఉంటున్నారు దీంట్లో. శనివారం సాయంత్రం ఈ కుర్రాడు, పని మనిషితో కలిసి పార్కుకు వెళాడు. ఇద్దరూ తిరిగివచ్చారు. అయితే.. ముందుగా ఇంటి లోపలికి వెళ్లిన ఆ కుర్రాడు.. ధబాలున తలుపు మూసేశాడు. అంతే..అప్పటివరకు తెరుచుకుని ఉన్న డిజిటల్ లాక్ కాస్తా పడిపోయింది. తల్లిదండ్రుల పాస్‌కోడ్‌తో మాత్రమే తెరచుకుని డిజిటల్ లాక్ అది. ఇద్దరూ సాయంత్రం ఇంటికి వచ్చిన తరువాత లాక్ చేసేవారు. మిగిలిన సమయమంతా పూర్తిగా లాక్ కాకుండా ఉంటుంది. దగ్గరగా వేస్తే తలుపు వేసినట్టుగానే ఉంటుంది. గట్టిగా వేయడంతో లాక్ పడిపోయింది. లోపల కుర్రాడు ఒక్కడే ఉండిపోయాడు. పని మనిషి గట్టిగా అరుస్తోంది... పిలుస్తోంది. కానీ పిల్లాడి నుంచి స్పందన నిల్. దీంతో గాభరపడ్డ ఆ పనిమనిషి కుర్రాడి తల్లిదండ్రులకు ఫోన్ చేసింది. ఈ లోపు...ఇంట్లో ఉన్న కుర్రాడికి ఏమవుతోందో అర్థం కాలేదు. వెనుకనే పని మనిషి ఇంట్లోకి రాలేదు. ఇల్లంతా ఖాళీ. తీద్దామంటే తలుపు తెరుచుకోవడం లేదు. కాసేపు ఇల్లంతా కలియదిరిగాడు. పక్కింటి వాళ్లను పిలుద్దామనుకున్నాడో ఏమో... బాల్కనీలోకి వచ్చాడు. ఎవరో ఒకరు కనపడకపోతారా అనుకుని రెయిలింగ్‌పైకి ఎక్కాడు. సాయం కోసం అరుద్దామని అనుకున్నాడు. కానీ.. కాలు జారింది. 22వ అంతస్తు నుంచి పడిపోయాడు. క్షణాల్లో రక్తపు మడుగులో పడి ఉన్న ఆ కుర్రాడిని అటుగా వెళుతున్న ఓ వ్యక్తి గుర్తించి ఆసుపత్రికి తీసుకెళ్లాడు. కానీ.. అప్పటికే ఆ పసివాడి ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోయాయి.

# తొలి నెయ్యాభిషేకం రాష్ట్రపతిదే

### ఆదివారం తలుపులు తెరచుకున్న శబరిమల ఆలయం



**పథనంతిట్ట:** మండల సీజన్‌లో భాగంగా ఆదివారం శబరి ఆలయం తలుపులు తెరుచుకోగా.. సోమవారం ఉదయం నుంచి నెయ్యాభిషేకాలు ప్రారంభమయ్యా యి. అయితే.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేరిట సోమవారం ఉదయం తొలి నెయ్యాభిషేకం జరిగింది.అదేంటి? ఇరుముడిలోని ముద్ర టెంకా యల్లో ఉండే నేతినే కదా అభిషేకం చేయాల్సింది గత నెల ముర్ము వస్తే.. ఇప్పుడు అభిషేకం ఎలా జరిగిందనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నా.. అందుకు కారణముందని ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు(టీడీబీ) అధికారులు చెబుతున్నారు.శబరిమల సన్నిధానంలో ఉదయం 7 నుంచి 11 గంటల వరకు నెయ్యాభిషేకాలు జరుగుతాయి. అయితే.. అక్టోబరు నెలలో 22వ తేదీ వరకు సన్నిధానం ఓపెన్ ఉంది. రాష్ట్రపతి ముర్ము సరిగ్గా అక్టోబరు 22న శబరిమలను దర్శించుకున్నారు. అప్పటికే నెయ్యాభిషేకం సమయం దాటిపోయింది. దాంతో ప్రధాన తంత్రి/మేల్‌శాంతి ఆమె ఇరుముడిని భద్రపరిచారు. మండల సీజన్ కోసం ఆదివారం శబరిమల ఆలయం తిరిగి తెరుచుకోగా.. సోమవారం ఉదయం నుంచి నెయ్యాభిషేకాలు మొదలయ్యాయి. దీంతో.. ముర్ము ఇరుముడిలోని ముద్ర టెంకాయలోని నేతితో తొలుత అయ్యప్పకు అభిషేకం చేశారు. అలా.. మండల సీజన్‌లో తొలి నెయ్యాభిషేకం రాష్ట్రపతి ముర్ము చేయించినట్లయిందని టీడీబీ అధికారులు చెబుతున్నారు.

**శబరిమలలో భారీ వర్షాలు..**
తిరువనంతపురం: శబరిమలలో ఇవాళ, రేపు భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. కొట్టాయం, ఇడుక్కి, అలప్పుజా, పతనంతిట్ట, కొల్లాం, తిరువనంతపురం జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది.ఈ నేపథ్యంలో వాతావరణ శాఖ శబరిమల యాత్ర ప్రాంతంతో సహా మొత్తం ఆరు ఇతర జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది.నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావమే ఈ భారీ వర్షాలకి కారణం అని వాతావరణ శాఖ తెలిపింది. అందువల్ల ఈ రోజు, రేపు శబరిమల సన్నిధానం, పంప, నీలక్కల్ తదితర ప్రాంతాల్లో ఉరుములతో కూడిన భారీ వర్షం పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.సన్నిధానం, పంబా, నీలక్కల్‌లలో ఇవాళ, రేపు 7 సెం.మీ నుంచి 11 సెం.మీ వరకు వర్షం పడే అవకాశం ఉంది.అలర్ట్ జారీ చేయబడిన జిల్లాల్లో 24 గంటల్లో 64.5 మిమీ నుంచి 115.5 మిమీ వరకు భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.అయ్యప్ప భక్తులకు భద్రతా సూచనలు భారీ వర్ష హెచ్చరిక నేపథ్యంలో రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ యాత్రికులకు ప్రత్యేక హెచ్చరిక సూచనలు జారీ చేసింది.కొండచరియలు విరిగిపడటం, బురదజల్లులు, పర్వత వరదలకు గురయ్యే ప్రాంతాలలో నివసించేవారు, అలాగే నదుల వెంబడి, ఆనకట్టల దిగువన నివసించేవారు అధికారుల సూచనల మేరకు వెంటనే సురక్షిత ప్రదేశాలకు తరలివెళ్లాలని విపత్తు నిర్వహణ అథారిటీ సూచించింది.విపత్తు సంభవించే ప్రాంతాల్లో నివసించేవారు పగటిపూట సమీపంలోని సహాయ శిబిరాలకు తరలి వెళ్లాలి. వాటి సమాచారం కోసం ప్రజలు స్థానిక స్వపరిపాలన, రెవెన్యూ అధికారులను సంప్రదించవచ్చు. బలమైన గాలులు వీచే అవకాశం ఉన్నందున, భద్రత లేని ఇళ్లు లేదా బలహీనమైన పైకప్పులు ఉన్న ఇళ్లలో నివసించేవారు చాలా జాగ్రత్తగా ఉండాలి.వర్షపు రోజుల్లో అనవసరమైన ప్రయాణాలు, పర్వతారోహణను నివారించాలి.శబరిమల దర్శనానికి వచ్చే భక్తులు వాతావరణ సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలి. అలాగే భద్రతాధికారుల సూచనల మేరకు ప్రయాణాన్ని కొనసాగించాల్సి ఉందన స్పష్టం చేసింది కేరళ రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ.



## నీటినిల్వతో పంటలు మునక..

ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో నీటిని నిలువ చేస్తుండడంతో బ్యాక్ వాటర్ ద్వారా పంట పొలాల్లోకి వచ్చి చేరి చేతికొచ్చినా పంటలు నీట మునుగుతున్నాయి. వేములవాడ మండలం అనుపురం గ్రామంలోని రైతులకు చెందిన వరి,పత్తి పొలాల్లోకి నీరు చేరడంతో పంట కోతకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పత్తి ఏరడానికి కూలీలు రావడంలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. గత మూడేళ్లుగా పంట పొలాల్లోకి బ్యాక్ వాటర్ వస్తుందని చర్యలు చేపట్టాలని కోరిన అధికారులను స్పందన లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

# బ్యాక్ వాటర్‌తో రైతుల బెంబేలు

## నీట మునుగుతున్న పంటలు పట్టించుకోని అధికారులు

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి నవంబర్ 17 (జనంసాక్షి) :** మిడ్ మానేరు ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో రైతుల పంట పొలాలు మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏటా పంట పొలాల్లోకి నీరు వచ్చి పంటలు మునుగుతున్నప్పటికీ సంబంధిత మధ్య మానేరు ఇంజనీరింగ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. బోయినపల్లి మండలం మాన్వాడ వద్ద మధ్య మానేరు ప్రాజెక్టును 27.55 టీఎంసీల కెపాసిటీతో నిర్మించారు. ప్రాజెక్టు నిర్మాణంలో బోయినపల్లి మండలంలోని కొదురుపాక, నీలోజిపల్లి, వరద వెల్లి, షాబాష్ పల్లి, వేములవాడ మండలంలోని సంకేపల్లి, రుద్రవరం, అనుపురం, కోదు ముంజ, తంగళ్ళపల్లి మండలంలోని చీర్లవంచ, చింతల్టన, ఇల్లంతకుంట మండలం కందికట్కూరు, అనుబంధ గ్రామం గుర్రం వానిపల్లి ముంపునకు గురయ్యాయి. జలాశయ నిర్మాణం కోసం ముంపు గ్రామాలతో పాటు సమీప గ్రామాల్లోని రైతుల నుంచి వ్యవసాయ భూములను ఒక్కో ఎకరానికి రూ 2.10 లక్షల పరిహారం చెల్లించి సేకరించారు. పట్టా భూములతో పాటు అసైన్డ్ ప్రభుత్వ భూములను సేకరించారు. కొంతమంది రైతులకు ప్రాజెక్ట్‌లో భూముల ముంపుకు గురికాగా మరికొంత వ్యవసాయ భూములు మిగిలి ఉన్నాయి. ఈ క్రమంలో పంటలు సాగు చేసుకుంటూ రైతులు జీవనోపాధి పొందుతున్నారు.

**ముంపు భూముల్లో పంటల సాగుతో...**

జలాశయంలో బ్యాక్ వాటర్ తగ్గిన సమయంలో కొందరు రైతులు ముంపు



భూములను చదను చేసుకొని మట్టి పోసి పంటల సాగు చేయడంతో బ్యాక్ వాటర్ ముంపునకు గురికాని పంట పొలాల్లోకి వచ్చి చేరుతుందంటున్నారు. గతంలోనూ వరద కాలువ కొరకు మట్టిని కాంట్రాక్టర్ మట్టిని జనాశయంలో పోశాదన్న ఆరోపణలు ఉన్నాయి. మధ్య మానేరు ఇంజనీరింగ్ అధికారులు ముంపునకు గురికాని భూములలోకి నీరు రాకుండా తమ పంట పొలాలలో మట్టిపోసి ఎత్తి పెంచుకోవాలని సూచిస్తున్నారు. ప్రాజెక్టు కెపాసిటీకి లెవల్‌కు భూములు తక్కువ ఎత్తులో ఉండటం వలన రైతుల పంట పొలాలలోకి నీరు చేరుతుందని అధికారులు చెప్పడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్ట్ నిర్మాణ సమయంలోనే ముంపునకు సంబంధించిన భూములతో పాటు ఎక్కువగా భూసేకరణ చేసిన అధికారులు ప్రస్తుతం ఈ విధంగా చెప్పడంతో రైతులు యిబ్బందులు పడుతున్నారు.

# హౌసింగ్ బోర్డ్ కాలనీకి మిషన్ భగీరథ వాటర్ కనెక్షన్ ఇవ్వాలి



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 17 (జనం సాక్షి) :** కామారెడ్డి పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీ, బృందావన్ కాలనీ, కౌండిన్య కాలనీ, జి ఆర్ కాలనీలకు మిషన్ భగీరథ ద్వారా మంచినీటి సౌకర్యం కల్పించాలని భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు సిపిఎం పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మాజీ మున్సిపల్ కౌన్సిలర్ రేణుక మాట్లాడుతూ హౌసింగ్ బోర్డ్ కాలనీ,బృందావన్ కాలనీ, కౌండిన్య కాలనీ, జి ఆర్ కాలనీలకు మిషన్ భగీరథ మంచినీటి సౌకర్యం లేకపోవడం వల్ల బోరు నుండి వచ్చే ఫ్లోరైడ్ వాటర్ తాగడం వల్ల అక్కడి ప్రజలు తీవ్ర అనారోగ్యాల పాలవుతున్నారని అన్నారు. అదేవిధంగా బోరు నుండి వచ్చే నీరు అపరిశుభ్రంగా ఫ్లోరైడ్ శాతం ఎక్కువ ఉండడం వల్ల పక్షవాతం జుట్టు రాలిపోవడం ఇన్ఫెక్షన్లు వచ్చి అక్కడి ప్రజలు రోగాల పాలవుతున్నారని, కావున వెంటనే మిషన్ భగీరథ ద్వారా కనెక్షన్ అందించి మంచినీటి సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ జిల్లా కమిటీ సభ్యులు ముదాం అరుణ్, కే సత్యం, తదితరులు పాల్గొన్నారు.



# 17 నుండి పత్తి కొనుగోళ్లు బంద్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (జనం సాక్షి) :** కామారెడ్డి జిల్లాలోని మార్కెట్ యార్డుల్లో నవంబర్ 17 నుంచి పత్తి కొనుగోళ్లను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.సీసీఐ అమలు చేస్తున్న ఎల్1, ఎల్2, ఎల్3 నిబంధనల కారణంగా కాటన్ కమిషన్ అసోసియేషన్ రాష్ట్రవ్యాప్తంగా పత్తి కొనుగోళ్లను నిలిపివేయాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో, జిల్లా అసోసియేషన్ కొనుగోళ్లకు ముందుకు రాకపోవడంతో, కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు తెలిపారు రైతులు ఈ విషయాన్ని గమనించి, తదుపరి ప్రకటన వచ్చేవరకు తమ పత్తిని జిన్నింగ్ మిల్లులకు సెంటర్ కి తీసుకురావద్దని అధికారులు సూచించారు.

# ప్రజావాణి ఫిర్యాదులపై అధికారులు తక్షణమే స్పందించాలి

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 17 (జనం సాక్షి) :** ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్ అదనపు కలెక్టర్ లు విక్టర్, మదన్ మోహన్, డిప్యూటి ట్రైనీ కలెక్టర్ రవితేజ వివిధ మండలాల నుండి వచ్చిన దరఖాస్తుదారుల నుండి ఫిర్యాదులను స్వీకరించి, సంబంధిత అధికారులకు ఇస్తూ తక్షణమే స్పందించి పరిష్కరించాలని ఆన్నారు. ఈ సందర్భంగా ప్రజావాణి లో ఎక్కువగా ఇందిరమ్మ ఇళ్ల పథకంనకు సంబంధించి వివిధ రకాల సమస్యల పై అర్జీలను స్వీకరించి అర్జీదారుని యొక్క సమస్యలను వెంటనే పరిష్కరించి ఇళ్ల నిర్మాణాలకు తగు చర్యలు తీసుకోవాలని ఆన్నారు ఆయా శాఖలకు సంబంధించిన దరఖాస్తులు విద్యా, వైద్యం, మిషన్ భగీరథ, విద్యుత్, డి డబ్ల్యు ఓ, ఆర్టీసీ, భూభారతి, రెవెన్యు కు సంబంధించిన వివిధ రకాల దరఖాస్తులను కలెక్టర్ స్వీకరించి సమస్య పరిష్కారానికి సంబంధిత అధికారులకు అందించి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా తహసిల్దార్లతో మాట్లాడుతూ భూభారతీ, రెవెన్యు సదస్సులకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను త్వరగా పూర్తి చేయాలని,అలాగే ఆయా మండలాల తహసీల్దార్లు వరి



కొనుగోలు కేంద్రాలను ప్రతీ రోజు పర్యవేక్షించి, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రజావాణికి 87 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈ ప్రజావాణిలో ఆయా శాఖలకు సంబంధించిన జిల్లా అధికారులు, రెవెన్యు సిబ్బంది పాల్గొన్నారు.

# సెంట్రింగ్ యూనిట్ల లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో భాగస్వాములు కావాలి



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (జనం సాక్షి) :** సెంట్రింగ్ యూనిట్ల లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ ఆశిస్ సంగ్వాన్ అన్నారు. ఈ సందర్భంగా 32 మంది లబ్ధిదారులకు శిక్షణ సర్టిఫికేట్లు అందజేశారు. యూనిట్‌ల స్థాపనకు ఆర్థిక సబ్సిడీ సహాయంపై శాఖలకు సూచనలు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సెంట్రింగ్ యూనిట్లు ఏర్పాటు చేసుకోవడానికి శిక్షణ పొందిన 32 మంది లబ్ధిదారులకు జిల్లా కలెక్టర్ అశిష్ సాంగ్వాన్ సోమవారం కలెక్టరేట్ లో సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన లబ్ధిదారులు శిక్షణ పూర్తి చేయడం ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు పొందేందుకు ముందడుగు వేశారు.సర్టిఫికేట్ల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో శిక్షణ పొందిన లబ్ధిదారులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం కావడానికి సెంట్రింగ్ సేవలు అత్యంత అవసరమని, శిక్షణ పొందిన మీరు ఈ నిర్మాణ కార్యాచరణలో భాగస్వాములు కావాలన్నారు ఇది మీ ఉపాధికి మాత్రమే కాదు, జిల్లా గృహ నిర్మాణ పురోగతికి కూడా తోడ్పడుతుందని ఆయన పేర్కొన్నారు. అలాగే లబ్ధిదారులు తమ యూనిట్లను ఏర్పాటు చేసుకోవడానికి అవసరమైన ఆర్థిక సహాయం, సబ్సిడీలు అందించేందుకు పరిశ్రమల శాఖ, బ్యాంకులు, డిఆర్‌డిఏ మధ్య సమన్వయం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అందుకు అవసరమైన సహకారాన్ని డిఆర్‌డిఏ అధికారులు వెంటనే అందించాలన్నారు.కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్, లీడ్ బ్యాంక్ మేనేజర్, పరిశ్రమల శాఖ అధికారులు, అదనపు డి ఆర్ డి ఓ విజయలక్ష్మి, డిపిఎం సాయిలు, ఏపీఎం రాజేందర్, అలాగే లబ్ధిదారులు పాల్గొన్నారు.

# అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో ఘనంగా ఓరిసన్ కార్యక్రమం



**కరీంనగర్, నవంబర్ 17 (జనంసాక్షి) :** విద్యార్థులకు ప్రాథమిక దశ నుండే వివిధ అంశాల పట్ల సమగ్ర అవగాహన కల్పించాలని వాటిలో నైపుణ్యం పొందే విధంగా చేయూతనివ్వాలని తద్వారా మన సమాజంలో చాలా గొప్పగా ఉంటారని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక భగత్ నగర్ లోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో సృజనాత్మకంగా నిర్వహించినటువంటి "ఒరిస్సన్" కార్యక్రమం ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని, అంశాలలో పట్టు సాధించే విధంగా సమగ్ర సమాచారం ఇవ్వాలని సూచిస్తూ విద్యార్థుల్లో దాగిన ప్రతిభను వెలికి తీయడానికి వార్షిక ప్రణాళికలో భాగంగా విద్యార్థులకు అనేక రకమైన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతున్నదని, వాటిలో పాల్గొనేందుకు ప్రోత్సాహం తో పాటు ప్రశంస పత్రాలను అందిస్తున్నామని వారు చెప్పారు. విద్యార్థులకు తరగతి గదిలోని విషయాలను చాలా చక్కగా వర్ణించాలని, పట్టు సాధింపచేయాలని వారు సూచించారు.ప్రధానంగా తల్లిదండ్రులు వారి పిల్లలకు ఇష్టమైన రంగాలలో శిక్షణ ఇప్పించాలని, వనరులను కల్పించి ఎప్పటికప్పుడు పరిశీలించి సమన్వయంతో వారి పిల్లలని ఉత్తమంగా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో చాలా చక్కగా ఆలయాల ప్రాముఖ్యత, న్యూట్రిషన్ విశిష్టత, సాంస్కృతిక వైభవం, ఆరోగ్యకరమైన అనారోగ్యమైన ఆహారం, మొబైల్ అవేర్నెస్, అల్ఫోర్స్ కైండ్నెస్ వాల్ అల్ఫోర్స్ ట్రైన్, జంక్ ఫుడ్ నష్టాలు, హెల్తీ ఫుడ్ ప్రభావాలు తదితర అంశాల పట్ల చాలా చక్కటి అవగాహన కల్పించామని, వివిధ రకాల వస్తువులతో క్యాంపస్ ను చక్కగా అలంకరించారని తెలి పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వరకట్న వేధింపులకు ఏడు నెలల గర్భిణి ఆత్మహత్య

- అడిగిన కట్నం ఇచ్చినా... మోటార్‌సైకిల్ పేరుతో వేధింపులు
- భర్త, అత్తమామలపై హత్య కేసు నమోదు
- ఇల్లందకుంట పోలీసుల దర్యాప్తు ప్రారంభం
- కుటుంబంలో తీవ్ర విషాదం



**జమ్మికుంట, నవంబర్ 17 (జనం సాక్షి):** వరకట్న ఆశతో భర్త, అత్తమామలు చేసిన నిరంతర మానసిక-శారీరక వేధింపులకు తాళలేక ఏడు నెలల గర్భిణి యువతి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న దారుణ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఘనపూర్ మండలం బుద్ధారం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది.

మృతురాలు మల్లెబోయిన మౌనిక (20). గత ఏడాది డిసెంబరు 22న ఇల్లందకుంట మండలం శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన మంత్రి ఉమా, కీర్తిశేషులు కుమార్ దంపతుల రెండో కూతురు మౌనికను బుద్ధారం గ్రామానికి చెందిన మల్లెబోయిన ప్రశాంత్ (26, తండ్రి సంపత్)కు వివాహం జరిపించారు. వివాహ సమయంలో వరుడి వైపు నుంచి అడిగిన కట్నం మేరకు రూ.8 లక్షల నగదు, రెండు గుంటల ఇంటి స్థలం, 2 తులాల బంగారం, ఇతర గృహోపకరణాలు ఇచ్చినట్లు కుటుంబం తెలిపింది. అయినప్పటికీ వివాహం తర్వాత భర్త ప్రశాంత్, అత్త నరసమ్మ, మామ సంపత్‌లు మోటార్‌సైకిల్ పేరుతో అదనంగా వరకట్నం డిమాండ్ చేస్తూ మౌనికను నిరంతరం శారీరకంగా, మానసికంగా వేధించినట్లు ఆమె తల్లి మంత్రి ఉమా ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వేధింపులను భరించలేక సోమవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో మౌనిక ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె ఏడు నెలల గర్భవతి కావడంతో కుటుంబంలో తీవ్ర విషాదం నింపింది.

మృతురాలి తల్లి మంత్రి ఉమా ఇల్లందకుంట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు భర్త ప్రశాంత్, అత్త నరసమ్మ, మామ సంపత్‌లపై వరకట్న వేధింపులు, హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. "ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశాం. దర్యాప్తు కొనసాగుతోంది" అని ఇల్లందకుంట ఎస్సై కాంత్ కుమార్ తెలిపారు.

# పల్లెల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

## ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**గంగాధర,నవంబర్ 17 (జనం సాక్షి) :** మండలంలోని ఆయా గ్రామాలలో రూ.1.15 కోట్ల అభివృద్ధి పనులను సోమవారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభించారు,అనంతరం మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతిపల్లెను అభివృద్ధి చేయడానికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. మండలంలోని గట్టుభూత్కూర్ రూ.20 లక్షలు,గంగాధరలో రూ. 20 లక్షలతో నిర్మిస్తున్న ఆరోగ్య ఉప కేంద్రాల భవన నిర్మాణానికి,వెంకంపల్లిలో రూ. 20లక్షలతో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి, రూ.5 లక్షలతో గంగాధర ప్రెస్ క్లబ్ భవన నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. గంగాధరలో రూ.44 లక్షలతో,మధురానగర్‌లో రూ.11 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను,రూ.11 లక్షలతో మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహం మరమ్మత్తు పనులను,మండల కేంద్రంలో రూ.5 లక్షలతో నిర్మించిన సబ్ డివిజన్ కాంపౌండ్ వాల్,రూ.5 లక్షలతో నిర్మించిన బతుకమ్మ ఘాట్,రూ.5 లక్షలతో అంబేద్కర్ సంఘ భవనంలోని సీసీ ప్లాట్ ఫామ్ ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని పల్లెల అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు.చొప్పదండి నియోజకవర్గంలోని ప్రతి పల్లెను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రానికి రోల్ మోడల్ గా తీర్చిదిద్దుతామన్నారు.చొప్పదండి నియోజకవర్గం లో ఇప్పటికే ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంజూరు చేయించినట్లు తెలిపారు. నారాయణపూర్ రిజర్వాయర్ కింద ముంపునకు గురవుతున్న భూములు ఇండ్లకు సంబంధించి నిర్వాసితులకు రూ.23.50 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. చొప్పదండి నియోజకవర్గం ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయనని, రానున్న రోజుల్లో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో నిలుపుతామన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ సంక్షేమ ప్రజల్లో ప్రచారం చేయాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించే దిశగా పనిచేయాలని సూచించారు.పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపునిచ్చి కాపాడుకుంటామని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో గంగాధర మార్కెట్ కమిటీ చైర్మన్ జాగిరపు రజిత శ్రీనివాస్ రెడ్డి,సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తీర్మల్ రావు,ఎంపిడిఓ దమ్మని రాము, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తోట కరుణాకర్,సింగిల్ విండో వైస్ చైర్మన్ వేముల భాస్కర్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భుచ్చన్న,రామిడి రాజిరెడ్డి,పడాల రాజన్న,తాళ్ళ శ్రీనివాస్,గంగాధర ప్రవీణ్,తాళ్ళ సురేష్,భూర్గు గంగన్న,రాజగోపాల్ రెడ్డి,దోర్నాల శ్రీనివాస్ రెడ్డి,సత్తు కనుకయ్య,పడితపల్లి కిషన్,తోట సంధ్య ,వేముల అంజి,రోమాల రమేష్,బాపు రెడ్డి,మేర్జ కొండయ్య,కోలేపాక స్వామి,గరిగంటి కరుణాకర్,దీకొండ మధు,కొల ప్రభాకర్,మ్యాక వినోద్,మంత్రి మహేందర్,తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక లోక్ అదాలత్ ద్వారా 1280 కేసులు పరిష్కారం

## కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం

**కరీంనగర్ జిల్లా బ్యూరో, నవంబర్ 17 (జనంసాక్షి):** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిర్వహించిన ప్రత్యేక లోక్ అదాలత్ కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని, ఈ అదాలత్ ద్వారా మొత్తం 1280 కేసులను సామరస్యంగా పరిష్కరించడం జరిగిందని కరీంనగర్ పోలీస్ కమిషనర్ (సీపీ) గౌష్ ఆలం తెలిపారు. ఈ సందర్భంగా సీపీ కేసుల పరిష్కారం వివరాలను వెల్లడించారు. ఎఫ్ఐఆర్ కేసులు 257, ఈ-పెట్టి కేసులు 23, డ్రంకెన్ అండ్ డ్రైవ్, మోటార్ వెహికల్ చట్టం కేసులు 1008, సైబర్ కేసులు 57.

**సైబర్ కేసుల్లో రూ.51.39 లక్షల రిఫండ్‌కు కోర్టు ఉత్తర్వులు**

పరిష్కరించబడిన 57 సైబర్ క్రైమ్ కేసుల ద్వారా బాధితులకు సంబంధించిన వివిధ బ్యాంక్ ఖాతాలలో నిలుపుదల చేసిన మొత్తం రూ.51,39,568 (యాభై ఒక్క లక్షల ముప్పై తొమ్మిది వేల ఐదు వందల అరవై ఎనిమిది రూపాయలు) రిఫండ్ మొత్తాన్ని తిరిగి బాధితులకు అందజేయాలని కోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని సీపీ తెలిపారు. రాజీ మార్గం రాజ మార్గమని, లోక్ అదాలత్ ద్వారా ఇరు వర్గాలకు న్యాయం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. కేసుల పరిష్కారానికి కృషి చేసిన పోలీస్ అధికారులను, కోర్టు డ్యూటీ అధికారులను ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ అభినందించారు.



# కరీంనగర్ స్టూడెంట్స్ క్లబ్‌లు: రాష్ట్రానికే ఆదర్శం!

- క్లబ్‌లతో విద్యార్థుల సర్వాంగాభివృద్ధి
- రాష్ట్రవ్యాప్తంగా అమలుకు సిఫారసు
- సైకిళ్లు, పరీక్ష ఫీజు, గ్యాస్ కనెక్షన్ల పంపిణీ
- కలెక్టర్ కృషికి కేంద్రమంత్రి ప్రశంసలు

**కరీంనగర్, నవంబర్ 17 (జనం సాక్షి) :** కరీంనగర్ జిల్లా ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న స్టూడెంట్స్ క్లబ్ విధానం రాష్ట్రానికే స్ఫూర్తిదాయకమని, దీన్ని రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో తప్పనిసరిగా అమలు చేయాల్సిందిగా ముఖ్యమంత్రికి లేఖ రాస్తానని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రకటించారు. సోమవారం కరీంనగర్‌లోని కళాభారతి ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... జిల్లాలోని 172 ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన స్నేహిత, ఈకో, స్పోర్ట్స్, కాన్షియస్‌నెస్, లిటరరీ లాంతర్న్ అనే ఐదు రకాల స్టూడెంట్స్ క్లబ్‌లలో సభ్యులైన 2,566 మంది విద్యార్థులకు ప్రత్యేక టీ-షర్టులు, బ్యాడ్జీలు పంచిపెట్టారు. ఈ క్లబ్‌ల వల్ల విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, ప్రశ్నించే స్వభావం, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లే ధైర్యం పెరుగుతాయని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకునే అవకాశం కలుగుతుందని ఆయన కొనియాడారు.

ఈకో క్లబ్ ద్వారా వ్యవసాయం, అనుబంధ రంగాలు, మార్కెటింగ్‌పై అవగాహన, స్పోర్ట్స్ క్లబ్ ద్వారా క్రీడల్లో రాణింపు, కాన్షియస్‌నెస్ క్లబ్ ద్వారా డ్రగ్స్ నిరోధం, స్నేహిత క్లబ్ ద్వారా బాలికల సంరక్షణ,




లిటరరీ లాంతర్న్ క్లబ్ ద్వారా భాషా నైపుణ్యం సాధించే అవకాశం లభిస్తోందని మంత్రి ప్రశంసించారు. ఈ విధానం రాష్ట్రమంతటా అమలయితే ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతమవుతాయని, డ్రాపౌట్స్ గణనీయంగా తగ్గుతాయని అన్నారు.

విద్యారంగ అభివృద్ధికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి చూపిన చొరవను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన స్వయంగా పలు హామీలు ఇచ్చారు. ప్రతి ఏటా 9వ తరగతి విద్యార్థులకు ఉచిత సైకిళ్లు అందజేస్తానని, 10వ తరగతి పరీక్ష ఫీజు తానే చెల్లిస్తానని, జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు గ్యాస్ స్టవ్‌లు, కుక్కర్లు అందేలా చూస్తానని ప్రకటించారు. ఇప్పటికే 578 పాఠశాలలకు గ్యాస్ కనెక్షన్లు అందాయని, మరిన్ని సీఎస్ఆర్ నిధులు తెచ్చి విద్యా-వైద్య రంగాల అభివృద్ధికి వినియోగిస్తానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో మాట్లాడిన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి... ప్రతి క్లబ్‌కు ప్రత్యేక బాధ్యతలు ఉన్నాయని, వీటి ద్వారా విద్యార్థులు సమగ్ర అభివృద్ధి సాధిస్తున్నారని తెలిపారు. లిటరరీ లాంతర్న్ క్లబ్ వల్లే జిల్లాకు చెందిన 14 మంది విద్యార్థులు న్యూయార్క్‌లో జరిగిన టెడ్ టాక్స్‌లో పాల్గొన్నారని గుర్తు చేశారు.

పట్టభద్రుల శాసనమండలి సభ్యులు చిన్నమైల్ అంజిరెడ్డి, ఉపాధ్యాయ శాసనమండలి సభ్యులు మల్కా కొమురయ్య మాట్లాడుతూ... ఈ ఐదు క్లబ్‌లను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు చదువులోనూ, క్రీడల్లోనూ, ఇతర రంగాల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఈవో మొండయ్య, విద్యాశాఖ కోఆర్డినేటర్లు మిల్కూరి శ్రీనివాస్, అశోక్ రెడ్డి, కుప్పారాణి పాల్గొన్నారు.



# పక్కదారి పడుతున్న సబ్సిడీ గ్యాస్

## పట్టించుకోని ఏజెన్సీలు.. ఎన్ ఫోర్స్ మెంట్ చర్యలు నిల్

- వ్యాపార అవసరాల కోసం ప్రభుత్వ సబ్సిడీ సిలిండర్లు
- ప్రభుత్వ ఆదాయానికి గండి



**మహబూబ్ నగర్ బ్యూరో, నవంబర్ 17 (జనంసాక్షి) :** గృహావసరాల కోసం వినియోగించే సబ్సిడీ డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు మహబూబ్‌నగర్ జిల్లాలో యథేచ్ఛగా పక్కదారి పడుతున్నాయి. నిబంధనల కు విరుద్ధంగా వీటిని హెూటళ్లు, రెస్టారెంట్లు, ప్రైవేట్ హాస్టళ్లు, ఆసుపత్రులు వంటి వాణిజ్య సంస్థలు విరివిగా వినియోగిస్తున్నాయి. కమర్షియల్ సిలిండర్ల కంటే తక్కువ ధర ఉండటంతో జరుగుతున్న ఈ దుర్వినియోగం కారణంగా ప్రభుత్వ ఆదాయానికి ప్రతిఏటా కోట్లాది రూపాయల గండిపడుతున్నా.. దీనిని అరికట్టాల్సిన పౌరసరఫరాల శాఖ ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ అక్రమాలు గణనీయంగా పెరిగిపోతున్నాయి. మహబూబ్ నగర్ జిల్లా సివిల్ సప్లై అధికారుల అలసత్వం, 'డోంట్ కేర్' వైఖరి కారణంగా వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

### డీయస్ఓ నిర్లక్ష్యం

జిల్లాలో కమర్షియల్ గ్యాస్ సిలిండర్లు వినియోగించాల్సిన చోట డొమెస్టిక్ సిలిండర్ల వినియోగం ప్రభుత్వ ఆదాయానికి భారీ గండికొడుతోంది. డొమెస్టిక్ సిలిండర్ల కంటే కమర్షియల్ సిలిండర్ ధర రెట్టింపు ఉండడంతో, ప్రతినిత్యం రెస్టారెంట్లలో డొమెస్టిక్ సిలిండర్లు వాడటం ద్వారా ఒక్కో రెస్టారెంట్‌కు రోజుకు సుమారు రూ. 10 వేల లాభం చేకూరుతోంది. ఈ సగటున లెక్కిస్తే, ఒక్క రెస్టారెంట్ కు ఏడాదికి రూ.30 లక్షల వరకు అదనంగా లాభం వస్తోంది. ఇదే తీరులో జిల్లాలోని అన్ని రెస్టారెంట్లు, హెూటళ్లు, ప్రైవేట్ హాస్టల్ లో లెక్కేస్తే ప్రభుత్వ రాబడికి కోట్లాది రూపాయల నష్టం జరుగు తోంది. కమర్షియల్ సిలిండర్లు విని యోగిస్తున్నారని తెలిసినా డిస్ట్రిక్ట్ సివిల్ సప్లై ఆఫీసర్లు డీఎస్ఓ ఏమా త్రం పట్టించుపోవడం ఇప్పుడు మహబూబ్ నగర్ జిల్లా వ్యాపారస్తులకు వరంగా మారింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ 'సైలెంట్'.. ఏజెన్సీల దందా వ్యాపారసంస్థలు వారి అవసరాల కోసం డొమెస్టిక్ సిలిండ ర్లను విరివిగా వాడుతున్నా, నిబంధన లకు విరుద్ధంగా హెూటళ్లు, హాస్టళ్లలో వాడకం ప్రభుత్వ ఆదాయానికి ఏటా కోట్లాది రూపాయల నష్టం జరుగు తున్నా ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు శూన్యం. దీంతో డోంట్ కేర్ అంటున్న గ్యాస్ ఏజెన్సీలు. డీఎస్ఓ వైఖరిపైనా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నా యి. ప్రస్తుత పరిస్థితుల్లో వాటిని అరికట్టి కేసులు నమోదు చేయాల్సిన పౌర సరఫరాల శాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ పూర్తిగా సైలెంట్ శాఖ అయిపోయింది.

నిత్యం ప్రైవేట్ వాహనాలలో పదుల సంఖ్యలో సిలిండర్లను వ్యాపార సంస్థలకు యథేచ్ఛగా తరలిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. పౌరసరఫరాల శాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ పని చేయకపోవడం, అధికా రుల నిమ్మకు నీరెత్తిన వైఖరి కారణంగా గ్యాస్ ఏజెన్సీలు సైతం ఆడిందే ఆట పాడిందే పాట అన్న చందంగా తయారైంది. డొమెస్టిక్ సిలిండర్ల తరలింపును గ్యాస్ ఏజెన్సీలు భారీగానే సొమ్ము చేసుకుంటు న్నాయి. ఒక్కో సిలిండర్ కు రూ.200 నుంచి రూ.300లను అదనంగా వసూలు చేస్తున్నాయి. ఈ వ్యవహారం అంతా అధికారులకు తెలిసినా ఏమాత్రం చర్యలు తీసుకోకపోవడంతో డీఎస్ఓ వైఖరిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# ప్రేమ "బలి వెనుక" ఎన్ని మలుపులో..

- ఒకే కేసు "నాలుగు పోలీస్ స్టేషన్ల" చుట్టూ..
- రాజశేఖర్ హత్య వెనుక మలుపులు..
- విడిన మర్డర్ కేసు మిస్టరీ
- పలు సెక్షన్ల కింద కేసులు నమోదు..
- నిందితుల అరెస్టు రిమాండ్..





ఒకే సంఘటన ఇది... నాలుగు పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరిగింది ఇద్దరు ప్రేమికులు పారిపోయి పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగడం ప్రేమికుడు ప్రేమించిన యువకుడికి సోదరుడు కావడం ఇదే నేపథ్యంలో. సహకారం అందించాడని అతని కిడ్నాప్ హత్యోదంతం ఈ వ్యవహారమంతా సైబరాబాద్ పరిధిలోని మొదట మొయినాబాద్ పోలీస్ స్టేషన్ లో ప్రారంభమై నిజామాబాద్ మీదుగా మహబూబ్ నగర్ జిల్లా నవాబుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో డెడ్ బాడీ లభ్యమై షాద్ నగర్ పోలీస్ స్టేషన్ లో ముగిసింది అక్కడి నుంచి ఇక్కడిదాకా చోటు చేసుకున్న మలుపులు జరిగిన దారుణాన్ని ఒక్కసారి పరిశీలిస్తే.....

**(మిద్దెల సత్యనారాయణ) రంగారెడ్డి జిల్లా ప్రతినిధి:(జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా ఫరూఖ్ నగర్ మండలం ఎల్లంపల్లి గ్రామానికి చెందిన భవాని అనే యువతి అదే గ్రామానికి చెందిన ఎర్ర చంద్రశేఖర్ గత కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు వీరిద్దరూ పెళ్లి చేసుకోవాలని నిర్ణయించు కున్నారు ఈనెల 8వ తేదీన మొయినాబాద్ పరిధిలోని ఓ కళాశాలలో చదువుకుంటున్న భవాని ఎర్ర చంద్రశేఖర్ తో కలిసి బయటికి వెళ్లింది ఇదే క్రమంలో తన కూతురు కళాశాల నుండి మిస్సింగ్ అయిందని మొయినా బాద్ పోలీస్ స్టేషన్‌లో యువతి తండ్రి వెంకటేష్ ఈ నెల 8వ తేదీన మొయి నాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న మొయినాబాద్ పోలీసులు విచారణ చేపట్టారు యువతిని ప్రేమించిన ఎర్ర చంద్రశేఖర్ అన్న ఎర్ర రాజశేఖర్ మరియు భవాని ముగ్గురు కారులో వెళు తున్న వీడియోస్ సీసీ కెమెరాలో రికార్డ్ అయ్యాయి అక్కడినుడి వెళ్లిపోయిన ఎర్ర చంద్రశేఖర్ భవాని మేజర్ కావడంతో వివాహం చేసుకొని తమకు రక్షణ కావాలని నిజామాబాద్ ఏసీపీ నీ ఆశ్రయించారు ఆ తర్వాత ఎర్ర రాజశేఖర్ షాద్ నగర్ కు చేరుకున్నారు ఈనెల 12వ తేదీన రాత్రి 9 గంటల సమయంలో ఎర్ర రాజశేఖర్ యువతి తండ్రి వెంకటేష్‌తో పాటు మరికొంద రు ఇంట్లో నుండి కిడ్నాప్ చేసి తీసుకెళ్లడంతో వెంటనే రాజశేఖర్ భార్య వాణి 100కు సమాచారం ఇవ్వడంతో పాటు షాద్‌నగర్ పోలీసులకు ఫిర్యా దు చేసింది ఫిర్యాదుపై కిడ్నాప్ కేసు నమోదు చేశారు షాద్ నగర్ పోలీసులు విచారణ చేపట్టారు ఇదే క్రమంలో ఈ నెల 15వ తేదీన మహబూబ్ నగర్ జిల్లా నవాబుపేట మండలం యన్మన్ గండ్ల శివారులో కాలిన డెడ్ బాడీ గమనించిన స్థానికులు నవాబుపేట పోలీసులకు సమాచారం ఇచ్చారు విచారణ చేపట్టిన నవాబ్ పేట పోలీసులు షాద్‌నగర్ పోలీసులకు సమాచా రం ఇవ్వడంతో షాద్ నగర్ పోలీసులు ఘటన స్థలానికి ఎర్ర రాజశేఖర్ కుటుంబ సభ్యులను తీసుకెళ్లి చూపించడంతో మృతదేహం ఎర్ర రాజశేఖర్ దే అని నిర్ధారణ అయింది దీనిపై ఎర్ర రాజశేఖర్ భార్య వాణి ఫిర్యాదుతో కిడ్నాప్ చేసి అత్యంత పాశవికంగా దారుణంగా హత్యకు పాల్పడింది యువతి తండ్రి కాగుల వెంకటేష్ తో పాటు పత్తి శ్రీను వడ్డే నర్సింలు సోమ సురేష్, బిజ్జు రాఘవేందర్, ఆవుల శ్రీకాంత్ కాగుల రాములు 8 మందిపై బిఎన్ఎస్ యాక్ట్ హత్యాయత్నం ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించి వీరి వద్దనుండి ఓ ఇనోవా వాహనం టవేరా రెండు ద్విచక్ర వాహనాలు సెల్ ఫోన్స్ 65వేల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్లు షాద్ నగర్ ఏసిపి లక్ష్మీనారాయణ తెలిపారు కులాంతర వివాహం చేసుకున్నందునే కుట్రపన్ని రాజశేఖర్ ను హత్య చేయాలనే నేపథ్యంలోని ఈ దారుణానికి ఒడిగట్టారని పోలీసులు తెలిపారు...

## తార్నాకలో ప్రమాదకర రోడ్లపై
# చర్యలు వేగవంతం చేయాలి

### డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి ఆదేశాలు



**హైదరాబాద్, నవంబర్ 17 (జనంసాక్షి) :** తార్నాక డివిజన్‌లో పలుచోట్ల రహదారులు అత్యంత ప్రమాదకర స్థితిలో ఉన్నాయనే ప్రజల ఫిర్యాదులు స్వీకరించిన గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి.. డిప్యూటీ మేయర్ క్యాంప్ కార్యాలయంలో జిహెచ్ఎంసి ఇంజనీ రింగ్ విభాగ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ.. తార్నాక డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న రహదారి మరమ్మతుల పనులను వెంటనే పూర్తి చేయాలని, రోడ్ల దుస్థితి వల్ల ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు. చిక్కుముడిగా ఉన్న పాతోల్స్, చెత్తతో పెచ్చులూడిన లేన్లు, రాత్రి వేళల్లో ప్రమాదాలకు దారితీస్తున్న రోడ్డు గుంతలను అత్యవసరంగా సరిచేయాలని వివరంగా సూచించారు. మాన్సూన్ ముందు తార్నాక డివిజన్‌లోని ప్రధాన రహదారులు, అంతర్గత వీధులు అన్ని భద్రంగా ఉండేలా సమగ్ర ప్రణాళికతో వెంటనే పని ప్రారంభించాలని అధికారులు చెప్పినట్లు డిప్యూటీ మేయర్ పేర్కొన్నారు. ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను అత్యంత ప్రాధాన్యంగా తీసుకొని, సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో సికింద్రాబాద్ జిహెచ్ ఎంసి సర్కిల్ ఈ.ఈ సువర్ణ, డిప్యూటీ ఈఈ మాధవి, ఏఈ వేణు, వర్క్ ఇన్ స్పెక్టర్ శివ పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

### బైకును ఢీ కొట్టిన క్రీక్ స్కూల్ బస్సు




**మహేశ్వరం,నవంబర్17 (జనం సాక్షి):** రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని జైత్వారం గ్రామ సమీపంలో సోమవారం చోటు చేసుకుంది.కందుకూరు సిఐ సీతారాం,స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...కేశంపేట మండలం బైర్కాన్ పల్లి గ్రామానికి చెందిన కుమ్మరి నారాయణ (50), దన్నాడ శేఖర్ యాదవ్ (48) ఇద్దరు కలిసి బైక్ మీద కందుకూరు నుండి బైర్కాన్ పల్లి వెళ్తుండగా మార్గమధ్యలో జైత్వారం గ్రామ సమీపంలో క్రీక్ స్కూల్ బస్సు డ్రైవర్ అతివేగంతో వచ్చి బైకు ను ఢీ కొట్టాడు.బైక్ మీద ఉన్న కుమ్మరి నారాయణ తలకు, కాళ్ళకు,చేతులకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు.బైక్ వెనకాల కూర్చున్న శేఖర్ యాదవ్ కు రక్త గాయాలయ్యాయి. గాయపడిన శేఖర్ యాదవ్‌ను చికిత్స నిమిత్తం శంషాబాద్ లోని ట్రైడెంట్ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసుల కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## హైదరాబాద్ హనుమాన్ ఇంజినీరింగ్ వర్క్స్‌తో
# మాన్యుఫ్యాక్టరింగ్ భాగస్వామ్య ఒప్పందం



**మొయినాబాద్, నవంబర్ 17 జనం సాక్షి :** ఏరోస్పేస్ మరియు డిఫెన్స్ టెక్నాలజీలలో ప్రపంచ ప్రాముఖ్యత కలిగిన ఇన్ఫోర్టెకార్ప్ సొల్యూషన్స్ లిమిటెడ్ (లండన్), నాలుగు దశాబ్దాల అనుభవం కలిగిన ప్రెసిషన్ ఇంజినీరింగ్ సంస్థ హనుమాన్ ఇంజినీరింగ్ వర్క్స్ (హైదరాబాద్) తో ఒక స్ట్రాటజిక్ మాన్యుఫ్యాక్చరింగ్ భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రకటించింది. ఇది అంతర్జాతీయ సహకారాన్ని బలోపేతం చేసే ఒక ముఖ్యమైన ఘట్టంగా నిలిచిందని సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ భాగస్వామ్యం యుకె-ఇండియా ఏరోస్పేస్ మరియు డిఫెన్స్ తయారీ రంగాలలో సహకారాన్ని మరింత బలపరుస్తుందన్నారు. ఈ ఒప్పందం కింద హనుమాన్ ఇంజినీరింగ్ వర్క్స్ సంస్థ ఇన్ఫోర్టెకార్ప్‌కు ప్రెసిషన్ ఇంజినీరింగ్ భాగాలు, ఏరోస్పేస్ కంపోనెంట్లు క్రిటికల్ సబ్-సిస్టమ్స్ తయారీలో ప్రధాన భాగస్వామిగా పనిచేస్తుందని ఏరోస్పేస్, డిఫెన్స్ (ఇండియా), ఇన్ఫోర్టెకార్ప్ సొల్యూషన్స్ లిమిటెడ్ హెడ్ రాజు కీరచిపల్లి అన్నారు. ఈ భాగస్వామ్యం మా దేశంలో అడ్వాన్స్ తయారీ సామర్థ్యాలను విస్తరించడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. మా గ్లోబల్ కస్టమర్లకు అత్యుత్తమ నాణ్యతను అందించాలన్న మా దృష్టికి ఇది పూర్తిగా అనుగుణంగా ఉందని పోద్చంపల్లి సాయి కుమార్, డైరెక్టర్, హనుమాన్ ఇంజినీరింగ్ వర్క్స్ వ్యవస్థాపకులు పోద్చంపల్లి అంజనేయులు అన్నారు.

## గ్లోబల్ సమ్మిట్-2025కు
# దుండిగల్‌లో స్థలం ఖరారు

- సర్వే నంబర్ 453, 454లో వందల ఎకరాల ప్రభుత్వ భూమి
- డిసెంబరు 8, 9 తేదీల్లో 1300 మంది పారిశ్రామికవేత్తల ఆహ్వానం
- గత బీఆర్ఎస్ ప్రభుత్వం వెనకంజ వేసిన ప్రాజెక్టును కాంగ్రెస్ పునరుద్ధరణ
- ఐటీ-పారిశ్రామిక కారిడార్‌కు బాటలు : ఉపముఖ్యమంత్రి బట్టి
- స్థానిక ప్రజల్లో ఆనందం.. అభివృద్ధి ఆశలు



**నిజాంపేట్ (దుండిగల్), నవంబర్ 17 (జనంసాక్షి) :** తెలంగాణలో భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు డిసెంబరు 8, 9 తేదీల్లో నిర్వహించనున్న 'గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్-2025' కోసం దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్లు 453, 454లో వందల ఎకరాల ప్రభుత్వ భూమిని ఉపముఖ్య మంత్రి మల్లు బట్టి విక్రమార్క సోమవారం స్వయంగా పరిశీలించారు. ఈ స్థలంలో భవిష్యత్తులో ఐటీ-పారిశ్రామిక కారిడార్ ఏర్పాటుకు బాటలు వేయనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. సమ్మిట్‌కు ప్రపంచవ్యాప్తంగా 1300 మందికిపైగా పారిశ్రామికవేత్తలను ఆహ్వానించేందుకు ప్రభుత్వం ఇప్పటి నుంచే సన్నాహాలు చేపట్టింది. ఈ క్రమంలోనే దుండిగల్ పరిధిలోని అందుబాటులో ఉన్న విశాలమైన ప్రభుత్వ భూమిని ఎంపిక చేసినట్లు సమాచారం. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఈ ప్రాంతంలో ఐటీ కారిడార్ ఏర్పాటుకు భూసేకరణ, సర్వేలు పూర్తయినా అప్పటి ప్రభుత్వం వెనకంజ వేసింది. మూడేళ్ల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పాత ప్రతిపాదనలను పునరుద్ధరించి ముందుకు తీసుకొస్తుండటంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.
ఉపముఖ్యమంత్రితో పాటు మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి, మేడ్చల్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ యువనేత బొంగునూరి కిషోర్ రెడ్డి, దుండిగల్ మండల తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, మాజీ సర్పంచ్ కావలి గణేష్, సీనియర్ నాయకులు మాణిక్య రెడ్డి తదితరులు పాల్గొని ఉపముఖ్యమంత్రిని ఘనంగా సన్మానించారు. ఈ ప్రాంతం అభివృద్ధితో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, దుండిగల్ పరిసర ప్రాంతాలు మరింత వేగంగా అభివృద్ధి చెందుతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.




# సంధ్య శ్రీధర్‌రావు పాపం పండిన వేళ

## గచ్చిబౌలి అక్రమ సామ్రాజ్యం పెళ పెళ

- హైకోర్టు ఆదేశాలతో ఉక్కు పాదం మోపిన హైడ్రా.. బాధితుల హర్షాతిరేకం
- ప్రతి బాధితుడికి శ్రీధర్ రావు నుండి నష్టపరిహారం ఇప్పించాలని డిమాండ్


**శేరిలింగంపల్లి, నవంబర్ 17 (జనంసాక్షి) :** వంద ఏనుగులను తిన్న రాబందు ఒక గాలి వాటానికి నేలకూలు తుందనేది లోక ప్రసిద్ధిగాంచిన నానుడి... అచ్చం ఇలాంటి ఘటనే మరో మారు శేరిలింగంపల్లి నియోజకవర్గంలో పునరావృతం అయ్యింది. గత ప్రభుత్వ పలుకుబడిని అడ్డం పెట్టుకుని ఇష్టానుసా రంగా వ్యవహరిస్తూ ఒకింత బరితెగిస్తూ గచ్చిబౌలి శేరిలింగంపల్లి డివిజన్ పరిధి ఫర్టిలైజర్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సొసైటీ కోసం కేటాయించిన దాదాపు 20 ఎకరాల స్థలంలో అప్పట్లోనే నిర్దిష్టమైన లేఅవుటును ఏర్పాటు చేసి 162 ప్లాట్లుగా విభజించి వాటిని ఆయా యజమానులకు విక్రయించడం జరిగింది. ఇక్కడి వరకు బాగానే ఉన్నా ఎప్పుడైతే రియల్ ఎస్టేట్ వ్యాపారం ఊపుని అందుకుందో అప్పుడే రాబంధుల్లాంటి రాజకీయ పలుకుబడి కలిగిన కొందరు వ్యక్తుల కన్ను సదరు సొసైటీ భూమిపై పడడం అక్కడినుండి వారికి సీతమ్మ కష్టాలు మొదలవడం ఆరంభమైంది.

### ఎఫ్ సిఐ సొసైటీ ప్లాట్లను అప్పనంగా..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా కొనసాగుతున్న సమయంలోనే 2006 నుండి హైదరాబాద్ మహానగరంలో రియల్ ఎస్టేట్ భూమ్ ఒక్క సారిగా ఊపందుకుంది. దీంతో భవిష్యత్తుపై స్పష్టమైన సమాచా రాన్ని, రాజకీయ ప్రభావం కలిగిన కొందరు వ్యక్తులు నగరం సహా పరిసర ప్రాంతాల భూములను అడ్డికి పావుసేరులా ఇష్టారీతిన కొని అనతి కాలంలోనే కోట్లకు పడగలెత్తి సమాజం దృష్టిలో బడా వ్యక్తులుగా, ఆర్థిక ఉన్నత స్థితిని కలిగిన వారుగా చలామణి అవు తున్నారు. అంతటితో ఆగని కొంతమంది మానవత్వాన్ని మంటగ లుపుతూ అమాయకు లు, నిరుపేద వర్గాలను సామదాన భేద దండోపాయాలను ప్రయోగించి దౌర్జన్యంగా, దుర్మార్గంగా వారి వద్ద నుండి భూములను లాక్కొని పేదల రక్తంతో పెద్దమనుషులుగా కొనసాగుతున్నా రు. ఈకోవకు చెందిన వాడే సంధ్యా శ్రీధర్ రావు. సాదా సీదా జీవితం గడిపే శ్రీధర్ రావు గత ప్రభుత్వ హయాంలోని ఓ కీలక వ్యక్తితో ఉన్న సంబంధాలను అడ్డుగా పెట్టుకుని నగర శివారులలో ఎక్కడికక్కడ అడ్డంగా దోచేశాడు. ఈ క్రమంలోనే శేరిలింగంపల్లి నియోజక వర్గం పరిధి గచ్చిబౌలి లో ఫ్టిలైజర్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎంప్లాయిస్ సొసైటీ భూములను సైతం చాలావరకు దౌర్జన్యంగా లాక్కున్నట్లు ఆయా ప్లాంట్ల యజమానులు తెలియజేస్తున్నారు. గత 30 ఏళ్ల క్రితం సాధారణ విలువ గలిగిన ఫర్టిలైజర్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎంప్లాయిస్ సొసైటీ భూమి కార్యక్రమంలో నగరంతో సరి సమానంగా అభివృద్ధి, భూమి విలువను పెంచుకుం టూ మంచి స్థితికి చేరుకోగానే డేగ కన్ను వేసిన సంధ్యా శ్రీధర్ రావు గత ప్రభుత్వ పెద్దలను గుప్పిట్లో పెట్టుకుని అనేక దాష్టీకా లకు పాల్పడుతూ ఎంప్లాయిస్ సొసైటీ లోని ఎన్నో ప్లాట్లను సొంతం చేసుకోవడం జరిగిందని, అంతటితో ఆగకుండా పాత లే ఔటును మొత్తం తారుమారు చేసి రోడ్లను, పార్కులను, ఇతర ప్రజా ఉపయోగ స్థలాలను ఎక్కడపడితే అక్కడ, ఎలా పడితే అలా కబ్జా చేసి అసలైన ప్లాట్ల యజమానులను సొసైటీ లేఅవుట్లోకి కనీసం అడుగు పెట్టనీయకుండా దౌర్జన్యాలకు తెగబడుతూ ఎంతోమంది ప్లాట్ల యజమానుల జీవితాలతో ఆడుకుని వారి ప్లాట్లను సొంతం చేసుకున్నాడనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

### శ్రీధర్ రావు సామ్రాజ్యం పెళ పెళ

వాపులు చూసి బలుపు అనుకున్న చందంగా రాజకీయ పలుకు బడి, కొంతమంది కిరాయి మనుషుల మద్దతుతో మిడిసిపడుతూ 30 ఏళ్ల క్రిందటి లేఅవుట్ ను పూర్తిగా మార్చివేసి ఇష్టానుసారంగా ప్లాట్లను కబ్జా పెట్టడంతో పాటు ఎంతోమంది చావుకి కారణమైన సంధ్యా శ్రీధర్ రావు దుర్మార్గాలు అన్నీ, ఇన్నీ కావని, వేల కోట్ల విలువైన ఫర్టిలైజర్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎంప్లాయిస్ సొసైటీ భూమిని భూ బకాసురునిలా చెరబట్టి అడిగేవాడెవడూ లేదని విర్రవీగిన సంధ్యా శ్రీధర్ రావు పాపం ఎట్టకేలకు పండి అది హైడ్రా రూపంలో ఆశని పాతమై తగిలిందని, ఇప్పుడు అతని అక్రమ సామ్రాజ్యం కోర్టు ఆదేశాలతో పిలఫెలఅక్రమ సామ్రాజ్యం కోర్టు ఆదేశాలతో పెళ పెళ మని కుప్ప కూలిందని సంధ్యా శ్రీధర్ రావు బాధితులు హర్షాతిరేకం వ్యక్తం చేశారు. తాము రక్తాన్ని ధారపోసి, శ్రమతో చెమటలు కక్కి ఒక్కో పైసా కూడా పెట్టి ప్లాట్లు కొనుక్కుంటే రాబంధులా వాటిపై వాలి మొత్తం సొసైటీ లే అవుతున్న సర్వనాశనం చేసి శ్రీధర్ రావు ఇష్టానుసారంగా సొంత సామ్రాజ్యాన్ని స్థాపించి ఎంతోమంది జీవితాలతో చెలగాటం ఆడాడని, అతడిని ఉరితీసిన పాపం లేదని పలువురు ప్లాట్ల యజమానులు కన్నీటి పర్యంతమయ్యారు. దేశానికి సేవలు అందించే ఒక మేజర్ ప్లాట్ ను కబ్జా పెడితే ఆయన సతీమణి గచ్చిబౌలి పోలీస్ స్టేషన్లో న్యాయం కోసం వెళ్లి రెండు వారాలు అక్కడ పడుకోవడం తెలంగాణ రాష్ట్ర ప్రజల సిగ్గుతో తలవంచుకోవాల్సిన విషయమని, ఇలాంటి పందికొక్కులను, భూ బకాసురులను నడిరోడ్డు పై ఉరి తీయాల్సిన అవసరం ఉందని వారు తమ అక్రోషాన్ని వెళ్లగక్కారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ పై కూడా శ్రీధర్ రావు బెదిరింపులకు పాల్పడ్డాడని, అతని ఆగడాలకు అంతే లేదని, హైకోర్టు మొట్టికాయలు వేస్తే తప్ప అతని అక్రమ సామ్రాజ్యం కూలలేదని వారు వాపోయారు. ఇప్పటికైనా ప్రతి బాధితుడికి సంధ్యా శ్రీధర్ రావు ఆస్తులను జప్తు చేసి అనా పైసతో సహా చెల్లించాల్సిన అవసరాన్ని వారు ఎత్తి చూపారు. మరోమారు సంధ్యా శ్రీధర్ రావు సొసైటీ భూములలో అడుగుపెడితే కఠిన చర్యలు తీసుకోవాలని, ప్లాట్ల జోలికి వస్తే ఉరితీయాలని అందరూ ముక్తకంఠంతో కోరుతున్నారు.



జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
18 నవంబర్ 2025

# హనుమకొండ ప్రయివేటు హాస్పిటల్‌లో దారుణం

- డబ్బులు ఇస్తేనే వైద్యం.. డబ్బులు కడితే బయటికి శవం
- డబ్బులు కట్టలేదని పేషెంట్ వెంటిలేషన్ పైపులు తీసేసిన వైనం
- హాస్పిటల్ ఎదుట పేషెంట్ బంధువుల నిరసన
- ప్రజల ప్రాణాలతో ఆర్ఎంపీల దందా
- మనిషి ప్రాణానికి 50 వేలు వెల కట్టిన డాక్టర్స్



**హన్మకొండ ప్రతినిధి, నవంబర్ 17 (జనంసాక్షి) :** హనుమకొండలోని శ్రీ చక్ర హాస్పిటల్ లో దారుణం చోటుచేసుకుంది. వారం రోజుల క్రితం జ్వరంతో హనుమకొండ జిల్లా ఐలావోని మండలం గార్లపల్లి గ్రామానికి చెందిన మహిళని ఆర్ఎంపి డాక్టర్ ని సంప్రదించగా హన్మకొండ నగరంలో ని శ్రీ చక్ర హాస్పిటల్ కి రెఫర్ చేయగా కల్పన (40) మహిళ పేషంటు హాస్పిటల్ లో అడ్మిట్ కావడం జరిగింది. హాస్పిటల్ లోని డాక్టర్ వెంటనే పరీక్షలు నిర్వహించాలని దానికి సంబంధించిన డబ్బులు కట్టండి చెప్పగా వెంటనే మహిళా పేషెంట్ కూతురు భర్త కలిసి 20,000 రూపాయలు చెల్లించారు. పరీక్షలు నిర్వహించిన అనంతరం ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్ అయిందని కిడ్నీలు ఫెయిల్ అయ్యాయంటూ డబ్బులు కట్టమని అడగగా వాళ్ళ వద్ద ఉన్న మరో 20,000 కట్టడం జరిగింది. ఒకరోజు గడిచిన తర్వాత మళ్ళీ ఇంకా డబ్బులు కావాలి లక్ష రూపాయల వరకు అవుతుంది డయాలసిస్ చేయాలంటే అని డాక్టర్ చెప్పగా ప్రస్తుతం మా వద్ద డబ్బులు లేవు రేపు ఉదయానికల్లా సర్దు చేసి కడతామని చెప్పగా డాక్టరు సిబ్బంది వినకుండా పేషంటు సంబంధించిన భర్తను కూతురిని భయభ్రాంతులకు గురి చేయడం జరిగింది. డబ్బులు కట్టకుంటే వైద్యం చేయమంటూ పెట్టిన వెంటిలేషన్ నో తీసివేయగా పేషంటు ప్రాణాలు పోవడం జరిగింది. డబ్బులు కట్టకుంటే పేషెంట్ ప్రాణాలు తీస్తారా అంటూ తీవ్ర అగ్రహ వ్యక్తం చేశారు. వెంటనే పేషంట్ బంధువులకు సమాచారం ఇవ్వగా బంధువులంతా హాస్పిటల్ చేరుకొని హాస్పిటల్ వద్ద నిరసన తెలిపారు. డబ్బులు కడితేనే వైద్యం చేస్తారా లేకుంటే వైద్యం చేయరా అంటూ డాక్టర్లను హాస్పటల్ సిబ్బందిని ప్రశ్నించారు.

### స్పందించిన డిఎంహెచ్వో

హాస్పిటల్ లో పేషెంట్ చనిపోయి ఇబ్బంది పడుతున్నారని సమాచారం తెలుసుకున్న హనుమకొండ జిల్లా వైద్యాధికారి అప్పయ్య హాస్పిటల్ చేరుకుని హాస్పిటల్ డాక్టర్ యాజమాన్యంతో మాట్లాడి ముందుగా మరణించిన మహిళను హాస్పిటల్ నుండి పంపించడం జరిగింది. ఈ సందర్భంగా డిఎంహెచ్వో అప్పయ్య మీడియాతో మాట్లాడుతూ... పేషంట్ కు చనిపోవడం గల కారణాలు పేషెంట్ కు ఎలాంటి ట్రీట్మెంట్ చేశారనేది కే షీట్ లో చూసిన తర్వాత చెపుతాని తెలిపారు. అదేవిధంగా ప్రజలు ప్రైవేట్ హాస్పిటల్స్ కి వెళ్లకుండా ప్రభుత్వ హాస్పిటల్ కి వెళ్లి ట్రీట్మెంట్ చేయించుకోవాలని ప్రభుత్వ హాస్పిటల్ లో రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల సదుపాయాలు కల్పించిందని తెలిపారు. ప్రతి ఒక్క హాస్పిటల్లో ఏ వైద్యానికి ఎంత ఖర్చు అనేది ప్రతి ఒక్క హాస్పిటల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేపిస్తామని ప్రభుత్వ నిబంధనలను పాటించని హాస్పిటల్ పై తగిన చర్యలు తీసుకుంటామని సూచించారు.

# సింగరేణి ఉద్యోగుల కోసం పోరాటం

- డిపెండెంట్ ఉద్యోగాలను కాపాడుకోవాలి
- డిసెంబర్ 13న సిఎండి కార్యాలయ ముట్టడి
- ఖమ్మం జాగృతి బాటలో కవిత వెల్లడి




**ఖమ్మం, నవంబర్ 17 (జనంసాక్షి) :** డిపెండెంట్ ఉద్యోగాలు కాపాడుకోలేని స్థితిలో ఇప్పుడు ఉన్నామని జాగృతి అధ్యక్షురాలు కవిత వ్యాఖ్యలు చేశారు. డిసెంబర్ 13న సింగరేణి సీఎండీ కార్యాలయాన్ని ముట్టడి చేయబోతున్నామని ఖమ్మం జిల్లాలో జాగృతి బాటలో కవిత ప్రకటించారు. సింగరేణి ఉద్యోగం ఒక కుటుంబానికి ఇన్సూరెన్స్ లాంటిదని... డిపెండెంట్ ఉద్యోగాల కోసం పోరాటం చేస్తామన్నారు. సోమవారం సత్తుపల్లి జేవీఆర్ ఓసీ సింగరేణిలో కార్మికులతో కవిత మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రెండేళ్లుగా మెడికల్ బోర్డ్ కోసం కొట్లాడుతున్నామన్నారు. సింగరేణి గని కార్మికులకు ఇన్‌కమ్ ట్యాక్స్ కట్ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని.. 'మీకోసం పోరాటం చేసే మాకు అండగా ఉండాలి అని కోరుతున్నాం' అని కవిత అన్నారు. కొత్త బొగ్గు బ్లాక్‌లు సింగరేణికి అందించాలని డిమాండ్ చేశారు. కేంద్రం బొగ్గు బ్లాక్‌లను ప్రైవేట్ వ్యక్తులకు వేలం వేయడాన్ని ఒప్పుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం సింగరేణికి అక్షరాలా రూ.40 వేల కోట్ల అప్పు ఉందని తెలిపారు. సింగరేణి కార్మికుల కోసం మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం చేయాలని కోరుతున్నామన్నారు. ఆసుపత్రి నిర్మాణం చేసే లోపు కార్పోరేట్ హాస్పిటల్స్‌లో వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులు పెర్మినెంట్ అయ్యేలా ప్రయత్నం చేస్తామని తెలిపారు. బొగ్గు బావిలోకి దిగే ముందు మైసమ్మకు మొక్కుకుని జాగ్రత్తగా ఉండాలని కవిత సూచించారు.

# నంద్యాలలో ఉద్యోగాల మోసం

**నంద్యాల, నవంబర్ 17 (జనంసాక్షి) :** నంద్యాల జిల్లాలో భారీ మోసం వెలుగుజూసింది. దీనిపై ఫిర్యాదులు రావడంతో పోలీసులు రంగంలోకి దిగారు. ఉద్యోగాల పేరిట రాయలసీమలో జరిగిన భారీ మోసం వెలుగులోకి వచ్చింది. వెల్త్ అండ్ హెల్త్ సంస్థ నిర్వాహకులు ఈ దురాగతానికి పాల్పడ్డారు. ఉద్యోగం కావాలంటే రూ.3 లక్షలు డిపాజిట్ చేయాలని నిబంధన పెట్టి నెలకు రూ.40వేలు వేతనం ఇస్తామని నిరుద్యోగులకు గాలం వేశారు. కడప, నంద్యాల, అనంతపురం జిల్లాల్లో దాదాపు 1200 మంది నుంచి డిపాజిట్లు వసూలు చేశారు. కొన్ని నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో బాధితులు ఆందోళనకు దిగారు. ఈ క్రమంలోనే అసలు వ్యవహారం బయట పడింది. కేసు నమోదు చేసిన ఆళ్లగడ్డ పోలీసులు.. వెల్త్ అండ్ హెల్త్ సంస్థ నిర్వాహకులు రాజారెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి, వీరారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డిలను అరెస్టు చేశారు.

## శంషాబాద్ ఎయిర్‌పోర్టులో
# బంగారం బిస్కెట్ల పట్టివేత

- ఇస్త్రీ పెట్టెలో దాచి తెస్తుండగా గుర్తించిన అధికారులు



**హైదరాబాద్, నవంబర్ 17 (జనంసాక్షి) :** విమానాశ్రయంలో ఓ ప్రయాణీకుడిని అనుమానించి తనిఖీ చేయగా బంగారం బిస్కట్లు బయటపడ్డాయి. బయటకు వస్తున్న అతడిపై అనుమానం వచ్చిన ఎయిర్ పోర్ట్ సిబ్బంది.. అతడి లగేజీ చెక్ చేశారు.. ఎమి దొరకలేదు.. మళ్లీ అనుమానంతో మరో సారి గట్టిగానే తనిఖీలు చేపట్టారు.. దీంతో అసలు విషయం బయటపడింది. ఇస్త్రీ పెట్టెలో లక్షల విలువైన బంగారాన్ని చూసిన ఎయిర్ పోర్ట్ అధికారులు నోరు వెళ్లబెట్టారు. ఇస్త్రీ పెట్టెలో ఏకంగా రూ.1.55 కోట్ల విలువైన బంగారం దాచడంతో ..అక్కడున్న వాళ్లంతా అవాక్కయ్యారు. ఈ ఘటన శంషాబాద్ ఎయిర్ పోర్ట్ లో జరిగింది. వైఎస్ఆర్ కడప జిల్లా పొద్దుటూర్‌కు చెందిన ఓ వ్యాపారి ఇటీవల షార్జాకు వెళ్లాడని అధికారులు వెల్లడించారు. అయితే అతడు షార్జా నుంచి 1200 గ్రాముల బరువున్న 11 బంగారం బిస్కెట్లను తీసుకొచ్చాడు. ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ అధికారుల చెకింగ్స్ నుంచి తప్పించుకోగలిగాడు. అయినప్పటికి గ్రీన్ ఛానల్ నుంచి బయటకు వెళ్లిపోతున్న టైంలో తమకు అడ్డంగా దొరికిపోయాడని అధికారులు చెప్పుకొచ్చారు. దొరికిన బంగారాన్ని స్వాధీనం చేసుకుని.. నిందితుడితో పాటు.. మరో వ్యక్తిని డీఆర్ఐ అధికారులు అరెస్ట్ చేశారు. ఈ బంగారం ఏపీలోని ప్రొద్దుటూరుకు చెందిన మరో వ్యక్తి కోసం తీసుకువచ్చినట్లు అధికారులు వెల్లడించారు. అనంతరం నిందితుడిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

# బిజెపి గెలిస్తే ఈవీఎంల ట్యాంపర్

- మీరు గెలిస్తే ప్రజాస్వామ్యబద్ధమా?
- జూబ్లీహిల్ ఓటమితో కుంగిపోయేది లేదు
- కాంగ్రెస్ విమర్శలపై మండిపడ్డ ఈటల రాజేందర్



**హైదరాబాద్, నవంబర్ 17 (జనంసాక్షి) :** ఉప ఎన్నికల్లో అధికార పార్టీ గెలవడం సహజమే అని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. గెలిచినా, ఓడినా.. అధికారం ఉన్నా, లేకపోయినా దశాబ్దాలుగా కాషాయ జండా పట్టుకుని ప్రజల కోసం పనిచేస్తున్న పార్టీ భారతీయ జనతా పార్టీ అన్నారు. గెలిస్తే బీజేపీ వాళ్ళు ఈవీఎంలను ఏదో చేశారని అంటున్నారు. మరి జూబ్లీహిల్స్ ఎన్నికలో ఈవీఎం మేనేజ్ చేశారా?, దొంగ ఓట్లు నమోదు చేయించారా?. తెలంగాణలో, కర్ణాటకలో కూడా మీరే గెలిచారు, మరి అక్కడ కూడా అలానే చేశారా?. మీరు గెలిస్తే ఒక న్యాయం.. మేము గెలిస్తే ఓట్ చోరీ అని అంటారా?. ఏం చేస్తావో ప్రజలకు చెప్పి ఓట్లు అడగాలి, ఇలాంటి ఆరోపణలు కాదు. బరిగీసి కొట్లాడే తత్వం లేనప్పుడు పార్టీ ముందుకు పోయే అవకాశం లేదు. అధికార పార్టీ హంగుల వల్ల ఉపఎన్నికల్లో గెలుస్తుంది. పార్టీ అంటే నాయకులు అందరూ బాధ్యత తీసుకుంటారు. కిషన్ రెడ్డి గారినో, ఇంకొకరినో బాధ్యులు చెయ్యలేం. జూబ్లీహిల్స్ లో ఎమ్మెల్యే చనిపోయిన వెంటనే బీజేపీ తిరిగి ఉంటే ఫలితం వేరుగా ఉండేదన్నారు. వేలాది మంది బీజేపీ కారకర్తలు, వందల మంది నాయకుల భవిష్యత్తు కోసం మాట్లాడుతున్నా.. సీఎం, మంత్రులు, కొంతమంది అవగాహన లేని నాయకులు మాట్లాడుతున్న మాటలు వింటున్నా అని ఎంపీ ఈటల చెప్పారు. జూబ్లీహిల్స్ ఎన్నిక ఫలితంపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ స్పందించారు. బీజేపీ కార్యకర్తల్లారా.. జూబ్లీహిల్స్ ఎన్నిక ఓడిపోగానే కుంగిపోవద్దని, భవిష్యత్తు మనదే అని అన్నారు. తెలంగాణలో డివిజన్ పాలిటిక్స్‌తో అధికారం లోకి రాలేమని.. కులం, మతం పునాది మీద రాజకీయాలు శాశ్వతంగా నడవవన్నారు. 'నారాయణఖేడ్, పాలేరు హుజూర్‌నగర్, నాగార్జున సాగర్, కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ అన్నిటిలో అధికార పార్టీ గెలిచింది. కేసీఆర్ అహంకారం అణచడానికి దుబ్బాకలో బీజేపీని గెలిపించారు. అన్యాయానికి న్యాయానికి.. ఆత్మగౌరవానికి అహంకారానికి.. ధర్మానికి అధర్మానికి జరిగిన హుజురాబాద్ ఎన్నికల్లో ధర్మం గెలిచింది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరూ ఆ ఎన్నిక కోసం ఎదురుచూశారు. స్వయంగా కేసీఆర్ వచ్చి దళితబంధు ప్రకటించినా గెలవలేకపోయారు. తెలంగాణ వచ్చిన తరువాత 9 ఉప ఎన్నికలు జరిగితే.. 7 సార్లు అధికార పార్టీనే గెలిచింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన రెండు ఎన్నికల్లో గెలిచింది. కేసీఆర్ ఎన్ని చేశారో వీరు కూడా అవే చేశారు. కాంగ్రెస్ పార్టీకి హుజురాబాద్ లో వచ్చిన ఓట్లు 3016. దుబ్బాకలో, మునుగోడు డిపాజిట్ కోల్పోయింది. మరి డిపాజిటు కోల్పోయిన పార్టీ మొన్న ఎలా అధికారంలోకి వచ్చింది. ఒక్క బై ఎలక్షన్ ఓడిపోగానే బీజేపీ పని అయిపోతుందా?. రాజకీయ పరిజ్ఞానం ఉన్న వారు ఎవరూ అలా మాట్లాడరు' అని ఎంపీ ఈటల అన్నారు. 'బీహార్ ఎన్నికలు ఒక ప్రభంజనం. ఒళ్ళు వంచి పని చేస్తే విజయం మనదే. కార్యకర్తలు, నాయకులు సోషల్ మీడియాలో వచ్చే పోస్టులు చూసి బాధపడకండి. భవిష్యత్తు మనదే. జూబ్లీహిల్స్ ఎన్నిక ఫలితం అందరం బాధ్యత తీసుకుంటున్నాం.ప్రజలకు సేవ చేయడం వల్లనే దేశ వ్యాప్తంగా బీజేపీకి ప్రజలు ఓట్లు వేస్తున్నారు. ఒకాయన అధికారం పోతుందని, ఇంకొకరు సానుభూతితో పోటీ పడ్డారు. తెలంగాణలో డివిజన్ పాలిటిక్స్ తో అధికారంలోకి రాలేము. బీహార్లో మాకు ఇన్ని సీట్లు వచ్చాయి అంటే అందరి మద్దతు ఉంది. ట్రిపుల్ తలాక్ లాంటివి పని చేసాయి. మా సర్ సంగ్ చాలక్ ఒక గొప్ప మాట చెప్పారు.. ఒక జాతిని విస్మరించి దేశాన్ని నిర్మాణం చేయలేమని చెప్పారు. మోడీ గారు ప్రధాని కాగానే ఒక మెసేజ్ ఇచ్చారు. ప్రజలకు ఇప్పటి వరకు ఏం చేసావు, ఇక ముందు ఏం చేస్తావు అని చెప్పి ప్రజలను ఓట్లు అడగాలి' అని ఎంపీ ఈటల చెప్పారు.

# తెలంగాణ పోలీసుల కృషి అభినందనీయం

- సజ్జన్నార్‌ను కలిసి అభినందించిన నాగార్జున



**హైదరాబాద్, నవంబర్17 (జనంసాక్షి) :** పైరసీని అరికట్టేందుకు తెలంగాణ పోలీసులు చేస్తున్న కృషి అభినందనీయమని ప్రముఖ సినీనటుడు నాగార్జున అన్నారు. హైదరాబాద్ సీపీ సజ్జనార్‌తో సినీ ప్రముఖుల సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. డిజిటల్ అరెస్ట్ గురించి నాగార్జున మాట్లాడుతూ తమ కుటుంబంలోనూ ఒకరిని సుమారు రెండు రోజులుపాటు నిర్బంధించారని తెలిపారు. పోలీసులకు సమాచారం ఇచ్చేలోపు వారు తప్పించుకున్నారన్నారు. తెలంగాణ పోలీసులకు అభినందనలు. ఐబొమ్మ వెబ్‌సైట్ నిర్వాహకుడు ఇమ్మడి రవిని అరెస్ట్ చేసిన తర్వాత చెన్నై నుంచి నా స్నేహితుడు ఫోన్ చేసి ఇక్కడ మేం చేయలేనిది అక్కడ మీరు చేశారన్నాడు. కేవలం రూ.20కోట్ల కోసం నిందితులు ఇదంతా చేయడం లేదు. పైరసీ వెనుక అంతర్జాతీయ ముఠా ఉంది. 50లక్షల మంది సబ్‌స్క్రైబర్ల డేటా వారికి చేరింది. ఇది బిగ్ ట్రాప్. ఉచితంగా సినిమాలు చూపించాలనేది వారి ఉద్దేశం కాదు. దీనిలో రూ.వేల కోట్లు దోచేసే పెద్ద ప్లాన్ ఉంటుంది. సినిమాలు ఫ్రీగా చూస్తున్నామని అనుకోవద్దు.. దాని వెనుక ఉన్న పెద్ద మోసాన్ని గమనించాలని నాగార్జున అన్నారు. తెలంగాణ పోలీసులు సినీ పరిశ్రమకు చెందిన వారి పరిస్థితి మరికొంత మెరుగుపడేలా చేశారని నిర్మాత సురేశ్‌బాబు అన్నారు. పైరసీ సినిమాలు చూడొద్దని.. ఏదీ ఉచితంగా రాదని చెప్పారు. మన డేటా వారి వద్ద ఉండటంతో ఎన్నో నేరాలకు పాల్పడతారన్నారు. ఉచితంగా సినిమా చూడటం వల్ల ఇవన్నీ జరుగుతాయని సురేశ్‌బాబు అన్నారు.

### సీపీకి ఏపీ డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ అభినందన

**అమరావతి, నవంబర్17 (జనంసాక్షి) :** పోలీసులకు సైతం సవాల్ విసిరే స్థాయికి పైరసీ ముఠాలు వచ్చిన తరుణంలో హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసుబృందం, హైదరాబాద్ నగర సీపీ సజ్జనార్ చేపట్టిన ఆపరేషన్ విజయవంతమవడంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సంతోషం వ్యక్తంచేశారు. ఐబొమ్మ నిర్వాహకుడి అరెస్ట్ నేపథ్యంలో తాజాగా సినీ ప్రముఖులు హైదరాబాద్ నగర సీపీ సజ్జనార్‌తో భేటీ అయ్యారు. వారంతా పోలీసుశాఖకు ధన్యవాదాలు తెలిపారు. ఈ క్రమంలో పవన్‌కల్యాణ్ ఎక్స్ వేదికగా స్పందించారు. డబ్బుల రూపంలోనే కాదు, సృజనాత్మకతనూ పెట్టుబడిగా పెట్టి నిర్మించే సినిమాలు విడుదలైన రోజే ఆన్‌లైన్‌లోకి వచ్చేస్తున్నాయి. దీనివల్ల చిత్ర పరిశ్రమ తీవ్రంగా నష్టపోతోంది. సినిమా విడుదలే ఒక మహాయజ్ఞంగా మారిపోయిన తరుణంలో పైరసీ ముఠాలను కట్టడి చేయడం దర్శకనిర్మాతలకు సాధ్యం కావడం లేదు. పైరసీలో కీలకంగా ఉన్న ఐబొమ్మ, బప్పమ్ వెబ్‌సైట్ల నిర్వాహకుడిని హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేసి, వాటిని మూయించివేయడం స్వాగతించదగ్గ పరిణామం. పోలీసులకు సైతం సవాల్ విసిరే స్థాయికి పైరసీ ముఠాలు వచ్చిన తరుణంలో హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసుబృందం చేసిన ఆపరేషన్ విజయ వంతమైంది. ఈ ఆపరేషన్‌లో భాగమైన పోలీసులకు, సిటీ కమిషనర్ వి.సి.సజ్జనార్‌కి అభినందనలు తెలియజేస్తున్నానన్నారు. బెట్టింగ్ మాఫియా, పోంజీ స్కీమ్స్ లాంటివాటిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి, వాటివల్ల ప్రజలు ఏవిధంగా ఆర్థికంగా చితికిపోతున్నారో చైతన్యపరుస్తున్నారు. పోంజీ స్కీమ్స్ మూలంగా ప్రజలు ఆర్థికంగా ఏవిధంగా మోసానికి గురై నష్టపోతున్నారో ఆయన ఓ సందర్భంలో వివరించారు. అలాగే బెట్టింగ్ యాప్స్‌ను నియంత్రించేందుకు సజ్జనార్ చేపట్టిన కార్యక్రమం అన్ని రాష్ట్రాల్లోన్రూ కదలిక తీసుకువచ్చింది. ఆయన నేతృత్వంలో చేపట్టే చర్యలు కచ్చితంగా తెలుగు సినిమాకే కాదు యావత్ భారతీయ చిత్ర పరిశ్రమకు మేలు చేస్తాయని పవన్‌కల్యాణ్ ప్రశంసించారు. పైరసీతో సినీరంగానికి చాలా నష్టం జరిగిందని, దీన్ని కట్టడి చేయడంలో భాగంగా ఐబొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవిని అరెస్టు చేసినట్లు పోలీస్ కమిషనర్ సజ్జనార్ మీడియాకు తెలిపారు. అతడిపై ఐటీ యాక్ట్, కాపీ రైట్ యాక్ట్ కింద మరో 4 కేసులు నమోదు చేసినట్లు చెప్పారు.

# సీజేఐపై దాడి 30 కోట్ల దళితుల మీద జరిగిన దాడి

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ




**హైదరాబాద్ (జనంసాక్షి) :** సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయి మీద జరిగిన దాడి దేశంలోని ముప్పై కోట్ల మంది దళిత ప్రజల మీద జరిగిన దాడే అని, దళితుల మీద దాడులకు పాల్పడే వారికి చట్టాలు వర్తించకపోవడం అత్యంత దారుణమని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ధ్వజమెత్తారు. సీజేఐ బీఆర్ గవాయి మీద జరిగిన పాశవిక దాడిని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద దళితుల ఆత్మగౌరవ సభ జరిగింది. ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ 'చట్టం ముందు అందరూ సమానులే అని రాజ్యాంగం చెప్తుంటే అందుకు విరుద్ధంగా చట్టపరమైన వ్యవస్థలు దళితుల మీద దాడులకు పాల్పడుతున్న వారి మీద చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. ధర్మం ముసుగులో విశ్వాసాల ముసుగులో దాడులకు పాల్పడే వారికి చట్టాలు వర్తించవా ? వారి మీద చర్యలు తీసుకోరా అని ప్రశ్నించారు.దళితుల మీద దాడులకు పాల్పడితే చట్టాలు వర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.న్యాయ వ్యవస్థ, డిల్లి పోలీసు వ్యవస్థ, జాతీయ మానవ హక్కుల కమిషన్ తమ కర్తవ్యాలను అమలు చేయడంలో పూర్తి వివక్షతను చూపెట్టయని అన్నారు. ఎన్నో సంఘటనల మీద పత్రికల్లో వచ్చిన వార్తలను ఆధారంగా చేసుకొని సుమోటోగా కేసులు తీసుకున్న వ్యవస్థలు దేశంలోనే అత్యున్నతమైన సుప్రీంకోర్టుకు చీఫ్ జస్టిస్ గా ఉన్న గవాయి మీద జరిగితే ఎందుకు మౌనం వహించాయి ? అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య స్థానంలో రాచరిక వ్యవస్థ తీసుకొచ్చే మను ధర్మాన్ని సహించేది లేదని అన్నారు. ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం సమానత్వం కోసం రాజ్యాంగ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు ఈ సభకు ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు డా. మున్నంగి నాగరాజు మాదిగ అధ్యక్షత వహించగా ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డా.గోవిందు నరేష్ మాదిగసొట్ట నరేంద్ర బాబు మాదిగ, కడార్ల నవీన్ చారి ఎమ్మార్పీఎస్ నార్త్ ఇండియా ఇంచార్జీ, రుద్రపోగు సురేష్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు, కర్ణాటక నుండి నర్సాప్ప మాదిగ, మహారాష్ట్ర నుండి అజిత్ ,ఉత్తరాఖండ్ నుండి ఆశిష్ కుమార్, తమిళనాడు నుండి లోకేష్, హర్యాన నుండి సత్యపాల్, ఉత్తర, దక్షిణ రాష్ట్రంల నుంచి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాజన్న సిరిసిల్ల డ్రైవర్లకు కేటీఆర్ భరోసా

- జిల్లాలో ఉన్న ఆటో అన్నలకు రూ. 5 లక్షల ప్రమాద బీమా నేనే కడుతా
- ఆటో అన్నలకు బాకీ పడిన రూ. 24 వేల బాకీ వెంటనే చెల్లించాలి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** కేటీఆర్ మరోసారి తన మంచి మనసు చాటుకున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఆటో డ్రైవర్ల అందరికీ 5 లక్షల రూపాయల ప్రమాద బీమా కోసం అవసరమైన ప్రీమియంను తానే చెల్లిస్తానని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హామీ ఇచ్చారు. ఈ రోజు రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఆటో డ్రైవర్లతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు (కేటీఆర్) సోమవారం తెలంగాణ భవన్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రంలో ఆటో డ్రైవర్లపై కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. గత కేసీఆర్ ప్రభుత్వం ఆటో కార్మికులకు అండగా ఉన్నదని గుర్తు చేస్తూనే, ప్రస్తుత ప్రభుత్వం డ్రైవర్లకు ఇచ్చిన మాట నిలబెట్టుకోలేక, వారి సంక్షేమానికి చిత్తశుద్ధి చూపడం లేదని ఆరోపించారు. గత కేసీఆర్ ప్రభుత్వం అసంఘటిత రంగంలోని డ్రైవర్లందరికీ, కేవలం ఆటో డ్రైవర్లకే కాకుండా, రైతు బీమా తరహాలోనే రూ. 5 లక్షల ప్రమాద బీమా (యాక్సిడెంట్ ఇన్సూరెన్స్) అమలు చేసిందని కేటీఆర్ గుర్తు చేశారు. దురదృష్టవశాత్తూ ఎవరికైనా ప్రమాదం జరిగితే ఈ బీమా ద్వారా చాలామందికి డబ్బులు అందాయని తెలిపారు. అయితే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పోయిన అక్టోబర్ నెలలో ఈ బీమా ప్రీమియంను కట్టకపోవడంతో, ఆటో కార్మికులు ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు నెలకు రూ. 1,000 చొప్పున (సంవత్సరానికి రూ. 12,000) సహాయం చేస్తామని హామీ ఇచ్చిందని, ప్రభుత్వం ఏర్పాటై దాదాపు రెండేళ్లు కావస్తున్నా ఆ హామీని నిలబెట్టుకోలేదని కేటీఆర్ విమర్శించారు. "రెండేళ్లకు కలిపి ప్రతి ఆటో డ్రైవర్‌కు ప్రభుత్వం రూ. 24,000 బాకీ ఉంది. ముందు ఆ బాకీ కట్టండి అని డిమాండ్ చేశారు. అంతేకాకుండా, 100 రోజుల్లో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన సంక్షేమ బోర్డును కూడా రెండేళ్లు అవుతున్నా ఏర్పాటు చేయకపోవడం ప్రభుత్వానికి డ్రైవర్ల పట్ల ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తుందని అన్నారు.

### రాజన్న సిరిసిల్ల డ్రైవర్లకు వ్యక్తిగతంగా బీమా నేనే కడుతా

మన రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉండే ఆటో డ్రైవర్లు దాదాపు 5,000 మంది ఉన్నారు. వీరికి ప్రభుత్వం ఇన్సూరెన్స్ కట్టడం లేదు కాబట్టి, పార్టీ తరపున వ్యక్తిగతంగా నేను కట్టిస్తాను" అని కేటీఆర్ ప్రకటించారు. ఇలా తాము బీమా కట్టడం ద్వారా రాష్ట్రమంతటా ప్రభుత్వానికి సిగ్గు వచ్చి, "వీళ్లు కడుతున్నప్పుడు మనం ఎందుకు కట్టొద్దు" అని రాష్ట్రవ్యాప్తంగా డ్రైవర్లందరికీ బీమా కట్టే ఆలోచన వస్తుందనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం చేపడుతున్నానని ఆయన వివరించారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370